




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



కార్మికులతో ఎక్కువ గంటలు పనిచేయించనున్న లేబర్ కోడ్‌లు **06**

పార్లమెంట్ నిరవధిక వాయిదా **05**



సంపుటి 09, సంచిక: 24 | శనివారం | 20-12-2025 | మహబూబ్‌నగర్ | Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# అడవులు వీడి జనంలోకి..

## రాష్ట్రంలో 41 మంది మావోయిస్టుల లొంగుబాటు

- ఆయుధాలతో పాటు భారీ మందుగుండు సామగ్రి అప్పగింత
- 'ఆపరేషన్ కగార్' ముగింపులోపే లొంగిపోండి
- మావోయిస్టులకు డిజిపి శివధర్‌రెడ్డి పిలుపు



ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం మొదలు పెట్టిన 'ఆపరేషన్ కగార్' వచ్చే ఏడాది మార్చి 31తో గడువు ముగియకముందే ప్రభుత్వం ముందు లొంగిపోవాలని, వారందరికీ పునరావాసం కల్పిస్తామని తెలంగాణ డిజిపి బి.శివధర్‌రెడ్డి మరోసారి మావోయిస్టులకు పిలుపునిచ్చారు. తాజాగా మరో 41 మంది మావోయిస్టులు 24 ఆయుధాలతో డిజిపి శివధర్‌రెడ్డి ముందు లొంగిపోయారు. డిజిపి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మీడియా ముందు వారిని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ, నిషేధిత సిపిఐ (మావోయిస్టు) పార్టీకి తెలంగాణలో మరో భారీ ఎదురుదెబ్బ తగిలిందన్నారు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డికెఎస్‌జెడ్‌సి)కి చెందిన 41 మంది మావోయిస్టు క్యాడర్ తరువాయి 2లో

### మళ్లీ పేలిన తూటాలు

- ఛత్తీస్‌గఢ్ బిజాపూర్‌లో ఎన్‌కౌంటర్
- రూ. 5 లక్షల రివార్డు ఉన్న మావోయిస్టు మృతి

**బిజాపూర్ :** ఛత్తీస్‌గఢ్‌లో కాల్పుల మోత మోగుతోంది. బిజాపూర్ జిల్లాలో శుక్రవారం భద్రతా సిబ్బందితో జరిగిన ఎదురుకాల్పుల్లో రూ. 5 లక్షల రివార్డు ఉన్న ఒక నక్సలైట్ మరణించినట్లు పోలీసు అధికారి తెలిపారు. భైరామ్‌గఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆద్వాడ–కోట్‌మెట అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారం మేరకు జిల్లా తరువాయి 2లో




## ప్రభాకర్‌రావు కస్టడీ పొడిగింపు

- ఫోన్ ట్యాపింగ్ కేసులో ఈనెల 25 వరకు పొడిగించిన సుప్రీం కోర్టు
- మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, మాజీ ఎస్ఐబి చీఫ్ ప్రభాకర్‌రావు కస్టడీని సుప్రీం కోర్టు ఈనెల 25 వరకు పొడిగించింది. విచారణకు ఆయన తరువాయి 2లో



## 'ఆదివారం' బడ్జెట్

- 2026 ఫిబ్రవరి 1న ఆదివారం
- పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టడంపై సందిగ్ధత

**న్యూఢిల్లీ :** గత కొన్ని ఏళ్లుగా కొనసాగిస్తున్న పార్లమెంటరీ సంప్రదాయాన్ని మోదీ సర్కార్ పాటిస్తే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సాధారణ బడ్జెట్‌ను ఆదివారం నాడు ప్రవేశపెట్టనున్నారు. 2017 నుండి బడ్జెట్‌ను ఫిబ్రవరి మొదటి తేదీన ప్రవేశపెడుతున్నారు. అయితే 2026లో ఫిబ్రవరి 1వతేదీ ఆదివారం వస్తుంది. కాగా, ఈ విషయమై తరువాయి 12లో

## పిఎసిఎస్ చైర్మన్లు, డైరెక్టర్ల పాలకవర్గాలు రద్దు

### 9 జిల్లాల డిసిసిబిలు తొలగింపు

- రైతు సేవా సహకార సంఘాలకు పర్సనల్ ఇన్‌చార్జీల నియామకానికి ప్రభుత్వ అనుమతి
- పర్సనల్ ఇన్‌చార్జీ కమిటీలు తదుపరి ఆదేశాలు వచ్చేవరకు కొనసాగింపు



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో వ్యవసాయ, సహకార పరపతి సంఘాల చైర్మన్లు, డైరెక్టర్ల పాలక వర్గాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. వారి పదవీకాలం ఆగస్టు14వ తేదీతో ముగిసినట్టు స్పష్టం చేసింది. వీరితో పాటు తొమ్మిది జిల్లాల డిసిసిబిలను కూడా తొలగించింది. పిఎసిఎస్,లార్జ్ సైజ్డ్ కోఆపరేటివ్ సంఘాలు, రైతు సేవా సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించేందుకు సహకార శాఖకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీలు ఆరు నెలల పాటు లేదా ఎన్నికలు జరిగే వరకు, ప్రభుత్వం తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఏది ముందుగా జరిగితే అంతవరకు కొనసాగనున్నాయి. కొత్తగా ఏర్పాటైన మండలాల ప్రకారం పిఎసిఎస్‌లను పునర్వ్యవస్థీకరించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తరువాయి 2లో

20 ఏళ్ల నాటి పథకం

## ఒక్క రోజులో భూస్థాపితం

- మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ (ఎంజి నరేగా) పథకం రద్దుపై రాహుల్‌గాంధీ మండిపాటు
- 'విబి– జి రామ్ జి' చట్టాన్ని గ్రామవ్యతిరేకిగా అభివర్ణించిన ప్రతిపక్షనేత



**న్యూఢిల్లీ :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (ఎంజి నరేగా) పథకం రద్దుపై కాంగ్రెస్ తీవ్రంగా విరుచుకుపడింది. 20 ఏళ్ల నాటి పథకాన్ని మోదీ సర్కార్ ఒక్క రోజులో సమాధి చేసిందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. ఎంజి నరేగా స్థానంలో కొత్తగా తరువాయి 2లో



## రామ జపంతో దగా

- కూలీల పొట్టకొట్టేందుకు మోదీ సర్కార్ కుట్రలు
- గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని ఓ స్కీమ్‌గా మార్చారు
- కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై వామపక్షాలు ధ్వజం

- 'విబి జి రామ్ జి'కి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలకు పిలుపు
- 22న హైదరాబాద్‌లో, 23న గ్రామీణ ప్రాంతాల్లో కార్యక్రమాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

పోరాటాల ద్వారా సాధించుకున్న ఉపాధి కూలీల హక్కులను కాలరాస్తూ, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా తీసుకువచ్చిన 'వికసిత్ భారత్ రోజ్‌గార్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) బిల్లు–2025ను (విబి జి రామ్ జి) నిరసిస్తూ ఈ నెల 22న దేశ వ్యాప్తంగా జరుగుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వామపక్ష పార్టీలు ప్రకటించాయి. ఆ మరుసటి రోజు 23వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించాయి. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం శ్రీరాముని పేరుతో ప్రజలను మోసం చేస్తుందని, కూలీల పొట్ట కొట్టేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించాయి. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఒక స్కీమ్‌గా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశాయి. వామపక్ష పార్టీల రాష్ట్ర సమావేశం హైదరాబాద్‌లోని సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో శుక్రవారం జరిగింది. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహ, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సిపిఐ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కె.గోవర్ధన్, సిపిఐ (ఎం.ఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు అన్వేష్, ఎంసిపిఐ నాయకులు గాదగోని రవి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకుడు ఆర్.వి.ప్రసాద్, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జి.నర్సింహ రావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్రం తీసుకొచ్చిన 'విబి జి రామ్ జి బిల్లు' అంశంపై సమావేశంలో చర్చించారు. ఉపాధి కూలీల పట్ల కేంద్రం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరి, వారి తరువాయి 12లో

### మహాత్మాగాంధీ పేరును తొలగించడం సరికాదు

సిపిఐ మాజీ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ అజీజ్ పాషా

03



## ఉత్తరాదిని కప్పేసిన పొగమంచు

- ఢిల్లీకి రెడ్ అలర్ట్
- 150కి పైగా విమాన సర్వీసులు రద్దు

**న్యూఢిల్లీ :** ఉత్తర భారతాన్ని పొగమంచు కప్పేసింది. దీంతో శుక్రవారం ఉదయం 100 మీటర్ల దూరంలో ఉన్న వాహనాలు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఢిల్లీకి భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. రోడ్డు, రైలు, వాయు మార్గాల్లో తరువాయి 12లో

## ప్రతి ఇల్లూ లైబ్రరీగా మారాలి

- ప్రతి జిల్లా కేంద్రంలో ఏటా పుస్తక ప్రదర్శనలను నిర్వహించాలి
- ఇందుకు రూ.3 కోట్లు కేటాయిస్తాం
- స్థలం కేటాయింపునకు కృషి
- హైదరాబాద్ బుక్ ఫెయిర్ ప్రారంభోత్సవంలో మంత్రి జూపల్లి కృష్ణారావు



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రతి ఇల్లు ఒక లైబ్రరీగా మారి, పుస్తక పఠనం పెంపొందించేలా అందరూ బాధ్యత తీసుకోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ లాంటి కార్యక్రమాలు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని, అందుకోసం ప్రతి జిల్లాకు రూ. 10 లక్షల చొప్పున మొత్తం రూ.3 కోట్లు ప్రభుత్వం తరపున కేటాయిస్తామని మంత్రి ప్రకటించారు. హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన 38వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌ను శుక్రవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ కోటి రూపాయలతో పుస్తకాలను కొనుగోలు చేసి రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాలతో పాటు మహిళ సంఘాల తరువాయి 2లో



'రాగూర్'కు అవమానంతో షురూ...

## మహాత్ముడికి అవమానంతో ముగింపు

పార్లమెంట్ శీతాకాల సమావేశాలపై కాంగ్రెస్ విమర్శలు

పార్లమెంట్ ఔచిత్యం క్రమంగా తగ్గడం

## ప్రజాస్వామ్యానికి తీవ్ర ప్రమాదకరం

రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ ధ్వజం

05



గ్రామ పంచాయతీలలో

## ప్రజా రంజక పాలన

- సమస్యల పరిష్కారమే ప్రథమ ఎజెండా
- ఒంటరి పోరులో అనూహ్య విజయాలు
- కొందరు మాటలు జారడం మానుకుంటే మంచిది
- అభినందన సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ అజేయ శక్తిగా నిలిచిందని, అవాకులు చెవాకులు పేలిన వారి నోళ్లు ఒక్క సారిగా మూతపడ్డాయని, గెలిచిన సిపిఐ సర్పంచ్‌లు, వార్డు సభ్యుల నిస్వార్థంగా, పారదర్శకంగా ప్రజారంజక పాలన అందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. నూతనంగా గెలుపొందిన సర్పంచ్‌లు, వార్డుసభ్యుల అభినందన సభ శుక్రవారం స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తరువాయి 12లో

## బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తత

- తిరుగుబాటు నేత హాది మృతితో దేశవ్యాప్తంగా నిరసనలు
- పలు ప్రాంతాల్లో ఆందోళనలు, విధ్వంసాలు
- 12 మందిని అదుపులోకి తీసుకున్న అధికారులు
- ఢాకా మూకదాడిలో ఒకరి మృతి

**ఢాకా/న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్‌లో ఉవ్వెత్తున ఎగసిపడి, ప్రభుత్వ మార్పుకు కారణమైన జులై తిరుగుబాటు ఉద్యమానికి చెందిన ప్రముఖ నేత షరీఫ్ ఒస్మాన్ హాది మృతి చెందిన నేపథ్యంలో శుక్రవారం దేశ వ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దేశవ్యాప్తంగా నిరసనలు, హింసాత్మక ఘటనలు, ఆస్తుల విధ్వంసం చోటుచేసుకున్నాయి. ఉదయం పెద్దగా హింసాత్మక ఘటనలు నమోదుకాకపోయినా, ఇప్పటికే కూల్చివేసిన ఢాకాలోని 32 ధన్మండీ భవన అవశేషాలను నిరసనకారులు ధ్వంసం చేశారు. ఈ భవనం బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు షేక్ ముజిబుర్ రహ్మాన్ నివాసంగా చారిత్రక ప్రాధాన్యం తరువాయి 2లో





# ప్రపంచం
WORLD NEWS

## ఉక్రేన్‌కు 90 బిలియన్ యూరోల రుణం
### ఇయు నేతల ఆమోదం

**బ్రస్సెల్స్ :** రష్యా–ఉక్రేన్ మధ్య యుద్ధ విరమణకు ప్రయత్నిస్తున్నట్లు ఒక వైపు అమెరికా ప్రకటిస్తుండగా, మరోవైపు యూరోపియన్ యూనియన్ (ఇయు) యుద్ధాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తున్నది. వచ్చే రెండేళ్లలో ఉక్రేన్ సైనిక, ఆర్థిక అవసరాలను తీర్చేందుకు 90 బిలియన్ యూరోల (సుమారు 106 బిలియన్ డాలర్లు) వడ్డీ రహిత రుణాన్ని ఇవ్వడానికి ఇయు నేతలు శుక్రవారం అంగీకరించారు. ఈ విషయాన్ని ఇయు కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా వెల్లడించారు. ఈ విషయంపై ఏకీభావానికి వచ్చామని, 2026–27 సంవత్సరాలలో ఉక్రేన్‌కు 90 బిలియన్ యూరోల మద్దతు ఇవ్వాలన్న తీర్మానాన్ని ఆమోదించామని తెలిపారు. అయితే, ఈ నిధులు ఎలా సమీకరిస్తారన్న వివరాలను ఆయన వెల్లడించలేదు. కాగా, ఈ రుణానికి మద్దతు ఇస్తే రష్యా ప్రతీకార చర్యలకు పాల్పడే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేసిన బెల్జియం భద్రతా హామీలు ఇచ్చేందుకు ఇయు నేతలు గురువారం రాత్రి వరకు చర్చలు జరిపినట్లు అధికారులు తెలిపారు.

## భారత్‌తో మెరుగైన భాగస్వామ్యం
# రక్షణ విధాన బిల్లుకు ట్రంప్ ఆమోదం

**న్యూయార్క్/వాషింగ్టన్ :** భారత్‌తో మరింత లోతైన సహకారాన్ని విస్తరించాల్సిన అవసరాన్ని ప్రస్తావించే వార్షిక రక్షణ విధాన బిల్లుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చట్టబద్ధత కల్పించారు. ఇండోపసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛాయుత, తెరిచిన వ్యవస్థను బలోపేతం చేయడంలో క్వాడ్ (క్వాడ్ సెక్యూరిటీ డైలాగ్) వేదికగా ఈ సంతకం జరిగింది. 2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నేషనల్ డిఫెన్స్ ఆథరైజేషన్ యాక్ట్ (ఎన్‌డిఎఏ) అమెరికా రక్షణ శాఖ, జాతీయ భద్రతా కార్యక్రమాలు, విదేశాంగ శాఖ, హోంల్యాండ్ సెక్యూరిటీ, గూఢచారి వ్యవస్థ తదితర విభాగాలకు నిధుల కేటాయింపులను ఆమోదిస్తుంది. కాగా, ఈ చట్టం శాంతి ద్వారా బలం అనే తన కార్యాచరణను అమలు చేయడంలో సహాయపడుతుందని ట్రంప్ తెలిపారు. ఈ బిల్లులో ఇండోపసిఫిక్ ప్రాంతంలో రక్షణ కూటములను, భాగస్వామ్యాలపై కాంగ్రెస్ అభిప్రాయాన్ని స్పష్టం చేస్తూ, చైనాతో వ్యూహాత్మక పోటీలో అమెరికా ఆధిక్యతను పెంపొందించేందుకు చర్యలు కొనసాగించాలని రక్షణ కార్యదర్శికి సూచించింది. ఈ క్రమంలో క్వాడ్ ద్వారా భారత్‌తో ద్వైపాక్షిక, బహుళపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడం, సంయుక్త సైనిక విన్యాసాలు, రక్షణ వాణిజ్య విస్తరణ, మానవతా సహాయం, విపత్తు నిర్వహణ, సముద్ర భద్రత రంగాల్లో సహకారాన్ని పెంచాలని పేర్కొంది. అదే విధంగా ఇండో–పసిఫిక్‌లోని మిత్రదేశాలు, భాగస్వామ్య దేశాల రక్షణ పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంచే భద్రతా పథకాన్ని ఏర్పాటు చేయాలని ఈ చట్టం సూచించింది. ఇందులో భారత్, ఆస్ట్రేలియా, జపాన్, దక్షిణ కొరియా, ఫిలిప్పీన్స్, న్యూజిలాండ్ వంటి దేశాలను భాగస్వాములుగా చేర్చే అవకాశం ఉందని పేర్కొంది. ఇంకొక కీలక అంశంగా, భారత్–అమెరికా మధ్య పౌర అణు శక్తి ఒప్పంద అమలుపై సంయుక్త అంచనాకు ఒక సంప్రదింపుల వ్యవస్థ ఏర్పాటు చేయాలని కూడా ఈ చట్టం ప్రతిపాదించింది. భారత్‌లో అణు బాధ్యత నిబంధనలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దే అవకాశాలపై చర్చలు జరపాలని సూచించింది.






**కొంతమంది నేచురలైజ్ అమెరికన్ల పౌరసత్వం రద్దు యోచన!**

వలసలపై కఠిన చర్యల్లో భాగంగా, కొంతమంది సహజీకృత (నేచురలైజ్డ్) అమెరికన్ల పౌరసత్వాన్ని రద్దు చేసే యోచనలో ట్రంప్ ప్రభుత్వం ఉన్నట్లు న్యూయార్క్ టైమ్స్ నివేదిక వెల్లడించింది. రెండు రోజుల క్రితం జారీ చేసిన అంతర్గత మార్గదర్శకాలను ఉటంకిస్తూ, 2026 ఆర్థిక సంవత్సరంలో ప్రతి నెలా 100 నుంచి 200 వరకు డీనేచురలైజేషన్ (పౌరసత్వ రద్దు) కేసులను ఇమిగ్రేషన్ లిటిగేషన్ కార్యాలయానికి పంపించాలని యుఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యుఎస్‌సిఐఎస్) ఫీల్ కార్యాలయాలను ఆదేశించినట్లు నివేదిక పేర్కొంది. ప్రస్తుతం ఫెడరల్ చట్టాల ప్రకారం పౌరసత్వం పొందే సమయంలో మోసం చేసిన వారిపై మాత్రమే ఇలాంటి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అయితే తాజా మార్గదర్శకాలు ఆధునిక కాలంలో పౌరసత్వ రద్దు చర్యలను భారీగా విస్తరించినట్లవుతాయని నివేదిక హెచ్చరించింది. నిజాయితీగా దరఖాస్తుల్లో పొరపాట్లు చేసిన వారిపైనా ప్రభావం పడే అవకాశం ఉందని, ఇది చట్టబద్ధ పౌరుల్లో భయాందోళనలకు దారితీయవచ్చని పేర్కొంది. అమెరికాలో ప్రస్తుతం సుమారు 2.6 కోట్ల మంది నేచురలైజ్డ్ పౌరులు ఉన్నారని జనగణన విభాగం గణాంకాలను నివేదిక ప్రస్తావించింది. గత ఏడాది 8 లక్షల మందికి పైగా కొత్త పౌరులు ప్రమాణ స్వీకారం చేశారని, వీరిలో ఎక్కువ మంది మెక్సికో, భారత్, ఫిలిప్పీన్స్, డొమినికన్ రిపబ్లిక్, వియత్నాం దేశాల్లో జన్మించిన వారని యుఎస్‌సిఐఎస్ అంచనాలు తెలిపాయి. తాజాగా విడుదలైన మార్గదర్శకాలపై మాజీ అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. పౌరసత్వ రద్దుకు సంఖ్యా లక్ష్యాలు విధించడం రాజకీయ అంశంగా మారి, వివాదాలకు దారితీస్తుందని, అరుదైన చర్యను సాధారణ ఆయుధంగా మార్చేస్తుందని యుఎస్‌సిఐఎస్ మాజీ అధికారి సారా పియర్స్ ఆందోళన వ్యక్తం చేశారు.

## డబ్ల్యుటిఒలో భారత్‌పై చైనా ఫిర్యాదు




**బీజింగ్ :** ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ)లో భారత్‌పై చైనా ఒక అధికారిక పిటిషన్ దాఖలు చేసింది. దీనిలో రెండు ప్రధాన అంశాలను ప్రస్తావిస్తూ, సంప్రదింపులు అవసరమని కోరింది. ఐటిసి ఉత్పత్తులు (సమాచార–సంచార సాంకేతిక ఉత్పత్తులు)పై భారత్ ఎక్కువ సుంకాలు విధిస్తున్నదని, ఇది డబ్ల్యుటిఒ నిబంధనలకు విరుద్ధమని చైనా అంటోంది. అదే విధంగా సోలార్ రంగంలో, భారత్ తన దేశీయ కంపెనీలకు ప్రత్యేక ప్రభుత్వ సబ్సిడీలు ఇస్తోందని, ఇవి దిగుమతుల స్థానంలో దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ఉద్దేశించినవని ఆరోపిస్తున్నది. డబ్ల్యుటిఒ అనుమతించిన పరిమితుల కంటే ఇవి ఎక్కువగా ఉన్నాయని, కాబట్టి, భారత్ అంతర్జాతీయ వాణిజ్య సూత్రాలను ఉల్లంఘిస్తున్నట్టు భావించాల్సి వస్తుందని తెలిపింది. డబ్ల్యుటిఒ మార్గదర్శకాలను అనుసరించి, విదేశీ ఉత్పత్తులను, దేశీయ ఉత్పత్తులతో సమానంగా చూడాలనీ, కానీ భారత్ తన దేశీయ పరిశ్రమలను సమర్థిస్తూ, విపరీతమైన ప్రయోజనం చేకూరుస్తున్నదని ఆ ఫిర్యాదులో తెలిపింది. భారత్ తన డబ్ల్యుటిఒ వాగ్దానాలను గౌరవించాలని, ఈ సుంకాలు, సబ్సిడీలను తక్షణమే సవరించాలని కోరింది. కాగా, భారత్‌పై చైనా డబ్ల్యుటిఒలో ఫిర్యాదు చేయడం ఈ ఏడాది ఇది రెండోసారి. అక్టోబర్ మాసంలో ఎలక్ట్రిక్ వాహనాలు (ఇవిలు), బ్యాటరీలపై సబ్సిడీల అంశాన్ని ప్రస్తావించింది. భారత్ చర్యలు అంతర్జాతీయ వాణిజ్య నియమాలకు వ్యతిరేకమని చైనా పేర్కొంది. పరిశీలకులు దీనిని భారత్–చైనా మధ్య వాణిజ్య పెరుగుతున్న ఉద్రిక్తతలకు మరో ఉదాహరణగా పేర్కొంటున్నారు.

## సింగపూర్‌లో చికిత్స పొందుతూ...
# బంగ్లాదేశ్ ఉద్యమ నేత షరీఫ్ మృతి



**ఢాకా :** జులై తిరుగుబాటుకు చెందిన ప్రముఖ నేత షరీఫ్ ఒస్మాన్ హాది సింగపూర్‌లో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. గత వారం ఢాకా నగరంలోని బిజోయ్‌నగర్ ప్రాంతంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన సమయంలో గుర్తు తెలియని దుండగులు ఆయనపై కాల్పులు జరపగా, తలకు బుల్లెట్ గాయం కావడంతో పరిస్థితి విషమించిన విషయం తెలిసిందే. ఆరు రోజులుగా మృత్యువుతో పోరాడిన హాది చివరకు ప్రాణాలు కోల్పోయారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న జరగనున్న సాధారణ ఎన్నికల్లో హాది అభ్యర్థిగా ఉన్నారు. కాల్పుల్లో గాయపడిన ఆయన పరిస్థితి అత్యంత ప్రమాదకరమని వైద్యులు చెప్పడంతో మధ్యంతర ప్రభుత్వం సోమవారం ప్రత్యేక విమానంలో సింగపూర్‌కు తరలించింది. కాగా, యూనస్ హాది మృతిపై బంగ్లాదేశ్ చీఫ్ అడ్వైజర్ మహమ్మద్ యూనస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశాన్ని ఉద్దేశించి ప్రసంగించిన ఆయన, జులై ఉద్యమానికి ముందుండి పోరాడిన ధైర్యవంతుడు హాది ఇక లేరని అన్నారు. హత్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రజలు సంయమనం పాటించాలని, చట్ట అమలు సంస్థలకు దర్యాప్తు చేసే అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. యూనస్ ప్రభుత్వం శనివారం ఒకరోజు రాష్ట్ర సంతాప దినంగా ప్రకటించింది. దేశవ్యాప్తంగా జెండాలను అవతనం చేశారు. శుక్రవారం ప్రార్థనల అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హాది భార్య, ఏకైక సంతాన బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని యూనస్ తెలిపారు. హంతకుల సమాచారం ఇచ్చేవారికి టాకా 50 లక్షల బహుమతి ప్రకటించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

## మయామీకి క్రెమ్లిన్ దౌత్యవేత్త

**మాస్కో :** ఉక్రేన్ యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా ప్రతిపాదించిన శాంతి ప్రణాళికపై చర్చల కోసం క్రెమ్లిన్‌కు చెందిన ప్రత్యేక దౌత్యవేత్త త్వరలో అమెరికా వెళ్లనున్నారు. రష్యా సార్వభౌమ సంపద నిధి అధిపతి కిరిల్ ద్మిత్రీవ్ శనివారం ఫ్లోరిడాలోని మయామీలో అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ దౌత్యవేత్త స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్‌లతో భేటీ కానున్నట్లు అమెరికా అధికారి ఒకరు తెలిపారు. బెర్లిన్‌లో ఉక్రేన్, యూరోపియన్ నేతలతో సమావేశాల అనంతరం ఈ చర్చలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో కీవ్‌కు భద్రతా హామీలు, భూభాగ రాయితీలు సహా యుద్ధ విరమణకు సంబంధించిన అంశాలు చర్చకు వస్తాయని అధికారులు తెలిపారు. బెర్లిన్ చర్చల ఫలితాలను తెలుసుకునేందుకు అమెరికాతో సంప్రదింపులకు సిద్ధమవుతున్నామని మయామీ భేటీపై స్పందించిన క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ చెప్పారు. 2022, ఫిబ్రవరి 24న ప్రారంభమైన రష్యా–ఉక్రేన్ యుద్ధాన్ని ముగించేందుకు ట్రంప్ ప్రభుత్వం దౌత్య ప్రయత్నాలు ముమ్మరం చేసినప్పటికీ, మాస్కో–కీవ్‌ల మధ్య భిన్న డిమాండ్లు అడ్డంకిగా మారుతున్న విషయం తెలిసిందే.

క్రెమ్లిన్ షరతులను అంగీకరించకపోతే ఉక్రేన్‌లో తన ఆధీనాన్ని విస్తరించేందుకు ప్రయత్నిస్తామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇటీవల హెచ్చరించారు. ఇదిలా ఉండగా, నాటోలో చేరే అంశంపై ఉక్రేన్ వైఖరి మారలేదని అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీ స్పష్టం చేశారు.

## రైల్వేలో తొలిసారిగా కారుణ్య నియామకాల అదాలత్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే అధికారులు తొలిసారిగా కారుణ్య నియామకాల అదాలత్ నిర్వహించారు.సికింద్రాబాద్ డివిజన్ ప్రధాన కార్యాలయంలోని హవా మహల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. మరణించిన ఉద్యోగుల అర్హత కలిగిన కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించడానికి ఈ అదాలత్ ద్వారా పారదర్శకంగా కారుణ్య నియామకాలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్ అధ్యక్షతన ఈ అదాలత్ నిర్వహించారు. మరణించిన ఉద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కుటుంబాలను ఆదుకునేందుకు తొలి సారిగా రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు. ఈ అదాలత్‌లో మొత్తం 49 మంది కారుణ్య నియామకాలను ఆశిస్తున్న అభ్యర్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. సమస్యలను పరిష్కరించడానికి, అర్హత కలిగిన కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించడానికి జనరల్ మేనేజర్ తీసుకున్న చర్యలను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ప్రసంశించారు.



## పాలకవర్గాలు రద్దు (మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం తెలిపింది. ఇందుకు సహకార చట్టంలోని ప్రత్యేక అధికారాలను వినియోగించింది. కాగా, వ్యవసాయాభివృద్ధి, రైతు సంక్షేమం దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను (పిఎసిఎస్) ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ సహకార సొసైటీల నిర్వహణకు ఎన్నికల ద్వారా పాలకవర్గాలను నియమిస్తుంది. సొసైటీల సామర్థ్యాలకు అనుగుణంగా ఒక చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు ఉంటారు. ఎన్నికైన పాలకవర్గాలు ప్రభుత్వం ద్వారా వ్యవసాయ, దాని అనుబంధ రంగాల అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి అమలయ్యే పథకాలను అందిస్తాయి. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఎన్నికల ద్వారా పాలకవర్గాలు నియమితలవుతారు. గత ప్రభుత్వంలో 2020 ఫిబ్రవరి 13న ఎన్నికలు జరిగాయి. వీటి పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరితో ముగియడంతో వారి పదవీ కాలాన్ని పొడిగించిన 6 నెలల గడువు కూడా ముగిసింది. దీంతో పాలక వర్గాలను ప్రభుత్వం రద్దు చేసింది.

## మళ్లీ పేలిన తూటాలు
(మొదటి పేజీ తరువాయి)

రిజర్వ్ గార్డ్ బృందం నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ నిర్వహించింది. ఈ క్రమంలో ఉదయం ఎన్‌కౌంటర్ జరిగినట్లు ఆయన తెలిపారు. ఎదురుకాల్పులు ముగిసిన తర్వాత ఎన్‌కౌంటర్ స్థలం నుండి ఒక నక్సలైట్ మృతదేహంతో పాటు ఒక .303 రైఫిల్, ఒక 9ఎంఎం పిస్టల్, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. మృతి చెందిన మావోయిస్టును ఫగ్ను మాద్వి (35)గా గుర్తించామని, అతను మావోయిస్టుల భైరామ్‌గఢ్ ఏరియా కమిటీలో సభ్యుడిగా చురుకుగా పనిచేస్తున్నాడని, అతనిపై రూ.5 లక్షల రివార్డు ఉందని ఆయన తెలిపారు. అంతేకాకుండా, ఘటనా స్థలం నుండి రెండు స్కానర్ సెట్లు, రేడియో, మెడికల్ కిట్, కార్డెక్స్ వైర్, మావోయిస్టు బ్యాగ్, కరపత్రాలు, ఇతర వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్‌రాజ్ పట్టిలింగం మాట్లాడుతూ భద్రతా దళాల సమర్థవంతమైన, సమన్వయ చర్యల కారణంగా బస్తర్‌లో మావోయిజం ఇప్పుడు చివరి దశలో ఉందన్నారు. హింసా మార్గాన్ని విడనాడి, ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని పట్టిలింగం క్రియాశీల మావోయిస్టులందరికీ విజ్ఞప్తి చేశారు. తాజా చర్యతో ఈ ఏడాది ఇప్పటివరకు ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పుల్లో 285 మంది నక్సలైట్లు మరణించారు. వీరిలో, బిజాపూర్ సహా ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ డివిజన్‌లో 256 మందిని, రాయ్‌పూర్ డివిజన్‌లోని గరియాబంద్ జిల్లాలో 27 మందిని కాల్చిచంపారు. దుర్గ్ డివిజన్‌లోని మోహ్లామాన్‌పూర్‌అంబాగఢ్ చౌకీ జిల్లాలో ఇద్దరు నక్సలైట్లు మరణించారు. గురువారం, బస్తర్ ప్రాంతంలోని సుక్మా జిల్లాలో భద్రతా సిబ్బందితో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు నక్సలైట్లు మరణించారు.



## లైబ్రరీగా మారాలి (మొదటి పేజీ తరువాయి)

సభ్యులకు అందుబాటులో ఉండేలా చూస్తామని వెల్లడించారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ అభ్యర్థన మేరకు సిఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి, స్థలం కేటాయించేలా కృషి చేస్తానని జూపల్లి కృష్ణారావు హామీ ఇచ్చారు. నేటి సమాజంలో నైతిక విలువలు తగ్గిపోతున్నాయని, మానవ విలువలను పెంపొందించడానికి రచయితలు, సాహితీవేత్తలు, రచయితలు పూనుకోవాలని సూచించారు. అనాటి పుస్తకాలు చదివిన వారి విజ్ఞానం, ఆలోచన విధానంతో పోల్చితే, నేడు అవేమి కనిపించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి సమాజంలో పుస్తకాలు కేవలం ర్యాంకులు, ఉద్యోగాల కోసం మాత్రమే చదువుతున్నారే తప్ప మానవత విలువల కోసం కాదన్నారు. పుస్తకాలు చదవడం అలవాటుగా మార్చుకుని తనని తాను సంస్కరించుకోవడంతో పాటు సమాజ సంస్కరణ దిశగా అడుగులు వేయాలన్నారు. బుక్ ఫెయిర్ గౌరవ సలహాదారులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ పుస్తకం అంటేనే అదోక అందమైన పూదోట అన్నారు. డిజిటల్ పుస్తకం కంటే నేరుగా ఒక పుస్తకాన్ని చదివితే ఆ సంతృప్తి జీవితాంతం గుర్తుంటుందని తెలిపారు. సకుటుంబ సమేతంగా పుస్తక ప్రదర్శనను సందర్శించి, నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేయాలని కోరారు. ప్రజాకవి అందెశ్రీ పేరును 38వ బుక్‌ఫెయిర్ ప్రాంగణానికి నామకరణం చేశామని, ప్రధాన వేదికకు అనిశెట్టి రజిత పేరును, పుస్తకావిష్కరణల వేదికకు సాహితీవేత్త కొంపల్లి వెంకట్‌గౌడ్ పేరును, రైటర్స్ స్టాల్స్‌కు ప్రొఫెసర్ ఎస్‌వి.రామారావు, మీడియా స్టాల్స్‌కు స్వేచ్ఛ వొటార్కర్ పేరును పెట్టామని సొసైటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రమూర్తి, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ కవి యాకూబ్, కార్యదర్శి ఆర్.శ్రీనివాసు (వాసు), ఉపాధ్యక్షులు, కందాడి బాల్‌రెడ్డి, కోశాధికారి నారాయణరెడ్డి, సాంస్కృతిక సలహా మండలి సభ్యులు దినకర్ తదితరులు పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తత (మొదటి పేజీ తరువాయి)

కలిగినది. సింగపూర్‌లో చికిత్స పొందుతూ హాది మరణించినట్లు చీఫ్ అడ్వైజర్ మహమ్మద్ యూనస్ ప్రకటించిన తర్వాత దేశంలోని పలు ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగాయి. ఢాకాలో ప్రముఖ పత్రికల కార్యాలయాలపై దాడులు, రాజ్‌షాహీలో అవామీ లీగ్ పార్టీ కార్యాలయ ధ్వంసం జరిగాయి. చట్టాగ్రామ్‌లోని అసిస్టెంట్ ఇండియన్ హై కమిషనర్ నివాసంపై రాళ్ల దాడి జరగగా, పోలీసులు టియర్ గ్యాస్, లాఠీచార్జితో గుంపును చెదరగొట్టారు. ఈ ఘటనలో 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. భారత అధికారికి భద్రత పెంచినట్లు కూడా వెల్లడించారు. ఢాకా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నేషనల్ సిటిజన్ పార్టీ (ఎన్‌సిపి) నేతృత్వంలో నిర్వహించిన శోక ర్యాలీలో భారత్ వ్యతిరేక నినాదాలు వినిపించాయి. హాది హంతకులు భారత్‌కు పారిపోయారంటూ ఆరోపణలు చేస్తూ, వారిని అప్పగించే వరకు ఇండియన్ హై కమిషన్‌ను మూసివేయాలని కొందరు డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, ప్రముఖ సాంస్కృతిక సంస్థ ఛాయానట్ కార్యాలయంపై కూడా దాడి జరిగింది. ఇతర ప్రాంతాల్లోనూ చెల్లాచెదురు హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నట్లు సమాచారం.

**ఢాకాలో మూకదాడి.. ఒకరి మృతి**

బంగ్లాదేశ్‌లో మత దూషణ ఆరోపణలతో ఒక హిందూ యువకుడిని గుంపు దాడి చేసి హత్య చేసి, అనంతరం మృతదేహాన్ని దహనం చేసిన ఘటన వెలుగుచూసింది. మృతుడిని 25 ఏళ్ల దీపు చంద్ర దాస్‌గా గుర్తించారు. ఆయన మైమెన్సింగ్ నగరంలోని ఒక కర్మాగారంలో కార్మికుడిగా పనిచేస్తున్నారని బాంగ్లా ట్రిబ్యూన్ వార్తా వెబ్‌సైట్ తెలిపింది. మైమెన్సింగ్‌లో జరిగిన ఈ మూకదాడిని మధ్యంతర ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తూ, కొత్త బంగ్లాదేశ్‌లో ఇలాంటి హింసకు స్థానం లేదు. ఈ హేయమైన నేరానికి పాల్పడినవారిని విడిచిపెట్టబోమని ప్రకటిం చిం ది. మత దూషణలకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ, కొంత మంది అతనిపై కర్మాగారం వెలుపల దాడి చేసి, అనంతరం చెట్టుకు ఉరివేసినట్టు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఢాకా–మైమెన్సింగ్ జాతీ య రహదారి పక్కన వదిలి నిప్పంటించడంతో రెండు వైపులా ట్రాఫిక్ నిలిచిపోయిందని భాలుకా మోడల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ మాలెక్ చెప్పారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం మైమెన్సింగ్ మెడికల్ కాలేజీ మోర్గ్‌కు తరలించారు. ఈ ఘటనతో ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొందని, పరిస్థితిని అదుపులోకి తీసుకు రావడానికి చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు. ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. 'హింస, బెదిరింపులు, అగ్నిప్రమాదాలు, ఆస్తుల విధ్వంసం వంటి అన్ని చర్యలను మేము కఠినంగా ఖండిస్తు న్నాం' అని మధ్యంతర ప్రభుత్వం పేర్కొంది.

## కస్టడీ పొడిగింపు (మొదటి పేజీ తరువాయి)

ఏమాత్రం సహకరించడం లేదని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సమర్పించిన నివేదికను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుపై జస్టిస్ బివి నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం ఈరోజు విచారణ చేపట్టింది. గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలతో డిసెంబర్ 12న ప్రభాకర్‌రావు లొంగిపోయిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి వారం రోజుల పాటు ఆయన్ను విచారించిన సిట్, కస్టోడియల్ రిపోర్టును కోర్టుకు సమర్పించింది. నిందితుడు విచారణలో కీలక సమాచారం ఇవ్వకుండా, దర్యాప్తునకు సహకరించడం లేదని సిట్ తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు మరోసారి కస్టోడియల్ విచారణ అవసరమని అభ్యర్థించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, సిట్ అభ్యర్థనను అంగీకరించింది. ఈనెల 25 వరకు ప్రభాకర్‌రావును సిట్ కస్టడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో ఈ కేసులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## జనంలోకి.. (మొదటి పేజీ తరువాయి)

ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో చేరారన్నారు. ఈ లొంగుబాటుతో పార్టీకి కోలుకోలేని నష్టం వాటిల్లినట్లు తెలిపారు. లొంగిపోయిన వారిలో దాదాపు 24 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్న ఎర్రగొల్ల రవి అలియాస్ సంతోష్ (డివిసిఎం), 21 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్న కోర్సా లచ్చు (సివైపిసిఎం) కనికారపు ప్రభంజన్, అర్బన్ ఏరియా, పిడిఎస్‌యు సభ్యుడితో పాటు ఆరుగురు డివిజనల్ కమిటీ సభ్యులు (డివిసిఎం), 12 మంది ఏరియా కమిటీ సభ్యులు (ఎసిఎం)లు, 23 మంది పార్టీ సభ్యులు ఉన్నారని తెలిపారు. ఈ మేరకు వారి నుంచి ఒక ఇన్సాఫ్ ఎల్‌ఎంజి గన్స్, మూడు ఎకె47 రైఫిల్స్, ఐదు ఎస్‌ఎల్‌ఆర్‌లు, ఏడు ఇన్‌సాఫ్ రైఫిల్స్, ఒక బిజిఎల్ గన్, నాలుగు యుబిజిఎల్ తుపాకులు, ఒక 303 రైఫిల్, రెండు సింగిల్ షాట్ రైఫిల్స్, 24 ఎయిర్ గన్స్, 733 బిజిఎల్ షెల్స్, 08 షెల్స్ సహా భారీ మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ ఆయుధాల మొత్తం విలువ రూ.కోట్లలో ఉంటుందని తెలిపారు.పిలుపునిచ్చారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని భరోసానిచ్చారు. ప్రతి ఒక్కరికీ పునరావాసం ప్యాకేజీ కింద లొంగిపోయిన 41 మందికి కలిపి ప్రభుత్వం తరఫున మొత్తం రూ.1.46 కోట్ల నగదు బహుమతిని అందజేయనున్నట్లుగా తెలిపారు. తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికి రూ.25 వేలు ఇవాళ పంపిణీ చేస్తున్నామని అన్నారు. వాటితో పాటు ఆయుధాలకు విడిగా నగదు బహుమతిని కూడా ప్రభుత్వం అందిస్తుంన్నామని, వాటిలో ఎల్‌ఎంజీ రైఫిల్‌కు రూ.5 లక్షలు, ఎకె472కు రూ.4 లక్షలు ఇస్తామని అన్నారు.ఈ సమావేశంలో అదనపు డిజిపి మహేష్ భగవత్, ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్‌కుమార్, ఎస్ఐబి చీఫ్ బి.సుమతిలతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

**ఈ ఏడాది లొంగియింది 509 మంది..**

ఈ ఏడాది ఇప్పటి వరకు 509 మంది మావోయిస్టులు తెలంగాణ ప్రభుత్వం ముందు లొంగిపోయారు. వీరిలో ఇద్దరు కేంద్ర కమిటి సభ్యులు, 11 మంది రాష్ట్ర కమిటి సభ్యులు, ముగ్గురు డివిజనల్ కమిటి కార్యదర్శులు, 17 మంది డివిజనల్ కమిటి సభ్యులు ఉన్నారు.తెలంగాణకు చెందిన మరో 54 మంది మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారు. వీరంతా ఛతీస్‌ఘడ్, ఒడిశాలలో ఉన్నారు.

## ఒక్క రోజులో భూస్థాపితం (మొదటి పేజీ తరువాయి)

తీసుకువచ్చిన 'విబి– జి రామ్ జి' చట్టాన్ని గ్రామవ్యతిరేకగా ఆయన అభివర్ణించారు. 'విబి– జి రామ్ జి' బిల్లు ఎం. నరేగా పునరుద్ధరణ కాదని రాహుల్‌గాంధీ శుక్రవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. గురువారం రాత్రి, మోదీ ప్రభుత్వం ఇరవై ఏళ్ల నాటి నరేగాను ఒక్క రోజులోనే భూస్థాపితం చేసిందని మండిపడ్డారు. ఇది హక్కుల ఆధారిత, డిమాండ్ ఆధారిత హామీని ధ్వంసం చేసి ఢిల్లీ నుండి నియంత్రించే రేషన్ పథకంగా మారుస్తుందని, ఈ పథకాన్ని రాష్ట్ర వ్యతిరేక, గ్రామ వ్యతిరేకంగా రూపొందించారని మండిపడ్డారు. జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామీణ కార్మికులకు బేరసారాలు చేసే శక్తిని ఇచ్చిందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. ఈ పథకంలో నిజమైన లబ్ధిదారుల ఎంపికతో దోపిడీ, వలసల బాధలు తగ్గాయని, వేతనాలు పెరిగాయని, పని పరిస్థితులు మెరుగుపడ్డాయని, అదే సమయంలో గ్రామీణ మౌలిక సదుపాయాలను నిర్మించడంతో పాటు పునరుద్ధరణ జరిగాయన్నారు. ఆ పరపతినే ఈ ప్రభుత్వం విచ్ఛిన్నం చేయాలనుకుంటున్నదని రాహుల్ ఆరోపించారు. పనిని పరిమితం చేయడం ద్వారా, దానిని తిరస్కరించడానికి మరిన్ని మార్గాలను సృష్టించడం ద్వారా 'విబి– జి రామ్ జి' బిల్లు గ్రామీణ పేదలు కలిగి ఉన్న ఒక సాధనాన్ని బలహీనపరుస్తుందన్నారు. కొవిడ్ సమయంలో ఎంజి నరేగా అంటే ఏమిటో అందరమూ చూశామని, ఆర్థిక వ్యవస్థ మూతపడి జీవనోపాధి కుప్పకూలినప్పుడు, ఇది కోట్లాది మంది ఆకలి, అప్పుల ఊబిలో పడకుండా కాపాడిందని ఆయన ఉద్ఘాటించారు. ఇది మహిళలకు అత్యంత సహాయపడిందని, ఏటేటా మహిళలు సగం కంటే ఎక్కువ పర్సన్‌డేలను అందించారన్నారు. 'మీరు ఉద్యోగ కార్యక్రమానికి రేషన్ ఇచ్చినప్పుడు, ముందుగా బయటకు నెట్టబడేది మహిళలు, దళితులు, ఆదివాసీలు, భూమిలేని కార్మికులు, పేద ఒబిసి వర్గాలే' అని ఆయన అన్నారు. అన్నింటి కంటే మించి ఈ చట్టాన్ని సరైన పరిశీలన లేకుండా పార్లమెంటు ద్వారా బుల్డోజర్ చేశారని, బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపాలనే ప్రతిపక్ష డిమాండ్ తిరస్కరించడం దారుణమన్నారు. కోట్లాది మంది కార్మికులను ప్రభావితం చేసే గ్రామీణ సామాజిక ఒప్పందాన్ని తిరిగి మార్చే చట్టాన్ని తీవ్రమైన కమిటీ పరిశీలన, నిపుణుల సంప్రదింపులు, ప్రజా విచారణలు లేకుండా ఎప్పటికీ అమలు చేయకూడదని హితవు పలికారు. 'ప్రధాని మోదీ లక్ష్యాలు స్పష్టంగా ఉన్నాయి: శ్రమశక్తిని బలహీనపరచడం, గ్రామీణ భారతదేశం, ముఖ్యంగా దళితులు, ఒబిసిలు, ఆదివాసీల పరపతిని బలహీనపరచడం, అధికారాన్ని కేంద్రీకరించడం, ఆపై సంస్కరణలుగా నినాదాలను అమ్మడం' అని గాంధీ అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రపంచంలోనే అత్యంత విజయవంతమైన పేదరిక నిర్మూలన, సాధికారత కార్యక్రమాలలో ఒకటి అని అన్నారు. గ్రామీణ పేదల చివరి రక్షణ కవచాన్ని ఈ ప్రభుత్వం నాశనం చేయడాన్ని తాము అనుమతించబోమన్నారు. ఈ చర్యను ఓడించడానికి, ఈ చట్టాన్ని ఉపసంహరించుకునేలా చూడటానికి కార్మికులు, పంచాయతీలు, రాష్ట్రాలకు అండగా నిలబడతామని, దేశవ్యాప్త కూటమిని నిర్మిస్తామన్నారు.



# జనరల్

STATE & REGIONAL NEWS

## సాజిద్ అక్రమ్ గురించి బయటపడ్డ సంచలన విషయాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆస్ట్రేలియాలో ఇటీవల చోటుచేసుకున్న కాల్పుల ఘటనలో ప్రధానంగా వినిపిస్తున్న పేరు సాజిద్ అక్రమ్. అతడి నేపథ్యం, వీసా ప్రయాణం, కుటుంబ జీవితం ఇప్పుడు సంచలనంగా మారాయి. దాదాపు మూడు దశాబ్దాల పాటు సాగిన అతడి ఆస్ట్రేలియా ప్రయాణంలో ఎన్నో కీలక మలుపులు ఉన్నట్టు సమాచారం.హైదరాబాద్ నాంపల్లి ప్రాంతంలోని అన్వర్ ఉల్ కాలేజీలో 1998లో బిఎ పూర్తి చేసిన సాజిద్ అక్రమ్, అదే ఏడాది నవంబర్ 8న స్టూడెంట్ వీసాపై ఆస్ట్రేలియాకు వెళ్లాడు. ఆస్ట్రేలియాలో స్థిరపడేందుకు అతడు చేసిన ప్రయత్నాలు ఫలించేందుకు దాదాపు 27 సార్లు ప్రయత్నించాల్సి వచ్చింది. చివరకు అతడికి పర్మినెంట్ రెసిడెంట్ (పిఆర్) వీసా లభించినట్టు రికార్డులు చెబుతున్నాయి. 2000లో వెన్నెసా అనే యువతితో సాజిద్ వివాహం చేసుకున్నాడు. అప్పటికే వెన్నెసాకు ఆస్ట్రేలియా పిఆర్ వీసా ఉండటం గమనార్హం. అనంతరం 2001లో సాజిద్ తన వీసాను పార్ట్నర్ వీసాగా మార్చుకున్నాడు. నవీద్‌కు కూడా పర్మినెంట్ వీసా లభించింది. ఇంతకాలం ప్రశాంతంగా సాగినట్టు కనిపించిన సాజిద్ అక్రమ్ జీవితం, తాజా కాల్పుల ఘటనతో ఒక్కసారిగా వెలుగులోకి రావడం తీవ్ర చర్చకు దారితీస్తోంది.

### 'మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం'లో..

## మహాత్మాగాంధీ పేరును తొలగించడం సరికాదు

సిపిఐ మాజీ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ అజీజ్ పాషా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచ స్థాయిలోనే ప్రజా నాయకునిగా జాతిపితగా పేరుగాంచిన మహాత్మా గాంధీ పేరును అత్యంత ముఖ్యమైన గ్రామీణ పేదరిక నిర్మూలనకు ఉద్దేశించిన పథకానికి పెట్టిన మహాత్మా గాంధీ పేరును తొలగించడం సరికాదని, దీనిని యావత్ ప్రజానీకం వ్యతిరేకించాలని సిపిఐ మాజీ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ అజీజ్ పాషా పిలుపునిచ్చారు. 'మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం'లో మహాత్మాగాంధీ పేరును తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్, మఖ్దూం భవన్‌లోని బహదూర్ గౌర్ హాల్‌లో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎఐకెఎస్) ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ అధ్యక్షతన జరిగిన సమావేశానికి సిపిఐ మాజీ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ అజీజ్ పాషా, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.కాంతయ్య, రాష్ట్ర రైతు సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి పాల్గొన్నారు.
కాగా మహాత్మా గాంధీ పేరును తొలగించవద్దని సమావేశం తీర్మానించింది. ఈ సందర్భంగా సయ్యద్ అజీజ్‌పాషా మాట్లాడుతూ గాంధీ పేరుకు ముందు మహాత్మా అని ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రకటిస్తూ, దేశానికి స్వేచ్ఛ స్వాతంత్ర్యాన్ని సాధించడంలో ప్రపంచంలోనే గాంధీ గొప్ప మహనీయుడని కొనియాడారన్నారు. సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ పాలక పార్టీ మహాత్మా గాంధీ పేరును తొలగించటం సాహసమని, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కాంతయ్య మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో ప్రజలు పనిచేసుకుని బతకగలుగుతున్నారని, అలాంటి పథకానికి మహాత్మా గాంధీ పేరును తొలగించాల్సిన అవసరం ఏంవచ్చిందని ప్రశ్నించారు.

పశ్యపద్మ మాట్లాడుతూ మహాత్మా గాంధీని నిర్దాక్షిణ్యంగా చంపివేసిన గాడ్సేకు నీరాజనాలు పలుకుతున్న ఆర్‌ఎస్‌ఎస్‌కు గాంధీ పట్ల నాడు, నేడు తీవ్రమైన వ్యతిరేకత ఉందన్నారు. ఆర్‌ఎస్ ఎస్ అడుగుజాడలలో నడిచే బిజెపి పాలకులు మహాత్మాగాంధీ పేరును గ్రామీణ ఉపాధి హామీ పథకం నుండి తొలగించడం ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ కోరికను నెరవేర్చారని విమర్శించారు. మొత్తంగా ఈ పథకాన్ని నీరుగార్చడంలో భాగంగానే కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు వినియోగించాలని సూచించారని పశ్యపద్మ అన్నారు. వామపక్ష పార్టీలు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు సంవత్సరంలో రెండు వందల రోజుల పనిని కల్పించాలని, రోజుకు రూ.700లను చెల్లించాలని, ఈ పథకాన్ని పట్టణ కూలీలకు కూడా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, నిరంతరంగా పోరాడుతున్నప్పటికీ పాలకులు పట్టించుకోలేదని విమర్శించారు. పాలకులు వికసిత్ భారత్ గ్యారెంటీ రోజుగార్, ఆ జీవికామిషన్ పేరుతో బిల్లును పార్లమెంట్‌లో చర్చకు పెట్టారని, ప్రతిపక్ష పార్టీలు దేశంలో ఆయా తరగతులకు చెందిన ప్రజలు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కుటిల రాజకీయాలకు నిరసనగా ఆగ్రహంతో ఉద్యమాలు చేపడుతున్నారని, పోరాటాలు కొనసాగుతున్నాయని వివరించారు. బిజెపి కార్యాలయాలను ముట్టడిస్తున్నారని, కేంద్ర పాలకుల నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయాలని పశ్యపద్మ పిలుపునిచ్చారు.

### ఏకపక్షంగా 'మహాత్మ గాంధీ' పేరు మార్చారు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పార్లమెంట్‌లో భిన్న అభిప్రాయాలు వ్యక్తమైనప్పటికీ ఏకపక్షంగా మహాత్మ గాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకానికి పేరు మార్చారని సిపిఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎంఎల్‌ఎ చాడ వెంకటరెడ్డి అన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం అప్రజాస్వామికంగా, రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతున్నదని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహాత్మా గాంధీపైన బిజెపికి ఉన్న కోపంతో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పేరు మార్చి, వికసిత భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, ఆజీవికా మిషన్ గ్రామీణ్ బిల్లును తీసుకొచ్చారని అన్నారు. ఈ కార్మికులకు అన్యాయం చేసేవిధంగా, రాష్ట్రాలపైన భారం మోపడానికే ఈ కొత్త చట్టాన్ని తీసుకొచ్చారని చాడ విమర్శించారు. గతంలో రాష్ట్రాల వాటా 60 శాతం ఉంటే ఇప్పుడు తగ్గించారని, ఆర్థికంగా వెనుకబడిన కొన్ని రాష్ట్రాలు ఈ పథకాన్ని అమలు చేయడం కష్టమవుతుందని తెలిపారు. వ్యవసాయ కూలీల పట్ల కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని చాడ వెంకట రెడ్డి అన్నారు.

### నైనీలో థర్మల్ పవర్ ప్లాంట్

## ఏర్పాటుపై ఆలోచిస్తాం

ఒడిస్సా సిఎం మోహన్ చరణ్ మాంజీతో తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సింగరేణి ఆధ్వర్యంలో కొనసాగుతున్న నైనీ కోల్ బ్లాక్ పిట్ హెడ్ వద్ద థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు తెలంగాణ అధికారుల బృందం అధ్యయనం చేస్తుందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ పర్యటనలో ఉన్న ఒడిస్సా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాంజీతో శుక్రవారం డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన ఇంధనశాఖ అధికారుల బృందం నైనీ ప్రాంతాన్ని సందర్శించి అంచనాలు రూపొందిస్తుందని తదుపరి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని డిప్యూటీ సిఎం వివరించారు. సమావేశంలో తెలంగాణ ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ విట్టల్, సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణభాస్కర్, సింగరేణి అధికారులు సత్యనారాయణ, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

### సర్పంచ్ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడిపోయినా విజయోత్సవాలా?

రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ ఓడిపోయినప్పటికీ కెటిఆర్ విజయోత్సవాలు, ఆత్మీయ సమ్మేళనాల పేరుతో జిల్లాల పర్యటనలు చేయడం హాస్యాస్పదమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. కెటిఆర్ పర్యటనలు అసమర్థుడి జీవయాత్రలా ఉన్నాయని, ఓడిపోయిన సర్పంచ్‌లను ఓదార్చడానికి ఆయన ఓదార్పు యాత్రలు చేస్తున్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని సిఎల్‌పి కార్యాలయంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తీరు చూస్తుంటే జాలేస్తుందని ఎద్దేవా చేశారు. ఎంఎల్‌సి కవిత వ్యవహారంతో కుప్పకూలుతున్న పార్టీని కాపాడుకోవడానికి కెటిఆర్ నానా పాట్లు పడుతున్నారని, పార్టీ ఓడిపోయాక విజయోత్సవాలు నిర్వహించడం ఆయన మానసిక స్థితిపై అనుమానం కలిగిస్తోందన్నారు. భయంతోనే కెటిఆర్ ఈ ఆత్మీయ సమ్మేళనాల హడావుడి చేస్తున్నారని విమర్శించారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్** GHMC
ఇఇ, డివిజన్-29, సికింద్రాబాద్, ఎస్‌బిజెడ్, జిహెచ్‌ఎంసి.
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు
NIT No. 36/EE-29/GHMC/2025-26, తేది: 18.12.2025
క్ర.సం. 1, NIT No. 36/EE-29/GHMC/2025-26, తేది:18.12.2025.పని పేరు: జిహెచ్‌ఎంసి, ఎస్.బి.జెడ్, సికింద్రాబాద్, జోనల్ కమిషనర్ కార్యాలయంలో కుర్చీలు, బల్లలు, ఏసీ యూనిట్లు, పివిసి పైపులు మొదలైన స్క్రాప్ సామాగ్రిని పారవేసేందుకు టెండర్. **బిడ్స్ స్వీకరించడానికి ప్రతిపాదనల ప్రారంభ మరియు ఆఖరి తేది:** 19.12.2025న సా.04.00గం.ల నుండి 29.12.2025న సా.04.00గం.ల వరకు. **కార్యాలయ చిరునామా & పేరు :** ఇఇ-సర్కిల్-29, సిటీ సివిల్ కోర్టు ఎదురుగా, సికింద్రాబాద్, ఎస్‌బిజెడ్, జిహెచ్‌ఎంసి. ఫోన్ నెం. 9704405076. మరిన్ని వివరాలను టెండర్ నోటిఫికేషన్‌లలో లేదా ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో http://www.ghmc.gov.in వద్ద లేదా ఈ కార్యాలయ నోటీసు బోర్డులో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-29, సికింద్రాబాద్, సికింద్రాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 12205-PP/CL/ADVT/1/2025-26, Date: 19-12-2025

**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ** hmda Growing Global
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, డివిజన్-VII
4వ అంతస్తు, వెస్ట్ వింగ్, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్ - 500038.
ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీస్
NIT.No. HMDA/DEV/EE(Div-VII)/03/2025-26 తేది: 19.12.2025
ఈ క్రింది పనుల కోసం చెల్లుబాటు అయ్యే రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు ఆహ్వానించబడ్డాయి:

| క్ర. సం. | పని పేరు | టెండర్ ఆహ్వానించే అధికారం |
|---|---|---|
| 1 | చెన్నాపురం ఎక్స్ రోడ్ నుండి వికలాంగుల కాలనీలోని లక్ష్మీ నర్సింహా కాలనీ కమాన్‌తో సహా వాటర్ ట్యాంక్ వరకు సిసి రోడ్డు వేయడం మరియు ZPHS బాలాజీనగర్ నుండి మెయిన్ రోడ్ అవుట్‌లెట్ వరకు 250 mm డయా SWG పైపులను వేయడం. | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-VII, హెచ్‌ఎండిఎ. |

బిడ్ సమర్పించడానికి చివరి తేదీ 24.12.2025 మధ్యాహ్నం 2.00 గంటల వరకు. మరిన్ని వివరాల కోసం https://tender.telangana.gov.in// ని సందర్శించండి.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-VII, హెచ్‌ఎండిఎ.
DIPR R.O. No. : 12253-PP/CL/ADVT/1/2025-26; Date: 19-12-2025

**తెలంగాణ ప్రభుత్వం, అటవీ శాఖ.**
Rc.No.572/R2/2024, సంక్షిప్త టెండర్ ప్రకటన తేది: 18.12.2025
ఆమోదించబడిన థీమ్ ప్రకారం అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన-2026 కోసం తెలంగాణ అటవీ శాఖ స్టాల్ ఫ్యాబ్రికేషన్ పనులకు సీల్డ్ టెండర్లు ఆహ్వానించడమైనది.
పని యొక్క వ్యయం మరియు స్పెసిఫికేషన్ల వివరాలు టెండర్ ఫారంలో అందుబాటులో ఉన్నాయి. టెండర్ నిబంధనలు మరియు షరతులతో కూడిన టెండర్ ఫారాలను 19.12.2025 నుండి కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్, రీసెర్చ్ & డెవలప్‌మెంట్ సర్కిల్, హైదరాబాద్, 3వ అంతస్తు, అరణ్య భవన్, సైఫాబాద్, హైదరాబాద్ వారి కార్యాలయం నుండి పొందవచ్చు.
1. **టెండర్ షెడ్యూళ్ల అమ్మకం:** 19.12.2025 నుండి 27.12.2025 మధ్యాహ్నం 12:00 గంటల వరకు.
2. **కాంట్రాక్టర్లచే టెండర్ షెడ్యూళ్లను సమర్పించడం:** 27.12.2025 మధ్యాహ్నం 1:00 గంటల వరకు.
3. **టెండర్ షెడ్యూళ్లను తెరవడం:** 27.12.2025 సాయంత్రం 3:00 గంటలకు, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్, రీసెర్చ్ & డెవలప్‌మెంట్ సర్కిల్, హైదరాబాద్, రూమ్ నెం.347, 3వ అంతస్తు, అరణ్య భవన్, సైఫాబాద్, హైదరాబాద్ వారి కార్యాలయంలో.

పై వాటిని అధీకృత అధికారిచే ఖరారు చేయబడుతుంది.
సం/- కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్, రీసెర్చ్ & డెవలప్‌మెంట్ సర్కిల్, హైదరాబాద్.
మొబైల్ నెం. 9440849242
ఇ-మెయిల్ ఐడి: fuohyd2023@gmail.com
DIPR R.O. No. : 12280-PP/CL/ADVT/1/2025-26, Date: 19-12-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్** GHMC
ఇఇ, సర్కిల్-30, బేగంపేట్, సికింద్రాబాద్ జోన్.
కొటేషన్లు పొందేందుకు నోటీసు
నోటీసు నెం. 15/Sealed Quotations/EE-30/SD Z/GHMC/2025-2026, తేది: 19.12.2025

| క్ర. సం. | క్రింద పేర్కొన్న వస్తువుల కోసం తయారీదారులు, ఫ్యాబ్రికేటర్లు, అధీకృత డీలర్లు/ ఏజెన్సీలు మొదలైన వారి నుండి సీల్డ్ కొటేషన్లు ఆహ్వానించబడ్డాయి. | డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది & సమయం / కొటేషన్ల దాఖలుకు ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|
| 1. | **పని పేరు:** డీలిస్టింగ్ పనులకు కొటేషన్లు ఆహ్వానించడమైనది. **అవసరమైన వస్తువులు :** అద్దె, సిబ్బంది, ఇంధనం మరియు ఇతర ఖర్చులతో కలుపుకుని హైడ్రాలిక్ సిల్ట్ గ్రాబర్‌ను ఉపయోగించి క్యాచ్‌పిట్‌లలో పూడికతీత పనులు చేపట్టి పూర్తి చేయుట. | కొటేషన్ల ప్రారంభ తేది & సమయం: 20.12.2025న ఉ.10.30గం.ల నుండి. దాఖలుకు ఆఖరి తేది & సమయం: 24.12.2025న మ.12.00గం.ల వరకు | సీల్డ్ కొటేషన్లను ఓ/ఓ. ఇ.ఇ., సర్కిల్-30, జిహెచ్‌ఎంసి, సికింద్రాబాద్‌లో 24.12.2025న మ.12.00గం.లు లేదా అంతకు ముందు దాఖలు చేయవచ్చు. సెల్ నెం. 7995468066 / 7331181426 |

**గమనిక:** రేటును యూనిట్లతో ప్రతిపాదించాలి.
సంబంధిత అధికారి చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-30, మరియు హెడ్ డ్రాఫ్ట్‌మెన్, సర్కిల్-30, సికింద్రాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి. పైన పేర్కొన్న వస్తువులకు సంబంధించిన మరిన్ని వివరాలు మరియు పూర్తి వివరణలను జిహెచ్‌ఎంసి వెబ్‌సైట్ https://ghmc.gov.in/ నుండి పొందవచ్చు. కొటేషన్‌లను ఆన్‌లైన్ ఇ-మెయిల్ ఐడి eec30reports@gmail.com ద్వారా సమర్పించవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-30, బేగంపేట్.
DIPR R.O. No. : 12236-PP/CL/ADVT/1/2025-26, Date: 19-12-2025

**తెలంగాణ ప్రభుత్వం**
**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం :: ఆదిలాబాద్, ఆదిలాబాద్ జిల్లా.**
ఆసక్తి వ్యక్తీకరణ కోసం నోటీస్ ఆహ్వానం
నోటీసు R.O.C.No. E1/EOI-08/2025-26 తేదీ: 18-12-2025
ఆదిలాబాద్ మునిసిపాలిటీ పరిధిలో 2 మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న మేజర్ స్టోర్మ్ వాటర్ డ్రెయిన్స్ కనెక్టివిటీ ఓపెన్ నాలాలకు ఇరువైపులా రిటైనింగ్ వాల్స్ యొక్క డీటైల్డ్ ప్రాజెక్ట్ నివేదికల (డిపిఆర్‌లు) తయారీ కోసం భారత కేంద్ర ప్రభుత్వం పట్టణాభివృద్ధిలో ఎంప్యానెల్ జాబితాలోని అనుభవజ్ఞులైన కన్సల్టెన్సీ సంస్థల నుండి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రజారోగ్య మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం లేదా R&B విభాగం నీటి పారుదల విభాగం నుండి ఆసక్తి వ్యక్తీకరణ (EOI)ఆహ్వానించబడింది. ఇలాంటి పనుల విషయాలలో కనీసం 10సంవత్సరాల అనుభవానికి తక్కువకాకుండా ఉన్న ఎంప్యానెల్డ్ కన్సల్టింగ్ సంస్థలు, పైన పేర్కొన్న ఏదైనా రాష్ట్ర ప్రభుత్వ విభాగాల ఆథరైజ్డ్ అధికారం కలిగిన ఇంజనీర్ ఇన్ చీఫ్ ద్వారా ముందుగా ఆమోదించబడిన డిపిఆర్‌లను పూర్తిగా విజయవంతంగా పూర్తి చేయడం చూపించాలి.

| క్ర.సం. | పని పేరు |
|---|---|
| 1 | విలీన G.P వార్డులు, కోర్ ప్రాంతంలో తుఫాన్ నీటి కాలువల కోసం డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారీ ఆదిలాబాద్ మునిసిపాలిటీలోని 1నుండి 49వార్డులను పూర్తిగా కవర్ చేయడం. |
| 2 | ఆదిలాబాద్ మునిసిపాలిటీలోని 1నుండి 49వార్డులలో 52 పనులకు రూ.18.70 కోట్ల వ్యయంతో UIDF కింద ప్రతిపాదించబడిన పనులకు డీటైయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టును రూపొందించడం. |
| 3 | ఆదిలాబాద్ మునిసిపాలిటీలోని వివిధ ప్రదేశాలలో నాలా క్రాసింగ్ మైనర్ /మేజర్ బ్రిడ్జిల కోసం మైనర్, మేజర్ బ్రిడ్జిలకు సంబంధించిన డీటైయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు తయారీ, సంబంధిత DPRలు, సంస్థలు వాటి మునుపటి సంబంధిత సారూప్య అనుభవం 10 సంవత్సరాల కంటే తక్కువ కాకుండా సమర్పించాల్సి ఉంటుంది. మునుపటి అనుభవాల రుజువులను కూడా సమర్పించాలి. పైన పేర్కొన్న డిపార్ట్‌మెంట్‌ల ప్రకారం సమర్థ సాంకేతిక అధికారం కలిగిన వారిచేత కౌంటర్ సంతకం చేయబడిన సర్టిఫైడ్ కాపీలను కింద సంతకం చేసిన వారికి సమర్పించాలి. |

పైన పేర్కొనబడిన పనుల EOI సమర్పించడానికి చివరితేదీ 30-12-2025 సాయంత్రం 5గంటల వరకు. వారు ఆదిలాబాద్ మునిసిపల్ కమిషనర్ పేరుతో విడివిడిగా (1నుండి 3 వరకు) ప్రతీ పనివారీగా రూ.5,000.00 డిమాండ్ డ్రాఫ్ట్ (డి.డి) (నాన్ రిఫండబుల్) ఏదైనా షెడ్యూల్డ్ జాతీయ బ్యాంకులలో **కమిషనర్, ఆదిలాబాద్ మునిసిపాలిటీ** పేరిట తీసినది సమర్పించడం ద్వారా ఆసక్తి యొక్క వ్యక్తీకరణ (EOI)ను దరఖాస్తు చేసుకోవచ్చు.
ఇతర వివరాలకు ఆదిలాబాద్ మునిసిపాలిటీలోని ఇంజనీరింగ్ విభాగంలో కార్యాలయ పనివేళల్లో సంప్రదించండి.
**కాంటాక్ట్ మొబైల్ నెంబర్స్ :** కమిషనర్, ఆదిలాబాద్ మునిసిపాలిటీ - 9849905885
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆదిలాబాద్ మునిసిపాలిటీ - 8008712444.
**గమనిక :** ఎటువంటి కారణం చూపకుండానే అందిన ఏవైనా లేదా అన్ని దరఖాస్తులను అంగీకరించే లేదా తరిస్కరించే హక్కు సమర్థ అధికారికి ఉన్నది.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్. ఆదిలాబాద్ మునిసిపాలిటీ. సం/- కమిషనర్ ఆదిలాబాద్ మునిసిపాలిటీ.
DIPR R.O. No. : 12288-PP/CL/ADVT/1/2025-26, Date: 19-12-2025




### హైదరాబాద్‌కు చేరుకున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ మూడు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆయన హైదరాబాద్ విమానాశ్రయానికి చేరుకోగా, తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) సి.సుదర్శన్ రెడ్డి సహా ఎన్నికల విభాగానికి చెందిన ఉన్నతాధికారులు ఘనంగా స్వాగతం పలికారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా సిఇసి జ్ఞానేశ్ కుమార్ రవీంద్రభారతి ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర బూత్ లెవల్ అధికారులు (బిఎల్‌ఒలు)తో సమావేశం నిర్వహించనున్నారు. అలాగే గోల్కొండ కోట, హుస్సేన్‌సాగర్, చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం వంటి నగరంలోని ప్రముఖ చారిత్రక, సాంస్కృతిక ప్రదేశాలను సందర్శించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలానికి బయలుదేరనున్నారు. సాయంత్రం 6.30 గంటలకు భ్రమరాంబ అతిథి గృహానికి చేరుకుంటారని అధికారులు తెలిపారు. శ్రీశైలం పర్యటన పూర్తిగా ఆధ్యాత్మిక, భక్తిపరమైనదిగా ఉండగా, అక్కడ ఎలాంటి అధికారిక సమావేశాలు లేవని స్పష్టం చేశారు. సిఇసి పర్యటనను సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అధికారులు రాష్ట్ర, జిల్లా యంత్రాంగాలతో సమన్వయం చేస్తూ అవసరమైన ఏర్పాట్లు చేశారు.

### రానున్న ఎన్నికలకు పంచాయతీ ఫలితాలు ట్రైలర్ మాత్రమే

బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 50 శాతం ప్రజామద్దతు కూడా పొందలేని ప్రభుత్వం ప్రజల ముందు మాట్లాడే నైతిక హక్కును కోల్పోయిందని బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జ్ ఎన్.వి.సుభాష్ అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం సుభాష్ మీడియాతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పాలనపై గ్రామీణ ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తిరస్కారమన్నారు. ఈ ఎన్నికలు కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయ రిఫరెండం లాంటివన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 12,728 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగితే, వాస్తవంగా కాంగ్రెస్‌కు వచ్చిన సర్పంచుల సంఖ్య సుమారు 6,300 నుంచి 6,400 మధ్యే ఉంటుందన్నారు. గత ఎన్నికలతో పోలిస్తే బిజెపి సర్పంచ్ స్థానాలు ఆరు రెట్లకు పైగా పెరిగాయన్నారు. గతంలో కేవలం 167 సర్పంచ్ స్థానాలు ఉన్న బిజెపికి ఈసారి 1,000కి పైగా స్థానాల్లో మద్దతున్న అభ్యర్థులు గెలిచారన్నారు. బిఆర్‌ఎస్‌తో కుమ్మక్కైంది కాంగ్రెస్‌నేనని, అందుకే గత 10 ఏళ్ల అవినీతిపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను రాజీనామా చేయించి మళ్లీ ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. నిజంగా ప్రజల మద్దతు ఉంటే ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలను ఎందుకు వాయిదా వేస్తున్నారని ప్రశ్నించారు. గ్రామం నుంచి పార్లమెంట్ వరకూ బిజెపినే ప్రత్యామ్నాయమని, గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు రాబోయే ఎంపిటిసి, జెడ్‌పిటిసి, మున్సిపల్, అసెంబ్లీ ఎన్నికలకు ట్రైలర్ మాత్రమేనని సుభాష్ అన్నారు.

### భారతదేశ ఉన్నత విద్యా వ్యవస్థను దెబ్బతీసే విధంగా..

## వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్–2025 బిల్లు

ఎఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వికాసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ (విబిఎస్‌ఎ) బిల్లు 2025' సమాఖ్య నిర్మాణాన్ని, ప్రజాస్వామ్య , యూనివర్సిటీల స్వయంప్రతిపత్తిని, భారతదేశ ఉన్నత విద్యా వ్యవస్థకు చెందిన లౌకిక, శాస్త్రీయ స్వభావాలను దెబ్బ తీసేవిధంగా ఉన్నదని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి), ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఇ)తో సహా ప్రస్తుతం ఉన్న రెగ్యులేటరీ ఆర్కిటెక్చర్‌ను రద్దు చేయాలని విబిఎస్‌ఎ బిల్లు ప్రతిపాదిస్తుందని, దీని స్థానంలో పూర్తిగా కేంద్ర ప్రభుత్వం నియంత్రించే ఏకైక, అత్యంత కేంద్రీకృత ఒకే కమిషన్‌ను ఏర్పాటు చేస్తుందని వారు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా సిలబస్ పూర్తిగా రాజకీయ, మతపర, విద్య, ఉద్యోగ నియామకాల్లో పూర్తిగా రాజకీయ జోక్యం పెరుగుతుందన్నారు. రాజకీయంగా నియమించబడిన కొంతమంది వ్యక్తుల చేతుల్లో మొత్తం విద్యావిధానం వెళ్తుందని, ఈ విద్యావిధానం పూర్తిగా విద్య ప్రైవేటీకరణ, విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే విధంగా ఉందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యకు అధిక నిధులు ఇవ్వకుండా విద్యారంగాన్ని మొత్తం ప్రైవేటుపరం చేస్తుందన్నారు. విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే విధంగా ఇప్పటికే తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం 2020ను అనేక రాష్ట్రాలు వ్యతిరేకిస్తూ, అసెంబ్లీలో తీర్మానం చేసి, ఈ బిల్లును అమలు చేయడం లేదని ఆయా రాష్ట్రాలు బిజెపిని తిప్పి కొట్టారని వారు తెలిపారు. వెంటనే విబిఎస్‌ఎ బిల్లును ఉపసంహరించుకోవాలని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### అత్యధిక సంఖ్యలో బిసిల గెలుపు హర్షణీయం

చైర్మన్ జి.నిరంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రామ పంచాయతీ ఎన్నికలలో బిసి అభ్యర్థులు అత్యధికంగా గెలుపొందడం పట్ల తెలంగాణ బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జి. నిరంజన్ మాట్లాడుతూ గ్రామ పంచాయితీ ఎన్నికలలో 42 శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేయకపోయినా, జనరల్ స్థానాల్లో బిసి అభ్యర్థులు 52.75 శాతం గెలవడం బిసిలలో చైతన్యానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బిసి అభ్యర్థులు 39.51 శాతం గెలిచినా, గిరిజన జిల్లాలను మినహాయిస్తే ఇది 45.25శాతంగా తేలుతుందన్నారు.
బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు వ్యతిరేకించే వారికి ఇకనైనా ఈ విజయం కనువిప్పు కలగాలని కోరారు. బిసి సర్పంచులే ఎన్నికావడం ఆనందదాయకమన్నారు.

## "క్షేత్రస్థాయిలో ప్రజలు కెసిఆర్ వైపే"

సిరిసిల్ల నియోజకవర్గంలో 117 గ్రామ పంచాయతీలకు 80 చోట్ల బిఆర్‌ఎస్ మద్దతుదారులు

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్





**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలు గ్రామ పంచాయతీ ఎన్నికలలో ఎలాంటి ప్రలోభాలకు గురిచేసినా క్షేత్రస్థాయిలో ప్రజలు కెసిఆర్ నాయకత్వం వైపే మొగ్గు చూపారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు, వార్డు సభ్యులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసి వారికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ అధికార పార్టీ దౌర్జన్యాలను ఎదుర్కొని సిరిసిల్ల నియోజకవర్గంలోని 117 గ్రామ పంచాయతీలకు గాను 80 చోట్ల బిఆర్‌ఎస్ మద్దతుదారులు అఖండ విజయం సాధించడం గర్వకారణమన్నారు. పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాతపెట్టి సిరిసిల్లలో 50 పంచాయతీల్లో గులాబి జెండా ప్రభంజనం సృష్టించింది అన్నారు. గంభీరావుపేట వంటి మండలాల్లో కాంగ్రెస్ ఖాతా తెరవలేకపోవడం ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సర్పంచులను బెదిరించడంపై స్పందిస్తూ, ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి పైసా ప్రజలు పన్నుల రూపంలో కట్టిన సొమ్ము అని, అది ఎవరి అత్త సొమ్ము కాదని కెటిఆర్ ఘాటుగా విమర్శించారు. గత పదేళ్లలో కెసిఆర్ పల్లె ప్రగతి ద్వారా గ్రామాలను నందనవనాలుగా తీర్చిదిద్దారని,నేడు కాంగ్రెస్ పాలనలో కనీసం ట్రాక్టర్లలో డీజిల్ పోయించే పరిస్థితి కూడా లేదని విమర్శించారు.

**దమ్ముంటే ఆ 10 మందితో రాజీనామా చేయించు..**

పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ వెంట ఉన్నారని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే, నైతికత ఉంటే బిఆర్‌ఎస్ నుంచి అక్రమంగా చేర్చుకున్న 10 మంది ఎమ్మెల్యేలతో తక్షణమే రాజీనామా చేయించి ఎన్నికలకు రావాలని కెటిఆర్ బహిరంగ సవాల్ విసిరారు. అప్పుడు ప్రజలు ఏవైపు ఉన్నారో నిర్ణయిస్తారని, దమ్ముంటే తన సవాల్ స్వీకరించాలని అన్నారు.

**66 శాతం నిజమైతే.. తేల్చుకుందాం రా!**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట మార్చడంలో సిద్ధహస్తుడని కేటీఆర్ విమర్శించారు. నిన్న హైదరాబాద్ ప్రెస్ మీట్‌లో రేవంత్ రెడ్డి మొదట కాంగ్రెస్ 66 శాతం గెలిచిందని, ఇది ప్రభుత్వంపై ప్రజల ఆశీర్వాదమని గొప్పలు చెప్పారు. కానీ, సరిగ్గా ఐదు నిమిషాలకే మాట మార్చి.. ఇవి స్థానిక అంశాలపై జరిగిన ఎన్నికలని, ప్రభుత్వానికి సంబంధం లేదని తప్పించుకున్నారు. ముఖ్యమంత్రి మీకు నిజంగానే 66 శాతం ప్రజాదరణ ఉంటే, నా సవాల్ స్వీకరించండి. మా పార్టీ నుంచి మీరు సంతలో పశువుల్లా ఎత్తుకెళ్లిన ఆ పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించండి. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, కొండూరి రవీందర్‌రావు, చిక్కాల రామారావు, తుల ఉమ, జిందం చక్రపాణి, న్యాలకొండ అరుణ, గూడూరి ప్రవీణ్, తిరుపతి, దిడ్డి శ్రీనివాస్, మల్లారెడ్డి నూతనంగా ఎన్నికైన సర్పంచులు, బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఆర్‌టిసి సంస్థ పరిరక్షణకు జెఎసి ఏర్పాటు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్‌టిసి కార్మిక సంఘాల సమావేశం శుక్రవారం ఎంప్లాయీస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో ఎంప్లాయిస్ యూనియన్, తెలంగాణ మజ్దూర్, యూనియన్ నేషనల్ మజ్దూర్, యూనియన్, ఎస్‌డబ్ల్యుఎఫ్, బహుజన కార్మిక యూనియన్, బహుజన వర్కర్స్ యూనియన్, కార్మిక పరిషత్ పాల్గొన్నాయి. ఆర్‌టిసి కార్మిక సమస్యల పరిష్కారం, ఆర్‌టిసి సంస్థ పరిరక్షణ కోసం ఆరు సంఘాలు జెఎసిగా ఏర్పడడానికి నిర్ణయించుకోవడం జరిగిందని ఒక ప్రకటనలో తెలిపారు. నూతన జెఎసి చైర్మన్‌గా ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్‌గా ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్‌గా ఎండి.మౌలానా, కో కన్వీనర్లుగా కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరి, కోశాధికారిగా బి.యాదయ్య, మీడియా ఇంచార్జ్‌గా పాటి అప్పారావు, ఎన్. కమలాకర్ గౌడ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ యూనియన్ జెఎసి కార్యక్రమాలకు బయట నుండి మద్దతు ఇస్తామని చెప్పారు. ఎన్నికైన జెఎసి కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు నిత్యం ఎదురుకొంటున్న సమస్యలు, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకై దశల వారి పోరాటాలు నిర్వహించాలని తీర్మానించినట్లు తెలిపారు.

# దేశంలో ఎక్కడా లేని కార్యక్రమం 'ప్రజావాణి'

### ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజావాణి వంటి ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం భారతదేశంలో మరెక్కడా అమలులో లేదని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి రెండవ వార్షికోత్సవ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రభుత్వం, పాలన పూర్తిగా ప్రజల కోసమేనని, సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో యావత్ క్యాబినెట్ కలిసి తీసుకున్న విప్లవాత్మక నిర్ణయమే ప్రజావాణి కార్యక్రమమని భట్టి విక్రమార్క మల్లు వివరించారు. ప్రజల సమస్యలను నేరుగా విని పరిష్కరించేందుకు ప్రతి మంగళవారం, శుక్రవారం క్రమం తప్పకుండా దరఖాస్తులు స్వీకరిస్తూ ఇప్పటివరకు 74 శాతం సమస్యలను పరిష్కరించగలగడం గొప్ప విజయమన్నారు. ప్రజావాణి ఏర్పాటు చేయడమే కాకుండా, వచ్చిన దరఖాస్తులపై నిబద్ధతతో దృష్టి సారించి ఉద్యోగ బృందం పనిచేయకపోతే ఈ స్థాయి విజయం సాధ్యమయ్యేది కాదన్నారు. ఇంకా పరిష్కారం కాని పైప్‌లైన్‌లో ఉన్న అంశాలను కూడా త్వరలో పరిష్కరిస్తామని ఉపముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

**నెరవేరుతున్న సంకల్పం..**

ఏ సంకల్పంతో ప్రజావాణిని ప్రారంభించామో ఆ సంకల్పం నెరవేరుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సిజిజి) సహకారంతో రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రశంసించారు. 10 సంవత్సరాల పాటు రాష్ట్రాన్ని పాలించిన వారు ప్రజల కోసం కనీసం ప్రజాభవన్ గేట్లు కూడా తెరవలేదని గుర్తు చేశారు. అలాంటి వారు ఇప్పుడు ప్రజావాణి కార్యక్రమంపై విమర్శలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని భట్టి విక్రమార్క విమర్శించారు. ప్రజావాణిలో వచ్చిన విజయ గాథలు వింటుంటే సిబ్బంది ఎంత చిత్తశుద్ధితో పనిచేశారో స్పష్టంగా తెలుస్తోందన్నారు. వారిని అభినందించేందుకే ఈ సమావేశానికి వచ్చానని తెలిపారు. తమ ఆలోచన, పాలన, వ్యవహారం అన్నీ ప్రజలకే అంకితమని, రాష్ట్రంలోని సంస్థలు, వ్యవస్థలు ప్రజలకు ఉపయోగపడాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఏమాత్రం భయం లేకుండా ప్రజలు తమ సమస్యలను వెల్లడించుకునేందుకు ఏర్పాటు చేసిన ఈ ప్రజాభవనాన్ని ప్రజలు ఆశీర్వదించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో మరింత ముందుకు సాగుదామని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

**ఇందిరమ్మ పాలనలో సమస్యలు పరిష్కారం : మంత్రులు పొన్నం, జూపల్లి**

మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణా రావు మాట్లాడుతూ ఇందిరమ్మ పాలనలో ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతున్నాయన్నారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి మాట్లాడుతూ రెండేళ్ల కాలంలో సిఎం ప్రజావాణిలో ఒక లక్ష 07, 829 దరఖాస్తులు అందగా అందులో 64,623 దరఖాస్తులు పరిష్కారం అయ్యాయని, మిగతా 48, 064 దరఖాస్తులు వివిధ దశల్లో ఉన్నాయని, సమస్యల పరిష్కారం 74 శాతం ఉందని తెలిపారు. సిబ్బంది, అధికారులు ఎంతో ఓపికతో ప్రజల సమస్యలు వింటూ పరిష్కారం చూపుతున్నారని చిన్నారెడ్డి అభినందించారు. సిఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ప్రజావాణి లక్ష్యాలను, సాధించిన పురోగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఆర్ ఐ అడ్వైజరీ కమిటీ చైర్మన్ వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీమ్ రెడ్డి, హౌసింగ్ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్, సిజిజి చైర్మన్ రవి గుప్తా, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరి చందన పాల్గొన్నారు.

**ఆనందం వ్యక్తం చేసిన లబ్ధిదారులు..**

సిఎం ప్రజావాణి ద్వారా లబ్ధి పొందిన వివిధ వర్గాల ప్రజలు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ మాట్లాడారు. పదేళ్ల క్రితం ఆర్‌టిసిలో సర్వీస్ నుంచి డిస్మిస్ అయిన 242 మంది డ్రైవర్స్, కండక్టర్స్‌కు ప్రజావాణి ద్వారా తిరిగి ఉద్యోగాలు రావడం, కోర్టు కేసుల వల్ల సమస్యలు ఎదుర్కొంటున్న 1,750 మందికి ప్రజావాణి ద్వారా డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయింపు జరగడం, ఆరోగ్య సమస్యలు పరిష్కారం కావడం, గల్ఫ్ కార్మికుల సమస్యలు పరిష్కారం నోచుకోవడం వంటి అనేక విజయ గాథలు ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు వివరించారు.




## నేడు 'సిపిఐ ర్యాలీ ,బహిరంగ సభ'

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో వందేళ్ల సిపిఐ ఉత్సవాలకు హిమాయత్‌నగర్,నారాయణగూడ ప్రాంతాలను 'ఎర్ర తోరణాలు, జెండాలు ,ఫ్లెక్సీ'లతో ముస్తాబు చేశారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించనున్న 'ర్యాలీ ,బహిరంగ సభ' సందర్భంగా పలు ప్రాంతాలను అలంకరించారు. '100 సంవత్సరాల పూర్తి చేసుకుంటున్న సిపిఐ ఉత్సవాల ర్యాలీ, సభ'కు హైదరాబాద్ నలుమూలల నుండి ప్రజలు , కార్మికులు, విద్యార్థులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొననుండగా, ఈ సభకు సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. కాగా హైదరాబాద్ ఉద్యమ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన నాయకుల ఫోటో ఎగ్జిబిషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. గతంలో త్యాగాలు చేసి హక్కులు సాధించిన నాయకుల స్ఫూర్తిని భవిష్యత్ తరానికి తెలియజేసే విధంగా సభా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. సభ ఏర్పాట్లను సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి నరసింహాతో పాటు సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, కౌన్సిల్ సభ్యులు బాలకృష్ణ శుక్రవారం పరిశీలించారు.



## రాజకీయ చైతన్యంతోనే సర్పంచ్ ఎన్నికల్లో బిసిల ప్రభంజనం

### బిసి జెఎసి రాష్ట్ర చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సర్పంచ్ ఎన్నికలలో రాష్ట్ర ప్రభుత్వం బిసి రిజర్వేషన్లను 17శాతానికి తగ్గించి అన్యాయం చేయాలని ప్రయత్నించినప్పటికీ, ఈ ఎన్నికలలో బిసిలు తమ రాజకీయ చైతన్యంతో రిజర్వేషన్‌తో సహా జనరల్ స్థానాలలో కూడా బరిలో నిలిచి 51శాతం గెలిచి ప్రభంజనం సృష్టించారని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బిసి రిజర్వేషన్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న, తెలంగాణ పర్యటనకు విచ్చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్మును రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అఖిలపక్షంతో తక్షణమే కలిసి, రాష్ట్ర అసెంబ్లీలో చేసిన బిసి రిజర్వేషన్ల బిల్లును ఆమోదించేలా కోరాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. శీతాకాల పార్లమెంటు సమావేశాలు జరిగిన 21 రోజులలో 21 నిమిషాలు కూడా పార్లమెంటులో బిసి రిజర్వేషన్లపై చర్చించలేదని, బిసి రిజర్వేషన్లపై పార్లమెంటులో చర్చించాలని పట్టు పట్టాల్సిన రాహుల్ గాంధీ మౌనం వహించాడని, బిసిల ఆకాంక్షలను గౌరవించి బిసి బిల్లును ఆమోదించాల్సిన ప్రధాని నరేంద్ర మోడీ విదేశీ టూర్‌లతో కాలం వెళ్లదీశాడని ఆయన ఆరోపించారు. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సందర్భంలో మూడు రోజులు డిల్లీలోనే సిఎం రేవంత్ రెడ్డి ఉన్నప్పటికీ బిసి రిజర్వేషన్ అంశం పై కేంద్రం పైన ఒత్తిడి పెంచడానికి అఖిలపక్షంతో ప్రధానిని కలిసే ప్రయత్నం చేయలేదని, చివరికి కాంగ్రెస్ అధిష్టాన పెద్దలను ఒప్పించి పార్లమెంటులో బిసి రిజర్వేషన్లు అంశం చర్చకు వచ్చేలా ప్రయత్నం చేయకపోవడం చాలా బాధాకరమన్నారు. సర్పంచ్ ఎన్నికలు పార్టీల గుర్తుల మీద జరిగినవి కావని, బిసి వాదంతోనే జరిగాయని తెలిపారు. 42 శాతం బిసి రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక ఎన్నికలకు వెళతామంటే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇక మూడినట్లేనని ఆయన హెచ్చరించారు.

**బిసి జెఎసి రాష్ట్ర కన్వీనర్‌గా మడత వెంకట్ గౌడ్ నియామకం..**

బిసి ఉద్యమాలలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న ఖమ్మం జిల్లా ఇల్లందుకు చెందిన మడత వెంకట్ గౌడ్‌ను బిసి జెఎసి రాష్ట్ర కన్వీనర్ గా, ఉమ్మడి ఖమ్మం జిల్లా బిసి జెఎసి ఇన్చార్జిగా నియమిస్తూ బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని వెంకట్ గౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మడత వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బిసి ఉద్యమాన్ని బలోపేతం చేస్తానని, రాష్ట్రవ్యాప్తంగా బిసి రిజర్వేషన్లపై జరుగుతున్న ఉద్యమానికి ఖమ్మం జిల్లా ఊతమిచ్చేలా బిసి జెఎసి నిర్మాణాన్ని చేపడతానని వెల్లడించారు. ఈ సమావేశంలో బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, ఆర్‌టిసి బిసి ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఇ.నిరంజన్, జెఎసి నేతలు కౌల జగన్నాథం, జాజుల లింగం గౌడ్, తారకేశ్వరీ, ఉదయ్ నేత, గజ్జల సత్యం గౌడ్, శివమ్మ, ఇంద్రం రజక, హరి తిలక్ సింగ్, కృష్ణయ్య పాల్గొన్నారు.



## ఎల్‌బి స్టేడియంలో క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎల్‌బి స్టేడియంలో శనివారం జరగనున్న క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయి. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి క్రీడా శాఖ అధికారులతో కలిసిశుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు.ఈ కార్యక్రమానికి స్పోర్ట్స్ అథారిటీ తరపున కావాల్సిన సౌకర్యాలను ఇవ్వవలసిందిగా ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి రవీందర్ , పిఆర్‌ఓ కాలేరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### షాహి సంస్థలో పనిచేస్తున్న మహిళా కార్మికుల

# సమస్యలు వెంటనే పరిష్కరించాలి



### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** నాచారంలోని షాహి ఎక్స్‌పోర్ట్స్ సంస్థలో పని చేస్తున్న మహిళా కార్మికుల న్యాయపర సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు. సిపిఐ ఉప్పల్ మండల కార్యదరిర్శ టి.సత్యప్రసాద్ అధ్యక్షత వహిస్తూ గత 12 రోజులుగా వేతనాలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కి కొనసాగిస్తున్న సమ్మెకు ఆయన సంఘీభావం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఆర్థిక పోరాటం కొనసాగిస్తున కార్మిక వర్గానికి ఆయన విప్లవ జోహార్లు తెలిపారు.ప్రభుత్వం నిర్ణయించిన జిఓ ప్రకారం వేతనాలు చెల్లించ పోవటం, కార్మికులపై అధిక పని భారం మోపడం,హక్కుల కోసం ప్రశ్నించిన కార్మికులను ఉద్యోగాల్లోంచి తొలగిస్తామంటూ బెదిరించటం,కార్మిక శ్రమ దోపిడి ద్వారా అధిక లాభాలను ఆర్జించటం వంటి చర్యలకు షాహి ఎక్స్‌పోర్టు సంస్థ పాల్పడటం తీవ్ర అన్యాయమని ఆయన అన్నారు. ఈ సమస్యలన్నింటిని తాను రాష్ట్ర కార్మిక వివేక్ వెంకటస్వామితో చర్చించి పరిష్కారమయ్యేలా చూస్తానన్నారు.అదే విధంగా ప్రభుత్వం మహిళా కార్మికుల సమస్యల పరిష్కరించటంలో జోక్యం తీసుకోవాలని డిమాండ్ చేసారు. షాహిఎక్స్‌పోర్టు కార్మికులందరికి కార్మిక శాఖ నిబంధనల మేరకు వేతనాలివ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని,ప్రతి నెలా నిర్ణీత సమయానికి వేతనాలు చెల్లించాలని,కంట్రాక్టు ప్రాతిపదికన పని చేసే కార్మికులను పర్మినెంట్ చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేసారు.ఈ పోరాటానికి ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు,కార్మిక పక్షపాత శక్తులు, రాజకీయాలకు అతీతంగా అన్ని కార్మిక సంఘాలు మద్దతివ్వాలని పిలుపిచ్చారు.సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు పోరట పటిమ విడనాడకుండా సంఘటితంగా ఉండాలని, ఈ విషయంలో సిపిఐ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.ఈ సమ్మెలో సంఘీభావంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్, జాతీయ సమితి సభ్యురాలు ప్రేమ పావని, రాష్ట్ర సమితి సభ్యులు జి.దామోదర్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు రచ్చ కిషన్, ధర్మేంద్ర, శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు లక్ష్మి నారాయణ,నారా నరసింహ, యాదగిరి, లక్ష్మి , ఎఐవైఎఫ్ ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షుడు గిరిబాబు, నాయకులు పవన్ తదితరులు సంఘీభావంగా సమ్మెలో పాల్గొన్నారు.



## జిన్నింగ్ మిల్లులపై విజిలెన్స్ తనిఖీలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పత్తి కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పెంచడంతో పాటు రైతుల హక్కులను కాపాడే లక్ష్యంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజుల పాటు విస్తృత స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ నెల 16 నుంచి 18 వరకు సాగిన ఈ తనిఖీల్లో కాటన్ కొనుగోలు కేంద్రాలు, జిన్నింగ్ మిల్లుల్లో జరుగుతున్న లావాదేవీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ), లీగల్ మెట్రాలజీ, మార్కెటింగ్ శాఖల సమన్వయంతో నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) పూర్తిగా అందేలా చర్యలు తీసుకున్నారు. ఆదిలాబాద్, ఖమ్మం, నల్గొండ, వరంగల్, వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, నాగర్‌కర్నూల్, నారాయణపేట తదితర ప్రధాన పత్తి సాగు జిల్లాల్లో 65కి పైగా జిన్నింగ్ మిల్లులు, కొనుగోలు కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారు. తనిఖీల సమయంలో వేబ్రిడ్జి ధృవీకరణ పత్రాలు, తేమ కొలిచే యంత్రాలు (మాయిశ్చర్ మీటర్లు), సిసిటివి కెమెరాల ఏర్పాటుతో పాటు 15 నుంచి 120 రోజుల డేటా బ్యాకప్, అగ్నిమాపక భద్రతా లైసెన్సులు, 'కపాస్ కిసాన్ యాప్' అమలు తీరును పరిశీలించారు. తనిఖీల్లో పలు లోపాలు బయటపడ్డాయి. లీగల్ మెట్రాలజీ చట్టం కింద అనేక కేసులు నమోదు చేశారు. యాదాద్రి భువనగిరి (మోత్కూరు), నల్గొండ (చింతపల్లి) జిల్లాల్లో సీలు లేని లేదా నాణ్యతలేని వేబ్రిడ్జిలను ఉపయోగిస్తున్న మిల్లులపై చర్యలు తీసుకున్నారు. సంగారెడ్డి జిల్లాలో ప్రామాణిక 20 కిలోల టెస్ట్ వెయిట్స్ నిర్వహించని మిల్లులపై కేసులు నమోదు చేశారు. రంగారెడ్డి జిల్లాలో వేబ్రిడ్జి వ్యత్యాసాలు గుర్తించడంతో ఒక మిల్లుకు రూ. 85,000 జరిమానా విధించారు. అలాగే పత్తి నాణ్యతను (స్టేపుల్ లెంగ్త్, మైక్రోనైర్ విలువలు) తక్షణమే కొలిచే శాస్త్రీయ పరికరాల కొరత చాలా మిల్లుల్లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వరంగల్, ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాంతాల్లోని మిల్లుల నుంచి నమూనాలను సేకరించి సాంకేతిక ధృవీకరణ కోసం ప్రయోగశాలలకు పంపించారు.సిసిటివిలు ఉన్నప్పటికీ చాలాచోట్ల సరిపడా డేటా బ్యాకప్ సౌకర్యం లేదని వెల్లడైంది.

### ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు

# రూ.26 వేల కనీస వేతనం

### తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాన్ని రూ. 26వేలుగా నిర్ణయించాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతామని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి యూసుఫ్ అన్నారు. 'తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్' రాష్ట్ర విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశం హిమాయత్ నగర్ లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎం.డి యూసుఫ్ మాట్లాడుతూ కనీస వేతనాలను పెంచేందుకు గతంలో వైద్యశాఖ అధికారులు అంగీకరించారని, కానీ ప్రస్తుతం అందుకు భిన్నంగా ప్రకటనలు వెలువడుతున్నాయని, తద్వారా కార్మికులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారన్నారు. గతంలో జిఒ నంబర్ 60 ప్రకారం జీతాలను చెల్లిస్తామని టెండర్‌ను విడుదల చేసి, అందుకు వీలుగా జీతాలను చెల్లించడం లేదని, గడిచిన మూడు సంవత్సరాలుగా కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం శ్రమ దోపిడికి గురిచేస్తుందని విమర్శించారు. రాబోయే టెండర్లలో కనీస వేతనాన్ని రూ. 26వేలు ఉండే విధంగా నూతన టెండర్లను ఆహ్వానించాలని కోరారు. బెడ్ రేటును రూ 10వేలకు పెంచి కార్మికుల సంఖ్యను 65కు పెంచడం ద్వారా కార్మికులకు కనీసం వేతనం వచ్చే పరిస్థితి లేదని, అందుకే కార్మికుల సంఖ్యకు అనుగుణంగా బెడ్స్ ధరలను పెంచాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యద ర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ యూనియన్ పోరాటాల కారణంగానే కార్మికులు కొన్ని హక్కులను సాధించుకున్నారని గుర్తు చేశారు. రాబోయే టెండర్లలో కనీస వేతనాలు, కార్మిక చట్టాల అమలు, కనీస బోనస్ తదితర హక్కుల సాధనకు కార్మికులు పోరాటం చేసి, సాధించుకోవాలని పిలుపునిచ్చారు. యూనియన్ నిర్మాణంలో భాగంగా ఈ నెలలో ఆసుపత్రి మహాసభలను, జనవరి నెలలో జిల్లా మహాసభలను నిర్వహించి, ఫిబ్రవరి 8వ తేదీన వరంగల్ జిల్లా లో యూనియన్ రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పిఆర్‌సి ప్రకటించి ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్,అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాన్ని ప్రభుత్వ ఉద్యోగుల బేసిక్ వేతనాన్ని నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న అన్ని రకాల థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని, వైద్య రంగానికి నిధులు కేటాయిస్తున్నప్పటికీ ఆ నిధులు కార్మికులకు చేరకుండా అధికారులు , కాంట్రాక్టర్లు కార్మికులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. కాగా కార్మికుల సమస్యల పరిష్కారానికి భవిష్యత్‌లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని కౌన్సిల్ సమావేశం తీర్మానించింది. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. లక్ష్మీ బాయి, ఉప ప్రధాన కార్యదర్శి హసీనా బేగం, కార్యదర్శులు పి.సురేష్, గన్నార రమేష్, జయలక్ష్మి, ఎస్ కిష్టమ్మ , రెహమాన్, కవిత ప్రసంగించారు.




## ఘనంగా జోనల్ రైల్వే శిక్షణ సంస్థ 53వ వార్షికోత్సవాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మౌలాలీలోని జోనల్ రైల్వే ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (జెడ్‌ఆర్‌టిఐ) 53వ వార్షిక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకుంది. ఈ కార్యక్రమానికి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ, జోనల్ రైల్వే శిక్షణ సంస్థ 53 సంవత్సరాలుగా అంకితభావంతో సేవలందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పూర్తిగా ఆఫ్‌లైన్ విధానంలో ఉన్న శిక్షణా వ్యవస్థను హైబ్రిడ్ మోడల్‌గా విజయవంతంగా మార్చినందుకు సంస్థను ప్రశంసించారు. స్టేషన్ మాస్టర్లు, కమర్షియల్ క్లర్కులు సహా ఫ్రంట్‌లైన్ సిబ్బందికి నాణ్యమైన శిక్షణ అందించడంలో జెడ్‌ఆర్‌టిఐ కీలక పాత్ర పోషిస్తున్నదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణార్థుల కోసం ట్రాఫిక్ మోడల్ రూమ్, ఇండోర్ జిమ్ సౌకర్యాలను సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇన్స్టిట్యూట్ ప్రాంగణంలో మొక్క నాటారు. అలాగే జెడ్‌ఆర్‌టిఐ మొబైల్ యాప్‌ను ప్రారంభించి, 2026 సంవత్సరానికి సంబంధించిన వార్షిక శిక్షణా కార్యక్రమాన్ని విడుదల చేశారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన టాపర్లకు పతకాలు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేయగా, వార్షిక క్రీడా పోటీల విజేతలు, రన్నరప్‌లకు రోలింగ్ షీల్డ్ ప్రదానం చేశారు. ఈ సభలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ కె. పద్మజ, ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఇతి పాండే, ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సిద్ధార్థ్ కటి తదితరులు ప్రసంగించారు.ముందుగా జెడ్‌ఆర్‌టిఐ ప్రిన్సిపల్ పి. భాస్కర్ రెడ్డి సంస్థ వార్షిక నివేదికను సమర్పించారు. 2025 సంవత్సరంలో వివిధ విభాగాలకు చెందిన 8,365 మంది రైల్వే ఉద్యోగులకు శిక్షణ అందించినట్లు తెలిపారు. ప్రైవేట్ స్టేషన్ మాస్టర్లకు కూడా శిక్షణ అందించినట్లు తెలిపారు.

## సినిమాలు, షార్ట్ ఫిల్మ్‌లు సామాజిక స్పృహను పెంచాలి: మంత్రి జూపల్లి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'సినిమా అంటే కేవలం వినోదం మాత్రమే కాదు.. అది సమాజాన్ని మేల్కొల్పే ఒక గొప్ప ఆయుధం. ముఖ్యంగా తక్కువ సమయంలో ఎక్కువ ప్రభావాన్ని చూపే షార్ట్ ఫిలమ్స్ నేటి తరానికి ప్రతిబింబాలు' అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం ప్రసాద్ మల్టీప్లెక్స్‌లో నిర్వహించిన 'హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్' (హెచ్‌ఐఎస్‌ఎఫ్‌ఎఫ్) మొదటి ఎడిషన్‌ను రోడ్లు, భవనాల శాఖ మంత్రి కొమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయిలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమని, ఇక్కడ నిర్వహించే సదస్సులు, ఉత్సవాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. మొదటి ఏడాదిలోనే 10 దేశాల నుంచి 704 చిత్రాలు రావడం నగరం సృజనాత్మకతకు నిదర్శనమని కొనియాడారు. హైదరాబాద్ సినిమాకు పుట్టినిల్లు అని మంత్రి గుర్తు చేశారు. 'ఫ్యూచర్ సిటీ'లో అత్యాధునిక సాంకేతికతతో కొత్త స్టూడియోలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిజిఎఫ్‌డిసి) ఛైర్మన్ దిల్ రాజు, మేనేజింగ్ డైరెక్టర్ చి. ప్రియాంక, ప్రముఖ చలనచిత్ర దర్శకుడు ఉమా మహేశ్వర రావు, నర్సింగరావు పాల్గొన్నారు. అంతర్జాతీయ జ్యూరీ సభ్యులు జూడీ గ్లాడ్‌స్టోన్, మైథిలి రావు, నాగేశ్ కునూరర్, లీమా దాస్, సుంజు బచుస్పతిమయుమ్, ఉత్పల్ బోర్పుజారి కూడా హాజరయ్యారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## జార్ఖండ్ వాసిని కొట్టి చంపినందుకు ఐదుగురి అరెస్టు

**పాలక్కాడ (కేరళ) :** ఇక్కడ వలయార్ సమీపంలో దొంగతనం చేశాడనే అనుమానంతో జార్ఖండ్‌కు చెందిన ఒక వ్యక్తిని కొట్టి చంపినందుకు ఐదుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి ఆలస్యంగా అరెస్టులను అధికారికంగా నమోదు చేశామని, నిందితులందరిపై భారతీయ న్యాయ సంహిత కింద హత్య నేరం కింద కేసు నమోదు చేసినట్లు వలయార్ పోలీస్ స్టేషన్ అధికారి తెలిపారు. మృతుడు రామనారాయణ్ భయార్ (31) వలయార్ ప్రాంతంలో కూలీగా పనిచేస్తున్నాడు. పోలీసుల ప్రకారం, బుధవారం సాయంత్రం వలయార్ సమీపంలోని కిళక్కేటప్పల్లంలో జరిగిన దొంగతనంలో భయార్ ప్రమేయం ఉందని ఆరోపిస్తూ కొందరు వ్యక్తులు అతనిపై దాడి చేశారు. ఎఫ్ఐఆర్ ప్రకారం, ఈ ఘటన రాత్రి 7.40 గంటలకు ముందు జరిగింది, గాయపడిన భయార్‌ను పాలక్కాడ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ అతను చికిత్స పొందుతూ మరణించాడు. ఈ ఘటనకు దారితీసిన పరిణామాలను నిర్ధారించడానికి వివరణాత్మక దర్యాప్తు జరుగుతోందని పోలీసులు తెలిపారు.

# పార్లమెంట్ నిరవధిక వాయిదా

- ఎంఎన్ఆర్ఇజిఎ చట్టం రద్దు, పౌర అణుశక్తి రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం వంటి కీలక బిల్లులు ఆమోదం
- లోక్‌సభలో 92.25 గంటల పాటు
- రాజ్యసభ సుమారు 92 గంటల పాటు కార్యకలాపాలు

**న్యూఢిల్లీ :** పార్లమెంటు శీతాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. డిసెంబర్ 1న ప్రారంభమైన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. మొత్తం 15 రోజుల పాటు పార్లమెంట్ ఉభయ సభలు పనిచేశాయి. శుక్రవారం లోక్‌సభలో సభ్యులు జాతీయ గీతం ఆలపించిన తర్వాత స్పీకర్ ఓం బిర్లా సభను నిరవధికంగా వాయిదా వేశారు. అటు రాజ్యసభలో ప్రశ్నోత్తరాల తర్వాత రాజ్యసభ ఛైర్మన్ సిపి రాధాకృష్ణన్ సభను నిరవధికంగా వాయిదా వేశారు. ఇరు సభలు నిరవధిక వాయిదా పడడంతో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ముగిశాయి. ఈ సమావేశాల్లో 20 ఏళ్ల నాటి ఎంఎన్ఆర్ఇజిఎ చట్టాన్ని రద్దు చేసే బిల్లుతో పాటు, పౌర అణు రంగాన్ని ప్రైవేట్‌పరం చేసేందుకు సంబంధించిన మరో బిల్లుతో సహా పలు కీలక బిల్లులు ఆమోదం పొందాయి. శీతాకాల సమావేశాలు 92 గంటల 25 నిమిషాల పాటు సాగాయి. ఉదయం సభ సమావేశమైన వెంటనే, స్పీకర్ ఓం బిర్లా తన సంక్షిప్త ముగింపు ప్రసంగాన్ని చదివారు. కీలకమైన చట్టాలపై చర్చించడానికి సభ్యులు ఆలస్యంగా కూర్చున్నందున, ఈ సమావేశాల్లో లోక్‌సభ ఉత్పాదకత 111 శాతంగా నమోదైందని ఆయన పేర్కొన్నారు. బిర్లా తన ముగింపు ప్రకటనను చదువుతున్నప్పుడు, కొంతమంది సభ్యులు 'మహాత్మా గాంధీకి జై' అని నినాదాలు చేయడం వినిపించింది. సభా కార్యకలాపాలు వాయిదా పడినప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభలోనే ఉన్నారు. శీతాకాల సమావేశాల 15 సిట్టింగ్‌లలో, సభ రెండు రాజకీయంగా ప్రాధాన్యత ఉన్న చర్చలను చేపట్టింది. అందులో ఒకటి వందేమాతరం 150 వార్షికోత్సవంపై కాగా, మరొకటి ఎన్నికల సంస్కరణలపై ఉన్నది. జాతీయ గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధానమంత్రి ఒక చర్చను ప్రారంభించారు. సభ ఈ విషయంపై 11 గంటల 32 నిమిషాల పాటు చర్చించింది, ఈ చర్చలో 65 మంది సభ్యులు పాల్గొన్నారు. 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై చర్చ జరపాలని ప్రతిపక్షం పట్టుబట్టింది, అయితే ఎన్నికల సంఘం, దాని పనితీరుపై సభలో చర్చించలేమని ప్రభుత్వం పేర్కొంటూ దానికి బదులుగా ఎన్నికల సంస్కరణలపై చర్చకు అంగీకరించింది. ఈ విషయంపై సుమారు 13 గంటల పాటు చర్చ జరిగింది. ఇందులో 63 మంది ఎంపిలు పాల్గొన్నారు. అయితే, ప్రతిపక్షం ఎస్ఐఆర్, ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకంపై కొత్త చట్టం, 'ఓట్ల దొంగతనం' సమస్యపై తమ దృష్టి కేంద్రీకరించి కేంద్ర సర్కార్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ఈ సమావేశాల్లో ఎనిమిది బిల్లులు ఆమోదం పొందాయి. గ్రామీణ భారతదేశానికి 125 రోజుల పాటు హామీతో కూడిన ఉపాధిని కల్పించే వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) లేదా 'విబి–జి రామ్ జి' బిల్లు, ప్రతిపక్షాల నిరసనలు, పత్రాల చించివేతల మధ్య గురువారం ఆమోదం పొందింది. కట్టుదిట్టంగా నియంత్రించబడుతున్న పౌర అణు రంగాన్ని ప్రైవేట్ పరం చేసేందుకు సస్టయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా (శాంతి) బిల్లు కూడా ఈ సమావేశాల్లో ఆమోదం పొందింది. ప్రస్తుతం ఉన్న 74 శాతం నుండి బీమా రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డిఐ) 100 శాతానికి పెంచే బిల్లును కూడా లోక్‌సభ ఆమోదించింది. లోక్‌సభలో ఆమోదం పొందిన ఒక రోజు తర్వాత, సబ్కా బీమా సబ్కీ రక్ష (బీమా చట్టాల సవరణ) బిల్లు, 2025 రాజ్యసభలో మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. కాలం చెల్లిన 65 సవరణ చట్టాలు, ఆరు ప్రధాన చట్టాలను రద్దు చేసే బిల్లును కూడా సభ ఆమోదించింది. మణిపూర్ వస్తువులు, సేవల పన్ను (రెండవ సవరణ) బిల్లు, 2025; కేంద్ర ఎక్సైజ్ (సవరణ) బిల్లు, 2025, ఆరోగ్య భద్రత నుండి జాతీయ భద్రతా సెస్ బిల్లు, 2025 కూడా ఆమోదం పొందిన బిల్లులలో ఉన్నాయి. 2025–26 సంవత్సరానికి సంబంధించిన అనుబంధ పద్దుల డిమాండ్ల మొదటి విడతను కూడా సభ ఆమోదించింది. ఉన్నత విద్యా నియంత్రణ సంస్థను ఏర్పాటు చేసేందుకు ఉద్దేశించిన వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు, 2025ను ఉభయ సభల సంయుక్త కమిటీకి పంపారు. మార్కెట్ సెక్యూరిటీల కోడ్‌పై మరో బిల్లును ప్రవేశపెట్టి, తదుపరి పరిశీలన కోసం సంబంధిత



స్టాండింగ్ కమిటీకి పంపారు. ఈ సమావేశాల్లో 300 నక్షత్రపు గుర్తు గల ప్రశ్నలు స్వీకరించబడ్డాయి. 72 నక్షత్రపు గుర్తు గల ప్రశ్నలకు మౌఖికంగా సమాధానాలు ఇచ్చారు. ఈ సమావేశాల్లో మొత్తం 3449 నక్షత్రపు గుర్తు లేని ప్రశ్నలు స్వీకరించబడ్డాయి. జీరో అవర్‌లో సభ్యులు మొత్తం 408 అత్యవసర ప్రజా ప్రాముఖ్యత గల అంశాలను లేవనెత్తారు. రూల్ 377 కింద మొత్తం 372 అంశాలు చర్చకు తీసుకోబడ్డాయి. 2025 డిసెంబర్ 11న, సభలో జీరో అవర్ సమయంలో 150 మంది సభ్యులు తమ అంశాలను ప్రస్తావించారు.

### రాజ్యసభలో 121 శాతం ఉత్పాదకత

రాజ్యసభ ఛైర్మన్ సి పి రాధాకృష్ణన్ శుక్రవారం గ్రామీణ ఉపాధి హామీ బిల్లు (జి రామ్ జి) ఆమోదం సమయంలో ప్రతిపక్ష సభ్యులు సృష్టించిన అంతరాయాలను తీవ్రంగా ఖండించారు. వారి ప్రవర్తన పార్లమెంటు సభ్యులకు తగనిదని పేర్కొంటూ, భవిష్యత్తులో ఇటువంటి ప్రవర్తనకు దూరంగా ఉండాలని, ఆత్మపరిశీలన చేసుకోవాలని వారిని కోరారు. 15 రోజుల పాటు జరిగిన శీతాకాల సమావేశాల సందర్భంగా జరిగిన శాసనపరమైన, ఇతర కార్యకలాపాల సారాంశాన్ని రాధాకృష్ణన్ చదివి వినిపించిన తర్వాత సభను నిరవధికంగా వాయిదా వేశారు. ఎగువ సభ 269వ సమావేశం అత్యంత ఉత్పాదకతతో సాగిందని, సుమారు 92 గంటల పాటు సమావేశాలు జరిగి 121 శాతం ఉత్పాదకతను నమోదు చేసిందని ఆయన అన్నారు. తన ముగింపు ప్రసంగంలో, రాధాకృష్ణన్ మాట్లాడుతూ, పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత సభకు అధ్యక్షత వహించడం ఇదే తన మొదటి సారి కాబట్టి శీతాకాల సమావేశాలు ముఖ్యమైనవని అన్నారు. ఈ సమావేశంలో జీరో అవర్ కార్యకలాపాలలో అపూర్వమైన పెరుగుదల నమోదైందని, సగటున ప్రతిరోజూ 84 కంటే ఎక్కువ నోటీసులు అందాయని, ఇది గత రెండు సమావేశాల కంటే 31 శాతం ఎక్కువ అయితే వాస్తవానికి లేవనెత్తిన అంశాలు రోజుకు సగటున 15 కంటే ఎక్కువగా ఉన్నాయని, ఇది దాదాపు 50 శాతం పెరుగుదల అని ఆయన అన్నారు. వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా 82 మంది సభ్యుల భాగస్వామ్యంతో రెండు రోజుల పాటు ప్రత్యేక చర్చ జరిగింది. ఎన్నికల సంస్కరణలపై జరిగిన మూడు రోజుల చర్చలో 57 మంది సభ్యులు ప్రసంగించారు.


ఈ సమావేశాల సందర్భంగా రాజ్యసభ ఎనిమిది బిల్లులను ఆమోదించింది లేదా తిరిగి పంపింది. 212 మంది సభ్యుల భాగస్వామ్యంతో జల (కాలుష్య నివారణ, నియంత్రణ) సవరణ చట్టం, 2024పై ఒక శాసన తీర్మానాన్ని ఆమోదించింది. ఏకంగా 59 ప్రైవేట్ సభ్యుల బిల్లులు ప్రవేశపెట్టబడ్డాయి. ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యం సజీవత్వాన్ని ప్రతిబింబిస్తుందని రాధాకృష్ణన్ అభివర్ణించారు. సమావేశాల సందర్భంగా 58 నక్షత్రపు గుర్తు గల ప్రశ్నలు, 208 జీరో అవర్ ప్రస్తావనలు, 87 ప్రత్యేక ప్రస్తావనలు ఉన్నాయని కూడా ఛైర్మన్ పేర్కొన్నారు, రూల్ 267 పరిధిని స్పష్టం చేస్తూ తాను ఒక వివరణాత్మక తీర్పును జారీ చేశానని చెప్పారు. సభా కార్యకలాపాలు సజావుగా జరిగేలా చూడటంలో తమ పాత్ర పోషించినందుకు ఉపరాష్ట్రపతి, ఉపాధ్యక్షుల ప్యానెల్ సభ్యులకు, రాజ్యసభ సచివాలయానికి మరియు మీడియాకు రాధాకృష్ణన్ ధన్యవాదాలు తెలిపారు.

### వాడీవేడీగా సమావేశాలు

ఈ శీతాకాల పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం నుంచే వాడీవేడీగా జరిగాయి. ఇండిగో సంక్షోభం, ఎస్ఐఆర్, ఎన్నికల సంస్కరణలు వంటి అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ సమయంలో అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. ఈ సెషన్ లో మొత్తం 59 బిల్లులను ప్రవేశపెట్టారు. ఎనిమిది బిల్లులను పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదించాయి. అందులో ఎంజీనరేగా స్థానంలో తీసుకొచ్చిన వీబీ జీ రామ్ జీ బిల్లు, పౌర అణు రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని అనుమతించే బిల్లులు, బీమా రంగంలో విదేశీ పెట్టుబడుల పరిమితిని 100 శాతానికి పెంచే బీమా సవరణ బిల్లు సహా మరి కొన్ని ఉన్నాయి.

## 'చాయ్ రాజా చాయ్'

లోక్‌సభ స్పీకర్ తేనేటి విందులో పాల్గొన్న అధికార, ప్రతిపక్ష నేతలు



**న్యూఢిల్లీ:** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు శుక్రవారం నిరవధికంగా వాయిదా పడిన తర్వాత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా, ఎన్‌సిపిఎస్‌పికి చెందిన సుప్రియా సూలే, ఇతర నాయకులు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ఆయన ఛాంబర్‌లో కలిశారు. సమావేశాలను సమర్థవంతంగా నిర్వహించినందుకు నాయకులు బిర్లాకు ధన్యవాదాలు తెలిపారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రులు కె రామ్మోహన్ నాయుడు, రాజీవ్ రంజన్ సింగ్ 'లలన్', చిరాగ్ పాశ్వాన్, ప్రహ్లాద్ జోషి స్పీకర్‌తో కలిసి తేనీటి విందులో పాల్గొన్నారు. '18వ లోక్‌సభ ఆరవ సమావేశం ముగిసిన తర్వాత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అన్ని పార్టీల గౌరవనీయ నాయకులతో ఒక ఆహ్లాదకరమైన సంభాషణ జరిగింది' అని బిర్లా ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో తెలిపారు.

శబరిమలలో బంగారం చోరీ కేసు

## ఇడికి దర్యాప్తునకు కోర్టు ఆదేశం

**తిరువనంతపురం:** శబరిమల అయ్యప్ప ఆలయంలోని బంగారు చోరీ కేసులో కొల్లం విజిలెన్స్ కోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. బంగారు దోపిడీపై దర్యాప్తు చేయడానికి కొల్లం విజిలెన్స్ కోర్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)కి అనుమతి ఇచ్చింది. ఈ కేసుకు సంబంధించిన అన్ని పత్రాలను ఇడికి అప్పగించాలని కోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఆదేశించింది. ఇప్పటివరకు నమోదైన రెండు ఎఫ్ఐఆర్ కాపీలు, నిందితులకు సంబంధించిన రిమాండ్ రిపోర్టులు సహా ఇతర కీలక దస్త్రాలను ఇడికి తక్షణమే ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ కేసులో ఇడి త్వరలో మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదుచేయనుందని తెలిసింది. శబరిమల ఆలయంలోని దేవుడి విగ్రహాల బంగారు తాపడం బరువులో వ్యత్యాసంపై దర్యాప్తు చేపట్టేందుకు కేరళ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా సిట్ ఏడుగురిని అరెస్టు చేసింది. అయితే మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టేందుకు అనుమతించాలని కోరుతూ ఈడీ తొలుత కేరళ హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు సూచన మేరకు కొల్లాం విజిలెన్స్ కోర్టులో పిటిషన్ వేయగా, ఇడి విజ్ఞప్తిని సిట్ వ్యతిరేకించింది. ఒకేసారి రెండూ కొనసాగడం దర్యాప్తును ప్రభావితం చేస్తాయని అభిప్రాయపడింది. సిట్ వాదనలను తిరస్కరించిన కొల్లాం విజిలెన్స్ కోర్టు, ఇడి విచారణకు అనుమతిచ్చింది.

పార్లమెంట్ ఔచిత్యం క్రమంగా తగ్గడం

## ప్రజాస్వామ్యానికి తీవ్ర ప్రమాదం

- రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ ధ్వజం



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ ఔచిత్యం క్రమంగా తగ్గడం ప్రజాస్వామ్యానికి తీవ్ర ప్రమాదం అని రాజ్యసభ్య సభ్యుడు, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ఆందోళన వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న వారు దాని గురించి పెద్దగా పట్టించుకోకుండా ప్రస్తుత కాలంలో అసంబద్ధమైన అంశాలపై దృష్టి సారిస్తున్నారని ఆరోపించారు. సీనియర్ న్యాయవాది, స్వతంత్ర ఎంపి కపిల్‌సిబల్ మాట్లాడుతూ ఇది ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరం అన్నారు. ఫలితంగా నిజమైన సమస్యలు పార్లమెంట్‌లో చర్చించబడటంలేదన్నారు. ఆయన శీతాకాలం సమావేశాల చివరిరోజైన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. శీతాకాలపు సమావేశాలు డిసెంబరు 1నుంచి 19వరకు 15 సమావేశాలు జరిగాయని కపిల్ సిబల్ ఎత్తిచూపారు. తాను గతంలో పార్లమెంట్ సభ్యుడుగా ఉన్నప్పుడు నవంబరు 20న ప్రారంభమయ్యేవన్నారు. 2017లో 13 సిట్టింగ్స్, 2022లో 13 సిట్టింగ్స్, 2023లో 14 సిట్టింగ్స్ జరిగాయని చెప్పారు. చర్చలు కొనసాగితే జరగాల్సినవి జరగవని, అధికారంలో ఉన్న వారు పార్లమెంట్‌లో పెద్దగా ఏమీచేయనట్లు కనిపిస్తోందని మాజీ కేంద్రమంత్రి కూడా అయిన కపిల్ సిబల్ నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలదాడికి దిగారు. డిసెంబరు 1న ప్రతిపక్షాలు ఓటర్ల జాబితాపై చర్చ లేదా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కోరుతున్నాయని, ఎందుకంటే నేడు ఎస్ఐఆర్ దేశంలో అతిపెద్ద సమస్య అని ఎత్తి చూపారు. ఓటర్ల జాబితా కలుషితమైతే మనం ప్రజాస్వామ్యంలో ఊపిరి ఎలా పీల్చుకుంటామని సిబల్ ప్రశ్నించారు. కాబట్టి ఎస్ఐఆర్ గురించి మనం చర్చించాలన్నారు. కానీ కోర్టులో ఉన్నప్పుడు మనం దాని గురించి చర్చించలేమన్నారు. కానీ బోఫోర్స్ అంశం కూడా పార్లమెంట్‌లో ఉన్నప్పుడు దానిని చర్చించడం జరిగిందని ఆయన గుర్తుచేశారు. కానీ ఎన్నికల సంఘం తమ ఆదేశం మేరకు తీసుకునే చర్యలను ప్రజలకు బహిర్గతం చేయకూడదనే ఒక సాకును చూపిస్తున్నారని కపిల్ సిబల్ ఆరోపించారు. ముందుగా ప్రభుత్వం వందేమాతరంపై చర్చిస్తామని ప్రకటించిందని, బిజెపి తన సమావేశాలను వందేమాతరంతో ప్రారంభిస్తుందా అని ప్రశ్నించారు. వారు జాతీయ గీతాన్ని నమ్మేవారు కాదని, 1942లో బ్రిటీష్‌వారి పక్షాన నిలిచిన వారు నేడు వందేమాతరం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని సిబల్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చడమే వారి లక్ష్యమని, అన్ని రాష్ట్రాలు వారి నియంత్రణలో ఉన్నప్పుడు వారు ఒకే దేశం, ఒకే ఎన్నిక, ఒకే భాష, ఒకే జాతి, ఒకే పార్టీ అంటూ రాజ్యాంగాన్ని మార్చాలని అనుకుంటున్నారని ఆయన ఆరోపించారు. 20ఏళ్లనాటి ఎంఎన్ఆర్ఇజిఎ రద్దు చేయడం శోచనీయమన్నారు. పౌర అణురంగాన్ని ప్రైవేట్ భాగస్వామ్యం కోసం తెరవడం వంటి కీలకమైన బిల్లులను ఆమోదించిన 19 రోజుల శీతాకాలపు సమావేశాలను శుక్రవారం నిరవధికంగా వాయిదా వేశారు. గ్రామీణ భారతదేశంలో125 రోజుల ఉద్యోగ హామీనిచ్చే 'జీరామ్ జి బిల్లు' గురువారం ప్రతిపక్షాల నిరసనల మధ్య కాగితాలను చించివేస్తున్న తరుణంలో ఆమోదించబడింది. ఈ నేపథ్యంలో రాజ్యసభ కూడా వాయిదా పడింది.

## ఓడరేవులు, నౌకల భద్రతకు ప్రత్యేక దళం

- కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సమావేశానికి మంత్రులు సోనోవాల్, కె.రామ్మోహన్ నాయుడు హాజరు

**న్యూఢిల్లీ:** ఓడ రేవులు, నౌకల భద్రత మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం 'బ్యూరో ఆఫ్ పోర్ట్ సెక్యూరిటీ' (బిఒపీ'ఎస్) అనే ఒక చట్టబద్ధమైన సంస్థను ఏర్పాటు చేయనున్నదని శుక్రవారం అధికారులు వెల్లడించారు. ఇది ఓడ రేవులు నౌకల భద్రతా సంబంధిత సమాచారాన్ని సకాలంలో విశ్లేషించడం, సేకరించడం, మార్పిడి చేయడం నిర్ధారిస్తుందని తెలియజేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా గురువారం బ్యూరో ఆఫ్ పోర్ట్ సెక్యూరిటీ ఏర్పాటు కోసం ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దీనికి ఓడరేవులు, షిప్పింగ్, జలామార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు హాజరయ్యారని ఒక అధికారిక ప్రకటన తెలియజేసింది. దేశ విధానపరంగా బలమైన ఓడరేవు భద్రతా చట్టాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని హోం మంత్రి అమిత్‌షా నొక్కిచెప్పారు. భద్రతా చర్యలను గ్రేడెడ్, రిస్క్ ఆధారిత పద్ధతిలో అమలు చేయాలని అమిత్‌షా ఆదేశించారు. ఖాతా దుర్బలత్వాలు, వాణిజ్య సామర్థ్యం, స్థానం ఇతర సంబంధిత పారామితులను పరిగణలోనికి తీసుకోవాలని ఆయన ఆదేశించారు. సముద్ర భద్రతా చట్రం నుంచి నేర్చుకున్న పాఠాలు విమానయాన భద్రతా రంగంలో ప్రతిబింబించాలని కూడా సమావేశం గుర్తించిందని ఆ ప్రకటన తెలిపింది. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బిసిఎఎస్) తరహాలో రూపొందించబడిన ఈ కొత్త సంస్థ నూతన మార్కెట్ షిప్పింగ్ చట్టం2025 ప్రకారం చట్టబద్ధమైన సంస్థగా ఏర్పడి ఓడరేవులు, షిప్పింగ్ జలమార్గాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుందని తెలియజేసింది. సీనియర్ ఐపిఎస్ అధికారి డైరెక్టర్ జనరల్‌గా వ్యవహరించే బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ సంస్థ ఓడలు, ఓడరేవు భద్రత సౌకర్యాలకు సంబంధించిన ఈ సంస్థ నియంత్రణ, పర్యవేక్షణ విధులకు బాధ్యత వహిస్తుంది. ఒక సంవత్సరం పరివర్తనకాలంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ బిఒపీఎస్ లాగా పనిచేస్తారని ప్రకటన వెల్లడించింది. 'బిఓపీ'ఎస్ భద్రతా సంబంధిత సమాచారానికి సంబంధించిన విశ్లేషణ, సేకరణ, తొలగింపును నిర్ధారిస్తుంది. డిజిటల్ బెదిరింపుల నుంచి ఓడరేవు ఐటి మౌలిక సదుపాయాలను రక్షించడానికి ప్రత్యేక విభాగంతో సహా సైబర్ భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తుంది' అని ఆ ప్రకటన వెల్లడించింది. ప్రభుత్వం సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్)ను రికగ్నైజ్డ్ సెక్యూరిటీ ఆర్గనైజేషన్ (ఆర్ఎస్ఓ)భద్రతా అంచనాలను చేపట్టడం, సౌకర్యాల కోసం భద్రతా ప్రణాళికలను తయారు చేయడం బాధ్యత. సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ (సిఎపిఎఫ్) ఓడరేవుల భద్రతలో నిమగ్నమైన ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల (పిఎస్ఏ'ల)సామర్థ్యాల నిర్మాణానికి శిక్షణ ఇస్తుంది.



## అలాంటి ఒప్పందమేదీ జరగలేదు

- సిఎం పదవిపై కర్ణాటక సిద్ధరామయ్య



**బెంగళూరు:** కర్ణాటకలో సిఎం మార్పుపై సందిగ్ధత ఇంకా కొనసాగుతూనే ఉంది. త్వరలో కర్ణాటకలో సిఎం మార్పు ఉంటుందని, డికె శివకుమార్ సిఎం అవుతారని డికె వర్గం ప్రచారం చేస్తుండగా.. సిఎం మార్పు జరిగే అవకాశం లేదని, పూర్తిగా ఐదేళ్లు తానే సిఎంగా కొనసాగుతానని సిద్ధరామయ్య సంకేతాలు ఇస్తున్నారు. ఈ విషయంపై ఆయన తాజాగా మరోసారి స్పందించారు. అసెంబ్లీలో మాట్లాడుతూ.. సిఎం పదవి షేరింగ్‌కు సంబంధించి నాడు (అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తర్వాత) ఎలాంటి ఒప్పందం జరగలేదని చెప్పారు. నేను ఇప్పటికే ఒకసారి ఐదేళ్లు సిఎం పనిచేశాను. ఆ తర్వాత మళ్లీ ముఖ్యమంత్రిని అయ్యాను. నాకు తెలిసినంతవరకు పార్టీ అధిష్ఠానం నాకే అనుకూలంగా ఉంది. సిఎం పదవిని ఇద్దరు వ్యక్తులు 2.5 ఏళ్ల చొప్పున పంచుకోవాలనే ఒప్పందమేదీ జరగలేదు అని సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో ప్రతిపక్షాల కామెంట్స్‌కు స్పందనగా.. ఐదేళ్లు తానే సీఎంగా కొనసాగుతానని సిద్ధరామయ్య చెప్పడం గత నాలుగు రోజుల్లో ఇది రెండోసారి. గత మంగళవారం కూడా ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేల కామెంట్స్‌కు స్పందిస్తూ.. 'ఇప్పుడు మళ్లీ చెబుతున్నా. ప్రస్తుతం నేను రాష్ట్ర ముఖ్యమంత్రిని, ఇక ముందు కూడా నేను ముఖ్యమంత్రిగా ఉంటా' అని వ్యాఖ్యానించారు. కాగా సిఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సిఎం శివకుమార్ మధ్య వివాదం చాలారోజులుగా కొనసాగుతోంది. ఈ విషయం హైకమాండ్ సైతం జోక్యం చేసుకుని సయోధ్య కుదిర్చింది. అయినా ప్రయోజనం లేదు. సిఎం మార్పు ఉంటుందని ప్రచారం జరుగుతూనే ఉంది.

'ఠాగూర్'కు అవమానంతో షురూ

## మహాత్ముడికి అవమానంతో ముగింపు

- పార్లమెంట్ శీతాకాల సమావేశాలపై కాంగ్రెస్ విమర్శలు



**న్యూఢిల్లీ:**పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడిన తరుణంలో సమావేశాలపై కాంగ్రెస్ ఘాటుగా స్పందించింది. ప్రభుత్వం రవీంద్రనాథ్ ఠాగూర్‌ను అవమానించడంతో ప్రారంభమై, మహాత్మాగాంధీని అవమానించడంతో ముగిశాయని కాంగ్రెస్ ఆరోపించింది. దీనిని 'కాలుష్య కాలపు' సమావేశంగా అభివర్ణిస్తూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్, వాయు కాలుష్యంపై చర్చకు తమ పార్టీ పూర్తిగా సి ద్ధంగా ఉందని, అయితే ప్రభుత్వం దానిపై చర్చకు పలాయనం చిత్తగిస్తో ందని అన్నారు. 'మణిపూర్, అనుబ ంధ గ్రాంట్ల డిమాండ్లపై రెండు బి ల్లులు కేవలం లాంఛనప్రాయంగా ఉంటాయని, మొత్తం 14 బిల్లులను ప్ర వేశపెడతామని మాకు చెప్పారు. 12 బిల్లులలో ఐదింటిని ప్రవేశపెట్టలేదు. బిల్లులు తీసుకురావాలని లేనప్పుడు వారు ఈ సమాచారాన్ని ఎందుకు ఇస్తారో నాకు తెలియదు' అని రమేష్ ఒక విలేకరుల సమావేశంలో అన్నారు. 'అఖిలపక్ష సమావేశంలో నేను రాజ్‌నాథ్ సింగ్‌తో ఈ సమావేశం ఒక లాంఛనప్రాయమని, సాధారణంగా సమావేశాల చివరిలో వారు ఒక బ్రహ్మాస్త్రాన్ని బయటకు తీస్తారని చెప్పాను. ఆయన నవ్వారు. ఈసారి కూడా అదే జరిగింది. చివరిలో ఒక బిల్లును తీసుకువచ్చి ప్రతిపక్షాల నినాదాల మధ్య ఆమోదించారు' అని రమేష్ వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) (విబి–జి రామ్ జి) బిల్లును ప్రస్తావిస్తూ అన్నారు. సమావేశాల సమయంలో జరిగిన వందేమాతరం చర్చ అంతా ప్రభుత్వం 'నెహ్రూను అపఖ్యాతి పాలు చేయడం, చరిత్రను వక్రీకరించడం గురించేనన్నారు. 'ఠాగూర్‌ను అవమానించారు. 1937లో ఠాగూర్ సిఫార్సు మేరకే జాతీయ గీతంగా మొదటి రెండు చరణాలను పాడాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయించింది' అని ఆయన అన్నారు. భారతదేశపు మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను కూడా అవమానించారని ఆయన అన్నారు. యుపిఎ హయాం నాటి చట్టమైన ఎంజిఎన్ఆర్ఇజిఎ స్థానంలో వచ్చిన 'జి రామ్ జి బిల్లు' ఆమోదాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ, ఈ సమావేశాలు గాంధీని అవమానించడంతో ముగిశాయని జైరామ్ రమేష్ అన్నారు.

## డిసెంబరు 22న ఎమర్జెన్సీ కేసుల విచారణకు 'నేను రెడీ' : సూర్యకాంత్

**న్యూఢిల్లీ:** అత్యవసర కేసుల విచారణను డిసెంబరు 22న చేపట్టేందుకు తాను సిద్ధంగా ఉన్నానని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ శుక్రవారం వెల్లడించారు. క్రిస్టమస్, నూతన సంవత్సర సెలవుల ప్రారంభరోజైన డిసెంబరు 22న ఎమర్జెన్సీ కేసుల విచారణ కోసం కేటాయిస్తున్నట్లు చెప్పారు. అత్యవసర కేసుల జాబితాను విచారించిన సిజెఐ సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, విపుల్ ఎం.పాంచోలితో కూడిన త్రిసభ్య ధర్మాసనం సుప్రీంకోర్టు రిజిస్ట్రీ కేసుల అత్యవసర పరిస్థితిని ధృవీకరించి తదనుగుణంగా జాబితాను నిర్ణయిస్తుందని తెలిపింది.

## బిఎంసి ఎన్నికల్లో శివసేన, బిజెపి మధ్య ప్రతిష్టంభన

**ముంబయి:**మహారాష్ట్రలో త్వరలో జరుగనున్న బిఎంసి ఎన్నికల్లో సీట్ల పంపకాల విషయంలో షిండే సారథ్యంలోని నెలకొంది. 2017 బ్రిహాన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ ఆ సమయంలో ఐక్య శివసేన గెలిచిన 84 సీట్లు తమకే కేటాయించాలని షిండే శివసేన డిమాండ్ చేసినట్టు తెలుస్తోంది. అయితే ఈ డిమాండ్‌ను బిజెపి నిర్ద్వంద్వంగా తోసిపుచ్చినట్టు సమాచారం. ప్రస్తుత పరిస్థితికి, 2017 నాటి పరిస్థితికి చాలా తేడా ఉందని బిజెపి వాదిస్తోంది. షిండే శివసేన, ఉద్ధవ్ థాక్రే శివసేన మధ్య ముఖాముఖీ పోటీ వల్ల మహాయుతి కూటమికి నష్టం జరుగుతుందని బిజెపి చెబుతోంది. షిండే శివసేన ఎక్కడైతే బలంగా ఉందో గెలుపు అవకాశాలు మెండుగా ఉన్నాయో ఆయా సీట్లను మాత్రమే కేటాయించగలమని బిజెపి స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. బిఎంసిలోని 227 సీట్లలో ఇరు పార్టీల మధ్య 77 సీట్ల విషయంలో విభేదాలు తలెత్తాయి. రాబోయే రెండు రోజుల్లో ఈ ప్రతిష్టంభనకు తెరపడే అవకాశం ఉంది. బిఎంసితో పాటు మహారాష్ట్రలోని 29 మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికల షెడ్యూల్‌ను డిసెంబర్ 15న రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. 2026 జనవరి 15న ఒకే విడతలో ఈ ఎన్నికలు జరుగనున్నారు. జనవరి 16న ఫలితాలు.

**కమిటీ ఏర్పాటు**

బిఎంసి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక కోసం ముంబయి బిజెపి అధ్యక్షుడు అమిత్ సతమ్ 20 మంది సభ్యుల కమిటీని ఏర్పాటు చేశారు. అమిత్ సతమ్ చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్, జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే, రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నార్వేకర్‌తో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు సభ్యులుగా ఉన్నారు.

## జనావాసాల్లోకి చిరుత

**థానె:** అడవిలో ఉండాల్సిన వన్య ప్రాణులు, క్రూర జంతువులు ఇటీవల కాలంలో జనావాసాల్లోకి ప్రవేశిస్తున్నాయి. గ్రామాల్లోకి వచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. తాజాగా మహారాష్ట్ర లో చిరుత కలకలం రేపింది. థానే జిల్లాలోని జనసాంద్రత ఎక్కువగా ఉన్న తూర్పు భయందర్ ప్రాంతంలోకి ప్రవేశించింది. శుక్రవారం ఉదయం ఓ భవనంలోకి ప్రవేశించి భయాందోళన సృష్టించింది. స్థానికులపై దాడి చేసింది. ఈ దాడిలో ఐదుగురికి గాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు వెంటనే అధికారులకు సమాచారం అందించారు. అనంతరం అతికష్టం మీద చిరుతను ఓ భవనంలో బంధించారు. ఇక ఘటనాస్థలికి చేరుకున్న అటవీ సిబ్బంది చిరుతను బోనులో బంధించి అక్కడి నుంచి తీసుకెళ్లిపోయారు. ఇక చిరుత దాడిలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చిరుత సంచారానికి సంబంధించిన దృష్యాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.


SHRIRAM Finance
**వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS25T 0552 | Divaswadeenam Thumma | New Holland 4710 | 2016 |
| 2 | TS29T 5276 | Bandi Samrajyam | Tata Ace Mega XL | 2017 |
| 3 | TS27T 6821 | Gopagani Vijay Kumar | John Deere 5105 D | 2021 |

AUCTION DATE : 20-12-2025
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
H.No :4-316,4-317,4-318, Ground Floor, Opp : Fire Station, Parkal, Warangal District Cell : 9666726222, 9989766426

ప్రజాపక్షం
శనివారం, 20 డిసెంబరు

# పేదలు కోల్పోతున్న దేమిటి?

ప్రపంచంలోనే అతిపెద్ద చట్టబద్ధ గ్రామీణ ఉపాధి హామీ (మహాత్మాగాంధి నరేగా) పథకాన్ని చరిత్రపుటల కెక్కించటమేకాదు, గత రెండు దశాబ్దాల్లో గ్రామీణ పేదల జీవన హక్కుకు భరోసా కల్పిస్తూ కోరిన వారికి పనులు చూపటం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు అది చేసిన దోహ దాన్ని యుపిఎ ప్రభుత్వ ''మహావైఫల్యానికి చిహ్నం''గా ప్రధాని నరేంద్రమోదీ అభివర్ణించటం దారుణం. అందులో వాస్తవ విశ్లేషణకన్నా కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రభుత్వ ఘనత వహించిన కార్యక్రమంగా అది కొనసాగటం పట్ల ఉన్న ద్వేషం వ్యక్తమవుతోంది. జాతిపిత మహాత్మా గాంధి పేరుతో ముడిపడి ఉన్న కార్యక్రమాన్ని మెరుగుపరిచి సమర్థవంతంగా అమలు చేసి ప్రతిష్టను సంతరించుకోవలసిన మోదీ ప్రభుత్వం ఆ చట్టాన్నే రద్దుచేసి మహాపరాధానికి పాల్పడింది. దానికి బదులుగా, రాముడిని గుర్తుచేసే విధంగా ''విబి–జీ రామ్ జీ'' పేరును కూర్చి ప్రభుత్వం తమ సంకుచిత మనస్తత్వాన్ని బయటపెట్టుకుంది. పేరులో ఏముందిలే గ్రామీణ పేదలకు మెరుగ్గా ఉపాధి కల్పన, వేతనాల పెంపు ద్వారా వారి జీవితాల మెరుగుదలకు తోడ్పడే చట్టం తెచ్చారులే అనుకోవటానికి వీల్లేకుండా, 125 రోజుల పనిదినాలు హామీ అంటూనే, దాని అమలును బహు పరిమితం చేస్తూ సర్వాధికారాలను కేంద్రం చేతిలో ఉంచుకుని, రాష్ట్రాలు వ్యయంలో 40 శాతం భరిస్తేనే పథకం మంజూరు అని షరతు పెట్టింది. భరింపశక్యంగాని భారాన్ని రాష్ట్రాలపై పెట్టటంలో ఆ పథకాన్ని కుదించే ఉద్దేశం చెప్పకనే వ్యక్తమవుతున్నది.

మహాత్మాగాంధి నరేగా చట్టాన్ని రద్దుచేసి కొత్త బిల్లుకు హడావుడిగా ఆమోదముద్ర వేయించుకోవటాన్ని పార్లమెంటులోని సర్వ ప్రతిపక్షాలు ముక్తకంఠంతో ఖండించి నిరసన తెలిపినా ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి ప్రభుత్వం పట్టించుకోలేదు. దాని మిత్రపక్షాలుగా ఉన్న జెడి(యు), టిడిపి, లోక్‌జనశక్తి(ఆర్‌విపి) పార్టీలు సిగ్గువిడిచి దాని అడుగులకు మడుగులొత్తాయి. కాని ప్రపంచ ప్రసిద్ధ ఆర్థిక వేత్తలు బహిరంగలేఖలో భారత ప్రభుత్వ చర్యను తప్పుబట్టారు. ఆర్థిక ఆత్మగౌరవాన్ని ప్రాథమిక హక్కుగా పునరుద్ఘాటించిన చట్టాన్ని రద్దు చేయటాన్ని ''చారిత్రక తప్పిదం''గా వ్యాఖ్యానించారు. కేంద్రప్రభుత్వాన్ని ఉద్దేశించి ఆ లేఖ రాసిన వారిలో – నోబెల్ బహుమతి గ్రహీత జోసఫ్ ఇ స్టిగ్లిట్జ్, పవ్‌లినా ఆర్. టెచెర్‌నెవా, ప్రెసిడెంట్, లేవీ ఎకనామిక్స్ ఇన్‌స్టిట్యూట్ (అమెరికా); థామస్ పికెట్టి, ప్రొఫెసర్, పారిస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (ఫ్రాన్స్); ఇసాబెల్లి ఫెర్రీరాస్, ప్రొఫెసర్, యూనివర్శిటీ ఆఫ్ లోవైన్ (బెల్జియం); డార్రిక్ హామిల్టన్, ప్రొఫెసర్, న్యూ స్కూల్ ఫర్ సోషల్ రీసెర్చి (యుఎస్‌ఎ); రాండాల్ డబ్లురే, సీనియర్ స్కాలర్, ది లేవీ ఎకనామిక్స్ ఇన్‌స్టిట్యూట్(అమెరికా); జేమ్ గాల్‌బ్రెయిత్, ప్రొఫెసర్, యూనివర్శిటీ ఆఫ్ టెక్సాస్, ఆస్టిన్ (యుఎస్) – ఉన్నారు.

ఎంజి నరేగాను ''అడిగిన వారందరికీ ఉపాధిని లీగల్ హక్కుగా అమలులోకి తెచ్చిన ప్రపంచ ప్రాముఖ్యతగల విధాన చర్య''గా ఆర్థిక వేత్తలు పేర్కొన్నారు. దాని ప్రభావాన్ని నొక్కి చెప్పటానికి కావలసినంత ఆధారం ఉంది. ఆ చట్టం అమలులోకి వచ్చిన ఆరంభ సంవత్సరాల్లో అపూర్వంగా గ్రామీణ వేతనం పెరిగింది. ఆర్థిక ఉత్పత్తి, సమర్థతపై ఆ కార్యక్రమం సానుకూల ప్రభావాలను అధ్యయనాలు ధృవీకరించాయి. అది ఉత్పత్తి రహితమైనదన్న వాదనలను త్రోసిపుచ్చారు. అయితే ''ఏటేటా నిధుల కేటాయింపు తగ్గింపు, చెల్లింపులో జాప్యాలు'' ఆ పథకానికి ఆటంకాలు కల్పించాయి. కొత్త బిల్లు రాష్ట్రాలకు బాధ్యతను బదిలీ చేస్తున్న తీరు, అందుకు తగినట్లు నిధుల కేటాయింపులేకపోవటం ఆ పథకం అస్థిత్వానికే ముప్పు తెస్తుంది. గత చట్టం కింద పరికరాలకయ్యే ఖర్చులో 25శాతం రాష్ట్రాలు భరించాల్సి ఉండగా కొత్త చట్టం 100శాతం వాటి నెత్తిన మోపింది. ఇదొక చిత్రమైన పరిస్థితి కల్పిస్తుంది : ఉపాధి చూపాల్సిన బాధ్యత లీగల్‌గా రాష్ట్రాలపై ఉంటుంది. కేంద్ర నిధులు కోతపెట్టి 40 శాతం రాష్ట్రాలపై విధించటం జరుగుతుంది. పేద రాష్ట్రాలు వర్క్ డిమాండ్‌ను అణచివేసి ప్రాజెక్టు ఆమోదాలు కుదించే స్థితి వస్తుందని వారు హెచ్చరిక చేశారు. వివక్షాపూర్వకంగా పథకాన్ని నిలుపు చేసే నిబంధనలను వారు విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌కు నిష్కారణంగా గత మూడేళ్లుగా నిధులు ఇవ్వకపోవటాన్ని రాజకీయ దుర్వినియోగానికి ఉదాహరణగా వారు పేర్కొన్నారు. అటువంటి చర్యలు ఉపాధి హామీని అర్థరహితం చేస్తాయన్నారు. గత చట్టాన్ని రద్దు చేయటం దారిద్ర్య నిర్మూలన, సామాజిక న్యాయం, పర్యావరణ సంరక్షణకు సాధనంగా రుజువైన పథకాన్ని విడనాడటం అవుతుందన్నారు. అందువల్ల ఈ పథకం అమలుకు కేంద్రం నిధులకు హామీ ఇవ్వాలి, సకాలంలో చెల్లింపులు జరపాలి, చట్టంలోని వ్యవస్థాపిత గ్యారంటీలను పునరుద్ధరించాలని ఆర్థిక వేత్తలు కోరారు. మోదీజీ, వినబడుతోందా, విఖ్యాత మేధావుల గొంతు!

## కార్మికులతో ఎక్కువ గంటలు

# పనిచేయించనున్న లేబర్ కోడ్‌లు



కృష్ణ ఝా

కార్పొరేట్ రంగానికి సాంకేతిక పురోగతి తోడవడంతో మరింత సంపాదించాలనే అంతులేని దాహాన్ని సృష్టించింది. మరింత మిగులు పొందడానికి దోపిడీ వేగం దాని శిఖరాగ్రానికి పెరిగింది. ఉద్యోగాలను తగ్గించడానికి, నిరుద్యోగ రేటును పెంచడానికి కూడా ప్రయత్నాలు జరిగాయి. తాము సొంతంగా నిలదొక్కుకోవడం గురించి కార్మికులు నిరంతరం అనిశ్చితిలో ఉంటారు. ఇది గందరగోళాన్ని సృష్టించింది. వాటి వాటి స్వీయ ప్రత్యేక లక్షణాలతో అనియత, సంఘటిత కార్మికులు ఉంటారు.. కార్మికులు అయోమయంలో ఉన్నట్లు అనిపిస్తుంది. ప్రతీ ప్రభుత్వం సరళీకరణను అనుసరిస్తూనే ఉంది.

ఇలాంటి సర్వసాధారణ అవగాహనకు మూల కారణం ఏమిటంటే, ప్రతి ఒక్కరూ ప్రైవేటీకరణను కోరుకోవడమే. ఈ ప్రక్రియలో కార్మికవర్గం ఇలాంటి వినాశకరమైన చర్య భారాన్ని భరించవలసి వస్తే, వారి పట్ల ఎలాంటి శ్రద్ధ ఉండదు. ఇప్పుడు సరళీకరణ తదుపరి దశను ఉద్యోగరహిత వృద్ధి దశ అని పిలుస్తారు. యజమానులు, వారి మద్దతుదారులు కార్మిక వ్యతిరేక చర్యలు అన్నీ తీసుకున్నప్పటికీ, కార్మికుడు మౌనంగా అంగీకరించాల్సి వస్తుంది. ఎందుకంటే తమ స్వంత ఉద్యోగాన్ని పణంగా పెట్టడం చాలా కష్టం. రెండు శతాబ్దాల క్రితం కూడా అన్యాయాలను తిప్పికొట్టడానికి ధైర్యం చేసిన కార్మికుడికీ ఈ సంక్లిష్టతలన్నీ జీవితంలో భాగమే. కానీ ఇప్పుడు ఉద్యోగాలు లేవు, నిరుద్యోగం అంతటా వ్యాపించింది. కొత్త శతాబ్దం సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలలో సంక్లిష్టతలను ఎదుర్కొంటోంది. ఉత్పత్తి సాధనాలు, ఉత్పత్తి ప్రక్రియలపై యాజమాన్యం, సేవలు, కార్మికులపై ప్రభావం చూపే స్థాయిలో సాంకేతిక అభివృద్ధి జరిగింది. ప్రపంచీకరణ స్వభావంలో కూడా మార్పు చోటు చేసుకుంది. వ్యక్తిగత లాభ ఆధారిత దృక్పథం లేదా మానవ పురోగతి దిశానిర్దేశం చేసిన సాధికారత సమానత్వం నుండి అసమాన పంపిణీకి దారితీస్తున్నది.

21వ శతాబ్దంలో ఎదురవుతున్న సవాళ్లు చాలా శక్తిమంతమైనవి. అవి ప్రధానంగా బహుళ జాతి సంస్థలు సహా యజమాని అవలంబించే కార్మిక వ్యతిరేక విధానం నుంచి, యజమాని అనుకూల ప్రభుత్వ విధానం నుంచి వస్తున్నాయి. టెక్నాలజీ, దాని అభివృద్ధి సాధారణ సంక్షేమం వైపు ఉపయోగించబడుతుందని మనకు గొప్ప ఆశలు ఉండినాయి. కానీ వాస్తవంలో అది కనిపించడం లేదు. సవాళ్లు సిద్ధంగా ఉన్నందున, పరివర్తన రోజుల్లో వాటి స్వంత కష్టాలు ఉంటాయి.

శ్రమజీవులు ఎనిమిది గంటలకు బదులుగా పన్నెండు గంటలు శ్రమ చేయవలసి వస్తుంది.సుదీర్ఘ, తీవ్ర పోరాటం ద్వారా ప్రపంచ కార్మికులు సాధించిన ఈ హక్కును అర్థాంతరంగా తొలగించారనేది వాస్తవం. ఇది నాలుగు కార్మిక కోడ్‌ల అమలు ఫలితం. ఇది వలస వ్యవస్థను గుర్తు చేస్తుంది. బానిసలకు స్పృహ ఉండకూడదు, తద్వారా పరిణామం చెందకూడదు. కార్మికుడు యంత్రంలో ఒక భాగంగా మారి, ముందుగా నిర్ణయించిన పద్ధతిలో పనిచేయాల్సి వస్తుంది. అది కూడా పన్నెండు గంటలు. పరాయీకరణ వ్యక్తిగత కార్మికుడిని గుప్పిట పెట్టుకుంది. పెట్టుబడిదారీ విధానంలోని జాఢ్యాలు జీవం పోసుకుంటాయి. కొత్త కార్మిక నియమావళి కార్మికుల కోసం నిర్మించిన రక్షణ చర్యలను ఎత్తివేస్తున్నందున వాటితో పోరాడాలి. సుదీర్ఘ పని దినం, భద్రతా చర్యలు లేకపోవడం, రద్దీగా ఉండే పని గదులు, పేరుకుపోయిన ధూళి ప్రాణాలకు ముప్పుగా మారతాయి.

ఫ్యాక్టరీల చట్టం –1948 ప్రకారం ఓవర్ టైం చెల్లింపు లేకుండా కార్మికులను రోజుకు ఎనిమిది గంటలు లేదా వారానికి 48 గంటలకు మించి పని చేయమని బలవంతం చేయకూడదు. వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ – 2020, ఇప్పుడు ఆరు –ఎనిమిది గంటల పని దినాల ప్రామాణిక షెడ్యూల్‌ను అట్టిపెడుతూనే దానితోపాటు నాలుగు 12 గంటల షిఫ్ట్‌ల ఎంపికను అనుమతించింది. కాబట్టి వారంలో 48 గంటల పరిమితిని అధికారికంగా కొనసాగిస్తూనే, సౌకర్యవంతమైన రోస్టరింగ్, ఓవర్ టైం నిబంధనల సాంప్రదాయ పరిమితులకు మించి రోజువారీ పని గంటలను గణనీయంగా పొడిగించడానికి యజమానులను అనుమతిస్తుంది. పైకి చూస్తే, ఈ నిబంధన యజమానులు, కార్మికులిద్దరికీ ప్రయోజనం చేకూర్చే ఒక సౌకర్యవంతమైన ఏర్పాటుగా కనిపిస్తుంది. యజమానులు ఉత్పత్తి డిమాండ్లకు అనుగుణంగా సర్దుబాటు చేసుకోవచ్చు, కార్మికులు ఓవర్ టైం వేతనం పొందవచ్చు. అయితే, ఆచరణలో పొడిగించిన పని గంటలను అంగీకరించాల్సిందిగా కార్మికులపై యజమానులు ఒత్తిడి చేయడానికి కొత్త కోడ్లు అనుమతిస్తాయి. ముఖ్యంగా తమ ఒప్పందాలను పునరుద్ధరించాలని కోరుకునే స్థిరకాలిక, కాంట్రాక్ట్ కార్మికులపై ఈ ఒత్తిడి ఉంటుంది.

కొత్త కార్మిక నిబంధనల ప్రకారం కార్మికులకు రోజుకు 12 గంటలు పనిచేయడం తప్ప వేరే మార్గం ఉండదు. అలాంటి 'ఎంపిక' అస్సలు ఎంపికే కాదు. ఓవర్‌టైమ్‌కు వేతనం చెల్లించినప్పటికీ 12 గంటల పనిదినం కార్మికుల ఆరోగ్యం, కుటుంబ జీవితం, మానవ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా శారీరకంగా, మానసికంగా అలసిపోయేలా చేస్తుంది. జాతీయ స్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో కార్మికవర్గ ఐక్యత కోసం బలమైన అవసరం ఏర్పడింది. కార్మికవర్గ సుదీర్ఘ పోరాటం తర్వాత 8 గంటల పని దినంపై ప్రపంచ ఏకాభిప్రాయం వచ్చిందనేది వాస్తవం. ఆ పోరాటం పందొమ్మిదవ శతాబ్దం ద్వితీయ భాగంలో కార్మికుల దినోత్సవానికి ద్వారాలు తెరిచి, అమెరికాలో మొదటి మే డేను ప్రారంభించింది.

కమ్యూనిస్ట్ మానిఫెస్టో జర్మన్‌లో నాలుగవ ప్రచురణలో 1890 మే 1న ఎంగెల్స్ రాసిన ముందుమాటలో ఆయన అంతర్జాతీయ కార్మిక సంఘాల చరిత్రను సమీక్షిస్తూ, మొదటి అంతర్జాతీయ మే దినోత్సవం ప్రాముఖ్యత గురించి ఇలా రాశారు: ''నేను ఈ పంక్తులు రాస్తున్నప్పుడు, యూరప్, అమెరికా కార్మికవర్గం, వాటి బలగాలపై సమీక్షను నిర్వహిస్తోంది; ఆది మొదటిసారి ఒకే సైన్యంగా సమీకరించబడి, ఒకే తక్షణ లక్ష్యం కోసం పోరాడుతోంది: ఎనిమిది గంటల పని దినం, చట్టబద్ధంగా స్థిరపరచబడింది. మనం ఇప్పుడు చూస్తున్న దృశ్యం అన్ని దేశాల పెట్టుబడిదారులు, భూస్వాములు నేడు అన్ని దేశాల శ్రామికవర్గం ఐక్యంగా ఉన్నారని గ్రహించేలా చేస్తుంది. మార్క్స్ నాతో ఉంటే తన కళ్ళతో దాన్ని చూడగలిగితే బాగుండు!'' అంతర్జాతీయ కార్మికవర్గ ప్రదర్శనల ప్రాముఖ్యత ప్రపంచవ్యాప్తంగా కార్మికుల ఊహకు, విప్లవాత్మక ప్రవృత్తులకు మరింత ఆకర్షణీయంగా మారింది. ఏటేటా ప్రదర్శనలలో ఎక్కువ మంది పాల్గొంటుండటం కనిపిస్తోంది.







మే 1వతేదీన 8 గంటల దినోత్సవం కోసం జరిగే ప్రదర్శన, సామాజిక మార్పు ద్వారా వర్గ వ్యత్యాసాలను ధ్వంసం చేయడానికి, తద్వారా ప్రజలందరికీ శాంతి, అంతర్జాతీయ శాంతికి దారితీసే ఏకైక మార్గంలోకి ప్రవేశించడానికి కార్మికవర్గం దృఢ సంకల్పానికి నిదర్శనంగా ఉపయోగపడుతుంది.

**(ఐపిఎ సర్వీస్)**

# సంక్షోభంలో ప్రజాస్వామ్య వ్యవస్థ

## లోక్‌సభలో సిపిఐ



**లోక్‌సభలో ఎన్నికల సంస్కరణలపై డిసెంబర్ 10న జరిగిన చర్చలో సిపిఐ తరపున ఎంపి కె.సుబ్బరాయన్ (తిరుప్పూర్) పాల్గొన్నారు. ఆయన ప్రసంగంలోని ముఖ్యాంశాలు**

''అధ్యక్షా...ఎన్నికల సంస్కరణలపై భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తరపున నా అభిప్రాయాలను ఈ సభలో ముందు ఉంచుతున్నాను. స్వతంత్ర భారతదేశంలో అనేక సంవత్సరాలుగా జరుగుతున్న ఎన్నికలు మనకు ఎన్నో అనుభవాలను ఇచ్చాయి. వాటి నుంచి నేటి పాలకులు పాఠాలు నేర్చుకొని ఈ దిశగా ఆలోచిస్తారో లేదో నాకు తెలియదు.

ఇప్పుడు అవసరమైన మొదటి సంస్కరణ ఏమిటంటే, ఓట్ల శాతానికి అనుగుణంగా దామాషా పద్ధతిలో ప్రాతినిధ్యాన్ని కల్పించాలి. నిజంగా ప్రజాస్వామ్యాన్ని ప్రేమించే, దానిపట్ల శ్రద్ధ వహించే వారు చేయవలసిన గొప్ప సంస్కరణ ఇది. అప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. జాతీయ స్థాయిలో ప్రతి పార్టీకి వచ్చిన ఓట్లు, ఓటింగ్ శాతాన్ని మీరు చూడాలి. ఆ శాతం ఆధారంగా, ప్రతి పార్టీకి ఎంపిలు, ఎమ్మెల్యేల సంఖ్యను నిర్ణయించాలి. ఇది అత్యంత అవసరమైనది. కానీ నేటి పాలకులు అలా చేసేందుకు సుముఖంగా లేరు.

అధికార పార్టీ, ప్రభుత్వం పనితీరును దగ్గరగా గమనిస్తే, వారిలో అలాంటి ఆలోచన లేదా ఆలోచనా విధానం ఏమాత్రం లేదని స్పష్టంగా తెలుస్తోంది. తప్పుఎక్కడ జరిగింది? ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థకు నాయకత్వం వహించే నైతిక బాధ్యత ఈ ప్రభుత్వానికి ఉందా? ఎన్నికల కమిషనర్ ఎంపిక కోసం ముగ్గురు సభ్యుల ప్యానెల్ నుండి భారత ప్రధాన న్యాయమూర్తి ని మీరు (ప్రభుత్వం) ఎందుకు తొలగించారు? మీ ఉద్దేశం ఏమిటి?

గౌరవ ప్రతిపక్ష నాయకుడు మిమ్మల్ని నాలుగు ప్రశ్నలు అడిగారు. అవన్నీ చాలా అర్థవంతమైనవి. అధికారంలో ఉన్నవారు సమాధానం చెప్పాలి. వారు ఈ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలి. ఈ నాలుగు ప్రశ్నల లో కుట్ర దాగి ఉంది. వారు గంభీరంగా సమాధానం ఇస్తే, అది ప్రయోజనకరంగా ఉంటుంది. వారు మూడు ఏర్పాట్లు చేశారు. మొదటిది ఏమిటంటే, వారు 2011 జనాభా లెక్కలను వాయిదా వేశారు. ఈ ప్రభుత్వం ప్రకటించినట్లుగా, ఇది 2027లో జరుగుతుంది. 2031కి ప్రకటించాల్సిన జనాభా లెక్కలు ఇప్పుడు 2027లో జరుగుతాయి.

దీని వెనుక ఒక ఉద్దేశం ఉంది. మీరు ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను చూస్తే, ఆయన 2029 సంవత్సరం వరకు ఆ పదవిలో ఉంటారు. ప్రస్తుత ఎన్నికల కమిషనర్ 2029 వరకు ఆ పదవిలో కొనసాగేలా వారు ఒక పక్కా ఏర్పాటు చేశారు. వారు ఎంత కుట్రపూరితంగా ఉన్నారో చూడండి? వారు ఈ ఏర్పాటు ఎందుకు చేశారు? ఈ విషయంపై వారు సామాన్య ప్రజలకు సమాధానం చెబుతారా? ఎందుకంటే వారిలో నిజాయితీ లేదు. ప్రజాస్వామ్యంలో వారు అనర్హులు.

పాలకులకు ఆర్‌ఎస్‌ఎస్ సంస్థ నేర్పిన పాఠం ఇదే. మీరు చేస్తున్న పనిని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం అంటారు. మీరు ఒక శక్తివంతమైన ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల గొంతును అణచివేస్తున్నారు. మీరు అలా చేస్తే ఓడిపోతారు. ప్రజాస్వామ్యాన్ని అంగీకరించవద్దని వారికి ఆర్‌ఎస్‌ఎస్ నేర్పిం ది. నేను బహిరంగ సవాలు చేస్తున్నాను. ప్రజాస్వామ్యం ఒక విదేశీ వస్తువు, అది ఏ విధంగానూ భారతీయ స్వభావం కలది కాదు — గోల్వాల్కర్ వారికి నేర్పిన పాఠం ఇదే. గోల్వాల్కర్ నుండి పాఠాలు నేర్చుకున్న తర్వాత, వాళ్ళు (బిజెపి – ఆర్‌ఎస్‌ఎస్) రాజ్యాంగం, మతాన్ని ఉపయోగించి ప్రజాస్వామ్య వ్యవస్థను చేజిక్కించుకుని అధికారాన్ని ఆక్రమించారు. దీని ద్వారా, వారు ఆ సంస్థలలో ఉంటూనే ప్రజాస్వామ్య వ్యవస్థలను నాశనం చేస్తారు లేదా కూల్చివేస్తారు. అందుకే అన్ని విధాలుగా, వారు సైన్యం, న్యాయవ్యవస్థ, అన్ని ఇతర సంస్థలలో చొరబడుతున్నారు. భారతదేశం ఒక కఠినమైన, అత్యంత దారుణమైన సమయాన్ని ఎదుర్కొంటోంది.''



# ఎన్నికల ఖర్చును ప్రభుత్వమే భరించాలి

## రాజ్యసభలో సిపిఐ



**రాజ్యసభలో ఎన్నికల సంస్కరణలపై డిసెంబర్ 15న జరిగిన చర్చలో సిపిఐ సభ్యుడు పి.పి. సునీర్(కేరళ)పాల్గొన్నారు. ఆయన ప్రసంగం లోని ముఖ్యంశాలు ఇలా ఉన్నాయి.**

''మన గణతంత్ర ప్రజాస్వామ్య సారా న్ని కాపాడటానికి ఈ సభ చర్చించి ఎన్నికల సంస్కరణలను ముందుకు తీసుకురావడం అత్యవసరం. ఎన్నికలు ఒక ఆచారం కాదు, అవి ప్రజల సంకల్పాన్ని పాలన రూపంలోకి తీసుకువచ్చే విధానం. ఈ ప్రక్రియలో ఏదైనా వక్రీకరణ జరిగితే అది పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మూలం మీద, అంటే ప్రాతినిధ్యంపై దాడి చేస్తుంది.

ఓటర్ల జాబితా ప్రత్యేక ఉధృత సవరణ (ఎస్‌ఐఆర్) ద్వారా ఎదురయ్యే పెను ముప్పు పై మనం దృష్టి పెట్టాలి. పారదర్శకంగా, పౌరులకు స్నేహపూర్వకంగా ఉండాల్సిన కసరత్తుకు బదులుగా ఒక పరీక్ష మారింది. బిహార్‌లో ఈ ప్రక్రియలో లక్షలాది మంది ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయి . ఆశ్చర్యకరంగా 2025 సెప్టెంబర్ 30న ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితాను ప్రకటించిన తర్వాత మూడు లక్షలకు పైగా ఓటర్లు చేర్చబడ్డారు. ఇదొక్క అంశమే ఈ కసరత్తు విశ్వసనీయత, ఉద్దేశ్యం, శాస్త్రీయ ఆధారం గురించి తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతుంది. అనేక రాష్ట్రాలలో ఎస్‌ఐఆర్ పౌరులకు, ఎన్నికల సిబ్బందికి ఒక పీడకలగా మారింది. సాధారణ ఓటర్లు చాలా దూరం ప్రయాణించి, అనేక పత్రాలను సమర్పించి, ఓటు హక్కు తమకు రాజ్యాంగ హామీగా కాకుండా సంపాదించుకోవలసిన హక్కు అని నిరంతరం ఆందోళన చెందుతూ జీవించాల్సి వస్తోంది. అదే సమయంలో, బూత్ స్థాయి అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది అస్పష్టమైన, అశాస్త్రీయమైన తొందరపాటు మార్గదర్శకాల కారణంగా అపూర్వమైన ఒత్తిడికి గురవుతున్నారు. కార్మికులలో మానసిక ఒత్తిడి, తీవ్ర పరిణామాల నివేదికలు తీవ్రంగా కలవరపెడుతున్నాయి. ఈ గందరగోళానికి పూర్తి బాధ్యత భారత ఎన్నికల కమిషన్‌దే.

అందరికీ సమాన అవకాశాలు, స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన ఎన్నికలకు ఆత్మ వంటిది. రిఫరీ పక్షపాతంగా కనిపించినప్పుడు, మ్యాచ్ చట్టబద్ధతను కోల్పోతుంది. అది ఎంపిక చేసిన నియమాల అమలు అయినా, స్పష్టమైన ఉల్లంఘనలపై నిశ్శబ్దం అయినా లేదా నిగూఢంగా నిర్ణయం తీసుకోవడం అయినా, ఎన్నికల కమిషన్ విశ్వసనీయత దెబ్బతింటుంది. ఇది మన ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం.

ఈ మూడు సవాళ్లను పరిష్కరించడానికి, సిపిఐ తరుపున ఈ సభ ముందు ఈ క్రింది డిమాండ్లను పెడుతున్నాను. మొదటిది వ్యయ పరిమితులను కఠినంగా అమలు చేయడం, ఇంద్రజిత్ గుప్తా కమిటీ సిఫార్సు చేసిన విధంగా ఎన్నికలకు ప్రభుత్వ నిధులను విధానాన్ని ప్రవేశపెట్టడం, రాజకీయాల్లో డబ్బు పాత్రను అరికట్టడం. ఇది మన దేశంలోని మెజారిటీ పేద వర్గాల ప్రజలు ఎన్నికల రాజకీయాల్లో అర్థవంతంగా పాల్గొనడానికి వీలు కల్పిస్తుంది.

'రెండవది, నేరపూరితమవడానికి వ్యతిరేకంగా చట్టాలను బలోపేతం చేయడం, తీవ్రమైన అభియోగాలు, ముఖ్యంగా దారుణమైన నేరాలు, ద్వేషపూరిత ప్రసంగాలు చేసిన అభ్యర్థులు న్యాయస్థానాలు అర్హతను ఖరారు చేసే వరకు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిరోధించడం. ఎన్నికల కమిషన్ నియామక ప్రక్రియను సంస్కరించడం, అధిక కార్యనిర్వాహక జోక్యం నుండి దానిని విముక్తి చేయడం, ప్రజా విశ్వాసాన్ని ప్రేరేపించే పారదర్శక, ద్వైపాక్షిక యంత్రాంగాన్ని నిర్ధారించడం. ప్రజాస్వామ్యం సంప్రదాయాలపై మాత్రమే మనుగడ సాగించదు. ఇది విశ్వాసం, న్యాయం, ప్రాతినిధ్యంపై మనుగడ సాగిస్తుంది. ఎన్నికల సంస్కరణలు పక్షపాత డిమాండ్ కాదు, అవి నేడు మనకు అవసరం. ఓటు బలహీనమైతే, గణతంత్రం బలహీనపడుతుంది. ఓటు హక్కు ఆగిపోయే ముందు మనం చర్య తీసుకుందాం.''

# పాలస్తినా ఆర్థికవ్యవస్థను కుప్పకూల్చిన ఇజ్రాయెల్



బుడ్డిగ జమిందార్

గాజా ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత స్థితి గురించి (2024 చివరిలో నుంచి 2025 ప్రారంభం వరకూ)ఐక్యరాజ్య సమితి వాణిజ్యం అభివృద్ధి (యుఎన్‌సిటిడిఎడి) సభ చర్చించి, అత్యంత దారుణమైన ఆర్థిక పరిస్థితిని ఎదుర్కొంటోందని తెలిపింది. స్విట్జర్‌లాండ్‌లో జరిగిన 16 వ మహాసభలో గాజా ఆర్థిక స్థితిగతుల్ని, ప్రపంచానికి తెలియజేసింది. 2 సంవత్సరాల పాటు ఇజ్రాయిల్ యుద్ధం పేరిట కొనసాగించిన మారణకాండ పాలస్తినాను కోలుకోలేని స్థితికి తీసుకెళ్లింది. పాలస్తినాను ఇజ్రాయిల్ సర్వనాశనం చేసింది. 2023 సంవత్సరంతో పోల్చుకుంటే 2024లో జిడిపి 83 శాతం కుప్పకూలిందనీ, తలసరి జిడిపి 161 డాలర్లకు పడిపోయిందనీ, అంటే రోజుకు 50 సెంట్ల కంటే తక్కువ ఆదాయంతో ప్రపంచంలోని అత్యల్ప ఆదాయ స్థాయిలలో ఒకటిగా ఉందని ఐక్యరాజ్య సమితి వాణిజ్యసంస్థ తెలిపింది. ఈ సంస్థ అంచనా ప్రకారం 2022 తో గాజా ఆర్థిక వ్యవస్థను పోలిస్తే ఊహించని విధంగా 13 శాతానికి కుంచించిపోయింది. ద్రవ్యోల్బణం 238 శాతానికి, నిరుద్యోగం 80 శాతానికి పెరిగిందని మొత్తం 23 లక్షల మంది నివాసితులు దారిద్ర్య రేఖ దిగువకు నెట్టబడ్డారని తెలిపింది. గాజాలో దాదాపు 70 శాతం నిర్మాణాలు ధ్వంసమైనాయి.

2023 అక్టోబరు తర్వాత ఇజ్రాయిల్ జరిపిన సైనిక కార్యకలాపాలతో గాజా ఆర్థిక పునాదులు నాశనమయ్యాయి. మొత్తం పాలస్తినా ఆర్థికవ్యవస్థ 2 సంవత్సరాల పోరాటం, ఆంక్షలు ఫలితంగా ఆర్థికవ్యవస్థ తీవ్రంగా చితికిపోయిందని,త్సి_నా వెస్ట్‌బ్యాంక్ ప్రాంతం కూడా తీవ్రమైన తిరోగమన ఆర్థిక వ్యవస్థకు జారిపోయిందని యుఎన్‌సిటిడిఎడి తెలిపింది. అప్పటికే అసలు లోపభూయిష్ట అభివృద్ధితో నడుస్తున్న గాజా ఆర్థిక వ్యవస్థ పూర్తి వినాశనానికి దారితీసింది. గత 69 సంవత్సరాలుగా నడుస్తున్న అంతంత మాత్రమైన అభివృద్ధిని ఈ సంక్షోభం మొత్తం తుడిచిపెట్టింది. ఇజ్రాయిల్ పాలస్తీనాను కబళించటంతో పాలస్తినా ఎన్‌క్లేవ్ అభివృద్ధి దేశంగా మారింది. ఎన్‌క్లేవ్ అభివృద్ధి అనగా పరరాజ్య పరివేష్ఠిత దేశంగా నిర్వచనముంది. వాస్తవానికి పాలస్తినాలో తలదాచుకోటానికి వచ్చిన యూదులు పాలస్తినాలో ఎన్‌క్లేవ్ రాజ్యంగా ఏర్పడి 69 సంవత్సరాల చరిత్రలో పాలస్తినాను ఎన్‌క్లేవ్ రాజ్యంగా మార్చటం అతి దుర్మార్గం. దీనికి అమెరికా, పశ్చిమ దేశాలు మద్దతును ఇస్తున్నాయి. ప్రపంచ ముడిచమురు నిల్వల్లో పశ్చిమాసియాలో 48 శాతం ఉన్నాయి. ఈ ముడిచమురుపై అమెరికా ఆధిపత్యం కోసం ఇజ్రాయిల్‌కు ఏటా సుమారు 400 కోట్ల డాలర్ల ఆయుధ సామాగ్రిని అమెరికా సమకూరుస్తుంది. ఒక సర్వే ప్రకారం 1946 నుంచి ఇప్పటివరకు 35 వేల కోట్ల డాలర్ల వరకూ అమెరికా సహాయమందించింది. గాజాపై యుద్ధం ప్రారంభమైన 2023 అక్టోబరు 7 నుంచి 1630 కోట్ల డాలర్ల ఖరీదు చేసే ఆయుధ సామాగ్రి సమకూర్చింది. ఇజ్రాయిల్ ప్రధాని అడిగినప్పుడల్లా అధునాతన బాంబులను గాజా (ప్రజల)పై వేయటానికి పంపానని సాక్షాత్తు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇజ్రాయిల్ పార్లమెంటు క్నెసెట్‌లో ప్రకటించి గాజా వినాశనానికి ఏ విధంగా అమెరికా కారణమైందో తెలపకనే తెలిపారు. ఇప్పుడు గాజా పునర్నిర్మాణానికి కనీసం 7000 కోట్ల డాలర్లు ఖర్చవుతుందని, దీనికి దశాబ్దాలకాలం పడుతుందని నివేదిక తెలిపింది. (ఈలోగా ఇజ్రాయిల్ మరలా దాడులు చేయకమానదని చరిత్ర నుంచి సులభంగా గ్రహించవచ్చు, అంటే పాలస్తినా ఎన్నటికీ గాడినపడటమనేది ప్రశ్నార్థకమే. ఇజ్రాయిల్ నిర్వహించిన దాడుల్లో 70,100 మంది చని పోయారని, లక్షలాది మంది క్షతగాత్రులైనారని అధికార లెక్కలు చెబుతుండగా, అనధికారికంగా ఇంకా ఎక్కువ ప్రజలు చనిపోయి ఉంటారు.

2025 అక్టోబరు 10 ప్రారంభంతో గాజా ప్రాంతం నుంచి ఇజ్రాయిల్ వెనక్కు తగ్గాలని, కాల్పులను విరమించాలని, హమాస్ దాదాపు 2000 పాలస్తినా యుద్ధ ఖైదీలకు బదులుగా 20 మంది ఇజ్రాయిల్ బందీలను విడిపించాలని అమెరికా మధ్యవర్తిత్వం పిలుపునిచ్చింది. అయితే కాల్పుల విరమణ అమలు ప్రారంభమైనప్పటికీ, ఇజ్రాయెల్ వైమానిక దళాల కాల్పులు జరుగుతూనే ఉన్నాయి. ఈ మధ్యకాలంలో ఇజ్రాయిల్ కనీసం 500 సార్లు కాల్పుల విరమణ షరతులను ఉల్లంఘించి అమాయక గాజా ప్రజలపై కాల్పులు జరిపిందనీ, ఈ 44 రోజుల్లో కనీసం 360 మంది సామాన్య ప్రజల ప్రాణాల ను బలిగొందని ది గార్డియన్ పత్రిక పది రోజుల క్రితం రాసింది. ఆహార సరఫరాలకు ఇప్పటికీ ఇజ్రాయిల్ అంతరాయం కల్గిస్తోంది, నెమ్మదిగా మాత్రమే సరిహద్దుల నుంచి అతి తక్కువ వాహనాలను గాజాలోనికి వదుల్తోంది. నివాస పరిస్థితులు ఘోరాతి ఘోరంగా ఉన్నాయి. అంతర్జాతీయ సహకారంపైనే ఆధారపడిన గాజా ప్రజలు ఇజ్రాయిల్ అనుమతి నిరాకరణతో మానవతా సంక్షోభం ఏర్పడింది. దీనికితోడు డిసెంబరు 11నాడు అకస్మాత్తుగా వచ్చిన బైరాన్ తుపాను కారణంగా పిల్లలతో సహా 14 మంది పాలస్తినియన్లు మరణించారు. వినాశకరమైన యుద్ధపర్యవసానంగా టెంట్లులేక, చలినుంచి తట్టుకోటానికి శిథిలమైన భవనాల్లో ఎక్కడో ఒకమూల తల దాచుకోవాల్సిన పరిస్థితులేర్పడ్డాయి. ఈ తుపానుకు ఆ శిథిల స్లాబులు కూడా కూలటంతో ఈ విపత్కర పరిస్థితులేర్పడ్డాయి.

ఇటీవలి సంఘర్షణలకు ముందు గాజా ప్రాంతం 17 సంవత్సరాల పాటు తీవ్ర దిగ్బంధనానికి గురైంది. మునుపటి ఇజ్రాయిల్ సైనిక దాష్టిక కార్యకలాపాల వలన ఇప్పటికీ పాలస్తినా తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటోంది. వ్యవసాయ రంగం సర్వనాశనమైంది. 86 శాతం పంట భూములు, 83శాతం నీటి బావులు దెబ్బతిన్నాయి. విద్యాలయాలు ఇంకా తెరవలేదు, విద్యుత్తులేక అంధకారంతో జనాలు అలమటిస్తున్నారు, చాలీచాలని తాగునీరు అదీ కలుషితంగాను, డ్రైనేజీ సదుపాయాలు లేక అంటువ్యాధులు ప్రభలుతున్నాయి. గతంలో ఎక్కువమంది శ్రామికశక్తిని నియమించిన కొద్దిపాటి పారిశ్రామికరంగం తీవ్రంగా దెబ్బతింది. లఘు, కుటీర పరిశ్రమలు కుదేలైనాయి. 82 శాతం వ్యాపారాలు తీవ్ర ప్రభావానికి లోనైనాయి. ఉన్న ఒక్క ఓడరేవుతోపాటుగా పనిచేసే విమానాశ్రయానికి దీర్ఘకాలిక ప్రాప్యత లేకపోవటం, తీవ్రమైన కదలిక పరిమితులతోపాటు వాణిజ్యసామర్థ్యాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పాలస్తినా ప్రభుత్వం తీవ్రమైన ఆర్థిక సంక్షోభానికి గురై ఆదాయాలు కుప్పకూలిపోవటం మరొక ప్రధాన కారణం. ప్రభుత్వానికి పన్నుల చెల్లింపులు పూర్తిగా ఆగిపోయాయి. ప్రపంచ దేశాలు పాలస్తినాకు సంఘీభావం తెలుపుతూ, ఆర్థిక సహాయం అందించటంతో పాటుగా, ఇకపై ఇజ్రాయిల్ అమెరికా అండతో పాలస్తినాపై యద్ధం చేయకుండా, రెండు రాజ్యాల స్థాపనకై గొంతెత్తి చాటాలి.

**ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యవర్గ సభ్యుడు, 9849491969**

## వితంతువులకు ఆర్థిక సాయానికి వినతి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** అర్హులైన వితంతువులకు నేషనల్ బెనిఫిట్స్ స్కీమ్ కింద ఆర్థిక సాయం అందేలా చూడాలని వినాయకనగర్ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్కాజిగిరి సీతారంను కోరారు. శుక్రవారం ఆయన డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో భర్తను కోల్పోయి పిల్లా పాపలతో కుటుంబ పోషణ చేసుకొనే మహిళలకు సంబంధించి 40 మంది దరఖాస్తులను తహసీల్దార్‌కు సమర్పించారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలి

### కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని, ప్రభుత్వం కొనసాగిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు లభించేలా చూడాలని తెలంగాణా రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సూచించారు. నేరేడ్‌మెట్ డివిజన్‌లోని ఆర్కే పురం ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత చంద్రశేఖర్, తెలంగాణా సెక్రటరీలు విశ్వనాథ్, నవీన్‌లతో కల్సి శుక్రవారం గాంధీ భవన్‌లో ఆమెను మర్యాద పూర్వకంగా కలిసారు.



## రిసార్ట్స్‌లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, రిసార్ట్‌ల యజమానులు పోలీసుల నిబంధనలను తప్పకుండా పాటించి పోలీసులకు సహకరించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ హెచ్చరించారు. శుక్రవారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో రిసార్ట్‌ల యజమానులు, ఫామ్ హౌజ్ మేనేజ్‌మెంట్‌లతో న్యూ ఇయర్ వేడుకలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ న్యూ ఇయర్ వేడుకల సమయంలో డ్రగ్స్ వినియోగం గాని అనుమతి లేని మద్యం అమ్మకాలు లేదా సరఫరా గాని, అధిక శబ్దంతో డిజె సౌండ్ సిస్టమ్స్ ఏర్పాటు చేయకూడదని చెప్పారు. వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించే వారు ముందస్తు అనుమతులు తీసుకోవాలని చెప్పారు. శాంతి భద్రతలకు భంగం కలుగకుండా మహిళలకు, యువత భద్రతకు ప్రాధాన్యతనిస్తు సిసిటివి కెమరాలు సక్రమంగా పనిచేసేలా అగ్నిమాపక భద్రతా చర్యలు పాటించాలని, పార్కింగ్ ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. మైనర్లకు మద్యం సరఫరా చేయకూడదని అసభ్య ప్రవర్తనకు అవకాశం ఇవ్వకుండా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. నేరరహిత వాతావరణంలో న్యూ ఇయర్ వేడుకలను జరుపుకోవాలని ఏమైనా చట్ట విరుద్ధ కార్యకలాపాలు జరిగినట్లయితే సంబంధిత యజమానులు, నిర్వాహకులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫామ్‌హౌజ్, రిసార్ట్‌లు యజమానులను నోటీసుల రూపంలో అందజేసి వారినుంచి అంగీకార పత్రం తీసుకోవడం జరిగిందన్నారు. పోలీస్‌శాఖ ప్రజల సహకారంతో శాంతియుతంగా, సురక్షితంగా న్యూ ఇయర్ వేడుకలు జరిగేలా పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఎస్‌ఐ సోమిరెడ్డి, ఎస్‌ఐ శశివర్ధన్‌రెడ్డి, కృష్ణ, రిసార్ట్‌ల యజమానులు పాల్గొన్నారు.

## కార్మికుల సేవలు అమోఘం

### 100మంది కార్మికులకు లయన్స్ క్లబ్ క్యాప్‌ల పంపిణీ

**ప్రజాపక్షం/తాండూరు:** పారిశుద్ధ్య కార్మికులు నిత్యం ప్రజల ఆరోగ్య భద్రతకోసం చేస్తున్న సేవలు అమోఘమని తాండూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులు శరణు బస్సప్ప అన్నారు. చలీ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని శుక్రవారం ఉదయం తాండూరు మున్సిపల్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు తాండూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన 100మంది కార్మికులకు క్యాప్‌లు పంపిణీ చేశారు.




ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండూరు పట్టణ ప్రజలకోసం విధులు నిర్వహిస్తున్న కార్మికుల రక్షణ మనందరి బాధ్యతని అన్నారు. ఉదయం నాలుగు గంటల నుండి చలిని సైతం లెక్క చేయకుండా పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతారని అన్నారు. వారి రక్షణ కోసం పరికరాలను అందించడం ద్వారా వారి భద్రతను మరింత పెంచిన వారమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మి, మున్సిపల్ కమీషనర్ యాదరిగి, లయన్స్ క్లబ్ కార్యదర్శఇ మంకాల నటరాజ్, సభ్యులు సంగప్ప, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు వెంకటయ్య, ఉమేష్, జవాన్లు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## బైక్ పైనుంచి పడి వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** బైక్‌పై వెళ్తు రోడ్డు పక్కన ఉన్న గోడను ప్రమాదవశాత్తు ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. తుర్కపల్లి జీనోమ్ వ్యాలీ ఇన్‌స్పెక్టర్ గురువయ్య తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట మండలం అలియాబాద్ గ్రామానికి చెందిన గడుసు కుంటి సంజీవ(30) అలియాబాద్ గ్రామం నుంచి లాగడిమలక్ పేటకు మీదుగా తునిక బొల్లారం గ్రామానికి తన బైక్‌పై వెళ్తుండగా లాల్‌గడిమలక్‌పేట దగ్గర బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న నర్సరీ గోడకు ఢీకొనగా తలకు బలమైన రక్త గాయాలు తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. శవపంచనామా నిమిత్తం మృతదేహాన్ని మేడ్చల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



## మాజీ ఎంపిటిసి బత్తిని మృతి

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మూడుచింతలపల్లి మున్సిపాలిటి పొన్నాల్ గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి బత్తిని సత్యనారాయణగౌడ్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. బత్తిని సత్యనారాయణగౌడ్ వార్డు మెంబర్‌గా తన రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టి శామీర్‌పేట సొసైటీలో డైరక్టర్‌గా, ఎంపిటిసి పదవుల్లో ప్రజా ప్రతినిధిగా గ్రామానికి ఉత్తమ సేవలందించారు. అలాగే సత్యనారాయణ తల్లి కూడ గ్రామానికి సర్పంచ్ గా సేవలు అందించింది. ఇటీవల తాజా మాజీ సర్పంచ్‌గా బత్తిని సత్యనారాయణ భార్య సుకన్య పదవీ బాధ్యతలు నిర్వర్తించారు. గత 25 సంవత్సరాలుగా రాజకీయంలో ఉంటూ తనదైన శైలిలో గ్రామానికి సేవలు అందించి చివరకు పక్షవాతంతో బాధపడుతు అనారోగ్యంతో మృతి చెందాడు. ఇట్టి విషయం తెలుసుకున్న మాజీ జడ్‌పిటిసి నక్క ప్రభాకర్‌గౌడ్, మాజీ ఎంపిపి నాలుక యాదగిరిలు సత్యనారాయణ అంత్యక్రియల్లో పాల్గొని పాడెమోసి నివాళులర్పించారు. సత్యనారాయణ అంత్యక్రియలు పొన్నాల్‌లో తన స్వగ్రామంలో నిర్వహించారు. అంత్యక్రియల్లో ఎ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, బిఆర్‌ఎస్ మూడుచింతలపల్లి అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని నివాళులర్పించారు.



# వరదలు, పారిశ్రామిక ప్రమాదాలపై ఎన్‌డిఎంఎ రాష్ట్రస్థాయి మాక్ ఎక్సర్‌సైజ్

### 22న క్షేత్రస్థాయిలో అమలు : సిఎస్ రామకృష్ణారావు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** వరదలు, పారిశ్రామిక ప్రమాదాల వంటి విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరింత బలోపేత చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్‌డిఎంఎ) కేంద్ర ప్రభుత్వంతో కలిసి నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిపరేటరీ ఎక్సర్‌సైజ్‌పై పాల్గొన్న అధికారులకు చీఫ్ సెక్రటరీ, అన్ని శాఖలు, ఏజెన్సీలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇటీవల అనూహ్య వాతావరణ పరిస్థితుల కారణ ంగా తెలంగాణలో అకస్మాత్తుగా వరదలు సంభవిస్తున్నాయని, అలాగే కొన్ని ప్రధాన పారిశ్రామిక ప్రమాదాలు చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు. భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా నైపుణ్యాలు, వనరులు, ప్రతిస్పందన సామర్థ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహణలో ఎన్‌డిఎంఎ అందిస్తున్న మార్గనిర్దేశం, సమన్వయాన్ని ఆయన ప్రశంసించారు. వరదలు, పారిశ్రామిక ప్రమాదాలుపై ఈ నెల 22న క్షేత్రస్థాయిలో మాక్ ఎక్సర్‌సైజ్‌ను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రం, జిల్లాలు, శాఖల సన్నద్ధతను పరీక్షించి బలోపేతం చేయడం, ఇన్సిడెంట్ రెస్పాన్స్ సిస్టమ్‌లను కార్యరూపంలోకి తేవడం, అంతర్‌శాఖ సమన్వయం, ఎమర్జెన్సీ సపోర్ట్ ఫంక్షన్ల ప్రభావకారితను అంచనా వేయడం ఈ విన్యాసాల ప్రధాన లక్ష్యాలుగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ శాఖ డిజి విక్రమ్ సింగ్ మన్, ఎన్‌డిఎంఎ సభ్యుడు లెఫ్టినెంట్ జనరల్ అతా హుస్సేన్, లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ సుధీర్ బహల్, రెవెన్యూ శాఖ కార్యదర్శి, విపత్తు నిర్వహణ ఇన్‌చార్జ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లోకేష్ కుమార్‌తో పాటు అన్ని జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్‌పిలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సుమారు 35 శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వివాదంగా ఇంటర్ డిస్ట్రిక్ట్ టి-20 లీగ్ మ్యాచ్‌లు

### తన తండ్రి పేరుతో నిర్వహించ తలపెట్టిన మంత్రి వివేక్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్మిక శాఖ రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి తన తండ్రి జి.వెంకటస్వామి పేరుపై హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ)తో ఇంటర్ డిస్ట్రిక్ట్ టి20 క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు నిర్వహించే అంశం ప్రస్తుతం వివాదస్పదంగా మారింది. మంత్రి వివేక్ తన తండ్రి పేరుతో స్వతహాగా క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించడంలో తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) స్పష్టం చేసింది. అయితే అక్రమ కేసులో పీకలలోతులో కూరుకుపోవడమే కాకుండా కోర్టు తీర్పులు, బిసిసిఐ నిబంధనలకు వ్యతిరేకంగా హెచ్‌సిఎతో కలిసి ఈ పోటీసులు నిర్వహింస్తే మాత్రం తాము అడ్డుకుంటామని టిసిఎ నేతలు హెచ్చరించారు. టిసిఎ ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..ఇంటర్ డిస్ట్రిక్ట్ టి20 క్రికెట్ మ్యాచ్‌లు పెట్టే అర్హత హెచ్‌సిఎకి లేదని గతంలోనే ఓ కేసు విషయంలో కోర్టుకు అఫిడవిట్ కూడా ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. అలాంటప్పుడు మంత్రి వివేక్ స్పాన్సర్‌షిప్‌తో హెచ్‌సిఎ పోటీసులు ఎలా నిర్వహిస్తుందని ఆయన ప్రశ్నించారు.

మరోవైపు రాష్ట్ర మంత్రి కుటుంబానికి చెందిన విశాఖ ఇండస్ట్రీస్ సంస్థకు హెచ్‌సిఎ నుంచి రూ.67 కోట్ల బకాయి ఉందంటూ ఆర్బిట్రేషన్ వివాదం నడుస్తోందని గుర్తు చేశారు. ఇలాంటి వివాదం కొనసాగుతున్న సమయంలో అదే సంస్థ హెచ్‌సిఎ టోర్నమెంట్‌కు స్పాన్సర్‌గా రావడం తీవ్ర వాణిజ్య సంఘర్షణగా (కమర్షియల్ కాన్ఫ్లిక్ట్) మారిందన్నారు. 2018లో కూడా ఇదే పద్దతిలో విశాఖ ఇండస్ట్రీస్ సంస్థ నుంచి సుమారు రూ.2 కోట్లు స్పాన్సర్ కింద తీసుకుని హెచ్‌సిఎ అక్రమంగా టోర్నమెంట్లు నిర్వహించిందని, ఈ సారి కూడా అదే పద్దతులు అవలంభిస్తుందని.. తాము దీన్ని అడ్డుకుని తీరుతామని అన్నారు. ప్రస్తుతం హెచ్‌సిఎకి చెందిన అన్ని బ్యాంక్ ఖాతాలు సిఐడి ఫ్రీజ్ చేసిందని, ఈ నేపథ్యంలో మంత్రి ప్రకటిస్తున్న స్పాన్సర్ నిధులు ఏ ఖాతాలోకి, ఎవరికి వెళ్తాయనే అంశంపై స్పష్టత లేదని అన్నారు.

## అట్టహాసంగా ప్రారంభమైన మైనార్టీ స్కూల్ స్పోర్ట్స్‌మీట్

### క్రీడలను ప్రారంభించిన మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** నేటి బాలికలే రేపటి వీర వనితలని విద్యార్థినిల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికితీయడం, క్రీడా సాంస్కృతిక రంగాల్లో నైపుణ్యాలను మెరుగుపరుచడం లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జోష్ 3 క్రీడలను అట్టహాసంగా ప్రారంభించిందని మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్ అన్నారు. శుక్రవారం మూడు చింతలపల్లి మున్సిపాలిటీ జగ్గంగూడలోని తెలంగాణ మైనార్టి రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు చెందిన మైనార్టి స్కూల్ విద్యార్థులకు జోష్ 3 క్రీడలను ఘనంగా అట్టహాసంగా ప్రారంభించారు. అంతకుముందు ముఖ్య అతిథులుగా విచ్చేసిన మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మైనార్టి సంక్షేమ అధికారి కాంతమ్మలు విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్ ద్వార గౌరవ వందనం స్వీకరించారు. జ్యోతి ప్రజ్వలన, జాతీయ జెండా ఆవిష్కరణ, క్రీడా జ్యోతిని వెలిగించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందన్నారు. గురుకుల పాఠశాలలను అన్ని హంగులతో తీర్చిదిద్దుతామని అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి క్రీడల పట్ల ఆసక్తిగా ఉన్నారని అన్నారు. మేడ్చల్ గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని నలుమూలల నుంచి విద్యార్థినిలు పెద్ద ఎత్తున తరలివచ్చి స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు ఫోన్‌లతో కుస్తీపడకుండా పుస్తకాలను చదివి జ్ఞానం పెంచుకోవాలన్నారు. అనంతరం వాలీబాల్, కబ్బడి, ఖో ఖో ఆటలను ప్రారంభించారు. ముఖ్య అతిథులను పాఠశాల యాజమాన్యం శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం కృష్ణ, మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్, స్పోర్ట్స్ ఆఫీసర్ సోమేశ్వర్, ఖుత్సియ హుస్సెన్, షీటీం ఇన్‌చార్జ్ అస్మ అంజూమ్, డిఇ స్ఫూర్తి, 12 పాఠశాలల ప్రిన్సిపల్స్, స్థానిక మైనార్టీ నాయకులు యూసుఫ్, షఫీ, ఆద్యాపకులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది, పిడిలు, పిఇటిలు, మెడికల్ నర్సులు, ఆశాలు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## సంగయ్యకు పట్నం మహేందర్‌రెడ్డి పరామర్శ



**ప్రజాపక్షం/తాండూరు:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోట్‌పల్లి సర్పంచ్ బసమ్మ భర్త జంగం సంగయ్యపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయాల పాలైన జంగం సంగయ్యను హుటాహుటిన గురవారం రాత్రి హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా డిసిసి అధ్యక్షులు ధారాసింగ్‌తో కలసిన యశోద ఆసుత్రిక చేరుకుని జంగం సంగయ్యను పరమార్శించారు. జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

**ఎల్లమ్మ తల్లి దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తా**

ముద్దాయిపేట్ రేణుకా ఎల్లమ్మ తల్లి దేవాలయ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని ప్రభుత్వం చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. యాలా ల మండల పరిధి ముద్దాయిపేట్ రేణుకా ఎల్లమ్మ తల్లి తిరుణాల్ జాతర ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ప్రభుత్వం చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పూజలు, మంగళహారతితో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలతో కలసి పట్నం మహేందర్‌రెడ్డి అమ్మవారికి బోనం ఎత్తి సమర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విఫ్ మాట్లాడతూ ముద్దాయి పేట్ ఆలయ అభివృద్ధికి గతంలో ఎంఎల్‌ఏగా, మంత్రిగా అనే సేవలు అందించానని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రచార కమిటి సమన్వయకర్త కరణం పురుషోత్తమరావు, సర్పంచ్ రుద్రమణి రాజప్ప, ఉపసర్పంచ్ శివకుమార్, దేవాలయ కమిటి చైర్మన్ దేవరగారి రాములు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## ఐడిపిఎల్ భూములను కాపాడుకుందాం

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** ఐడిపిఎల్ భూములను కాపాడుకుందామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజల అవసరాల కోసం నాడు రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలకు భూములు కేటాయించిందని అందులో భాగంగానే ఐడిపిఎల్ సంస్థకు బాలానగర్ మండలం పరిధిలో సుమారు 920 ఎకరాలను కేటాయించిందని ఆ పరిశ్రమలో వేలాదిమంది ఉద్యోగాలు చేసి తమ కుటుంబాలను పోషించుకున్నారని అన్నారు. కానీ వాటిని మూసివెయ్యడం వల్ల భూములకు రక్షణలేకుండా పోవడం వల్ల నేడు వాటిని కొంతమంది వ్యాపారవేత్తలు రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకొని కబ్జా చేస్తున్నారని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి భూములను కాపాడాలని లేకపోతే వామపక్షా లు ఐక్యమై భూములను కాపాడుకోవడానికి పోరాటం నిర్వహిస్తామని అన్నారు. రానున్న రోజుల్లో అందరిని కలుపుకొనిపోయి ప్రభుత్వ భూములను కాపాడుకోవడానికి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో సిపిఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి కృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు హరినాథ్, శ్రీనివాస్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాజశేఖర్, సిపిఐ నాయకులు మాజీ కౌన్సిలర్ నర్సయ్య, మనోహర చారి, వంశీ, తదితరులు పాల్గొన్నారు.




## 'వందేమాతరం' 150 ఏళ్లు పూర్తి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** వందేమాతరం నేటికి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలు, కళాశాలల నుండి దాదాపు 1300ల విద్యార్థులతో గురుకుల్ జూనియర్ కళాశాల ఆవరణలో వందేమాతరం గీతం ఆలాపన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్య నారాయణ మూర్తి పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి వందేమాతరం యొక్క గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎబివిపి రాష్ట్ర కార్యసమితి సభ్యులు అంకం శ్యామ్ కిరణ్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి దేశభక్తి అలవర్చుకొని వికసిత్ భారత్ కోసం పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమానికి గురుకుల్ కాలేజ్ ప్రిన్సిపల్ నారాయణ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భాను, సచిన్, సిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఉదయ్, గౌతమ్, హరి, రామకృష్ణ, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఇకపై మొబైల్ యాప్ ద్వారానే యూరియా బుకింగ్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** యూరియా పంపిణీని రైతులకు సులభతరం చేసే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక యాప్ అందుబాటులోకి తీసుకొని వచ్చిందని జిల్లా వ్యవసాయాధికారిణి చంద్రకళ తెలిపారు. ఇకపై రైతులు యూరియా కోసం దుకాణాల వద్ద వేచి ఉండాల్సిన పని ఉండదని, తమ ఇంటి నుండి యాప్ ద్వారా తమకు కావల్సిన యూరియాను నిర్ణీత వ్యవధి ప్రకారం బుక్ చేసుకొని పొందవచ్చన్నారు. యూరియా పంపిణీలో గతంలో ఎదురైన ఇబ్బందుల దృష్ట్యా రాష్ట్ర వ్యవసాయ శాఖ రూపొందించిన ఈ యాప్ ఈ నెల 22 నుండి అందుబాటులోకి రానుందని, ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. దీనికోసం ఫెర్టిలైజర్ యాప్‌ను తమ మొబైల్ ఫోన్లలో ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొని తమకు సంబంధించిన పూర్తి వివరాలను పొందుపరచి లాగిన్ అవ్వాల్సి ఉంటుందన్నారు. జిల్లాల వారీగా రిటైల్ సరఫరాదార్ల వద్ద ఉన్న యూరియా స్టాక్ వివరాలను సైతం యాప్ ద్వారా తెల్సుకోవచ్చన్నారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాదారులు, నాన్ పట్టా లేక ఎన్‌డిఎస్ రైతులు, కౌలుదారులు మాత్రమే యూరియా బుకింగ్ చేసుకోగలుగుతారన్నారు. యూరియా బుకింగ్‌ను సురక్షితం చేసేందుకు రైతుల పట్టా పాస్ బుక్‌తో లింక్‌చేసిన మొబైల్ నంబరుకు ఒటిపి పంపించటం జరుగుతుందన్నారు. తమ పొలం విస్తీర్ణత, నిర్ణీత వ్యవధిమేరకు యూరియా బుక్ చేసుకోవాలన్నారు.

## హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్‌లో తెలంగాణ షార్ట్ ఫిలిమ్స్ పెట్టకపోవడం దుర్మార్గం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లో ప్రారంభమైన 'హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిలింఫెస్టివల్'లో తెలంగాణ షార్ట్ ఫిలిమ్స్ పెట్టకపోవడం దుర్మార్గమని తెలంగాణ లఘు చలనచిత్ర సాంస్కృతిక సమితి అధ్యక్షులు గొల్లపల్లి దయానంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని సమితి కార్యాలయంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో సమితి నేతలు గజ్జల రమేష్, లెనిన్ బాబు, గోపాల కృష్ణతో కలిసి గొల్లపల్లి దయానంద్ మాట్లాడారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ కోసం రూ.30 లక్షలను తెలంగాణ ప్రభుత్వ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కేటాయించిందని, జ్యూరీ కమిటీలో ఒక్కరు కూడా తెలంగాణ వారు లేరని, తెలంగాణ షార్ట్ ఫిలిమ్స్ కూడా ప్రదర్శన కోసం ఎంపిక చేయలేదని వాపోయారు. లక్షలు ఖర్చుపెట్టి సందేశాత్మక, విలువలతో కూడిన అనేక షార్ట్ ఫిలిమ్స్ తెలంగాణ కళాకారులు తీసారని, వాటిని పరిగణలోకి తీసుకోకపోవడం విచారకరమన్నారు. నిబంధనల పేరుతో తెలంగాణ షార్ట్ ఫిలిమ్స్ ఎంపిక చేయకపోవడం తెలంగాణ అస్థిత్వాన్నే దెబ్బతీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు.

## 'మీ డబ్బు — మీహక్కు' ప్రత్యేక శిబిరం ఏర్పాటు

### కలెక్టర్ ప్రతీక్‌జైన్



**ప్రజాపక్షం/వికారాబాద్:** ఈ నెల 23 'మీ డబ్బు మీ హక్కు ' ప్రత్యే శిబిరాన్ని నిర్వహింస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తెలిపారు. క్లైయిమ్ చేసకొని ఆర్థికపరమైన ఆస్తులను ప్రజలు తిరిగి పొందేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'మీ డబ్బు మీహక్కు' కార్యక్రమంలో భాగంగా ఈనెల 23న కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటలకు వరకు ఈ శిబిరం కొనసాగుతుందని అన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి అక్టోబర్ 4న గుజరత్ గాంధీ నగర్ లో ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంవత్సరాలు తరబడి క్లైయిమ్ చేయని బ్యాంక్ డిపాజిట్లు,షేర్లు, డివిడెంట్లు, మ్యూచువల్ ఫండ్స్, బీమా పాలసీలు తదితర ఆస్తులను వాస్తవ యజమానులు సులవుగా పొందేందుకు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది అని కలెక్టర్ తెలిపారు. ఆర్బీఐ ఐర్డీఏ, పిఎస్‌ఆర్డీ వంటి జాతీయ స్థాయి సంస్థల బ్యాంక్‌లు,బీమా కంపెనీలు ఉమ్మడిగా శిబిరాలను నిర్వహిస్తున్నాయన్నారు. బీమ కంపెనీలు ఉమ్మడిగా శిబిరాలను నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. బ్యాంకుల్లో 10సంవత్సరాలుగా పైగా క్లెయిమ్ చేసుకోని డిపాజిట్లు ఉన్న పౌరులు, ఆర్బీఐ ఉద్గం వైబ్‌సెట్స్ ద్వారా సులభంగా వివరాలు సేకరించి ,తదుపరి చర్యలు తీసుకోవచ్చని సూచించారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఆస్తులు తనిఖీ చేసుకొని తగిన పత్రాలతో కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే శిబిరాంలో పాల్గొనాలని తెలిపారు.

**జిల్లా పరిషత్ భవన నిర్మాణ పనులు నాణ్యవంతంగా చేపట్టాలి :** వికారాబాద్ జిల్లా పరిషత్ భవన నిర్మాణ పనులను జిల్లా అదనపు కలెక్టర్ ,జెడ్పి సిఈఓ సుదీర్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పి సమవేశమందిరం, చైర్మన్, సిఇఒ చాంబర్ లతో పాటు వివిధ సదుపాయాల ఏర్పాట్లును కలెక్టర్ పరిశీలించారు. జెడ్పి ఆవరణలో ఆహ్లాదంగా ఉండేవిధంగా పచ్చదనం కలిగి ఉండేలా మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ తోపాటు పంచాయత్ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉమేష్‌కుమార్ పాల్గొన్నారు.

## లోక్‌అదాలత్ సద్వినియోగం చేసుకోండి : ఎస్ఐ రవీందర్‌నాయక్

**ప్రజాపక్షం/కొందుర్గు:** జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కొందుర్గు సిఐ రవీందర్ నాయక్ సూచించారు. ఈనెల 21వ తేదిన నిర్వహించనున్న జాతీయ లోక్ ఆదాలత్ కార్యక్రమంలో పిటిషనర్‌దారులు ఇరువైపులా సమ్మతితో సమస్యలను పరిష్కరించుకునేందుకు ఆవకాశం ఉందని అన్నారు. వివిధ రకాల కేసులతోపాటు సివిల్, క్రిమినల్, ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, డ్రంక్ ఆండ్ డ్రైవ్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, మోటార్ వాహనాల ఉల్లంఘన కేసులు, ఇరువర్గాల మధ్య జరిగిన కేసులు, ఆస్తి విభజన కేసు లాంటివి ఒప్పందాలతో పరిష్కరించుకోవాలని, అందుకు మెగా లోక్‌అదాలత్ మంచి అవకాశం కల్పించిందని, జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోర్టులో కేసులు ఎదుర్కొంటున్న కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కేసులు పరిష్కరించుకోవాలని ఆకాంక్షించారు.

## సిఎం విదేశీ విద్య పథకానికి దరఖాస్తు

### రంగారెడ్డి జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కోట్ల నవీన్‌కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలనుకొనే పేద మైనారిటీ విద్యార్థుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉపకార వేతనాన్ని పొందుటకు "ముఖ్యమంత్రి విదేశీ విద్యపథకం "ఫాల్ సీజన్ 2025కు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కోట్ల నవీన్ కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా లబ్ది పొందాలను కొనే విద్యార్థులు ఎంపిక చేయబడిన విదేశాలలోని యూనివర్సిటీలలో 1"జూలై 2025 నుంచి 31"డిసెంబర్ 2025 వరకు ప్రవేశం పొంది ఉండాలన్నారు. అర్హత గల వారు 20 డిసెంబర్ 2025 నుంచి19 జనవరి 2026 వరకు ఆన్ లైన్ ద్వారా www.telanganaepass.cgg.gov.in వెబ్ సైట్ లోదరఖాస్తు చేసుకోవాలన్నారు. పథకం వివరాలు, అర్హత, దరఖాస్తు చేసుకొనే దేశాలు, విద్యార్హతలు మొదలైన వివరా లు, ఎంపిక విధానం వెబ్ సైట్‌ను చూడవలసిందిగా మైనార్టీ సంక్షేమ అధికారి నవీన్ కుమార్ రెడ్డి తెలిపారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సహకారం

### ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/కేశంపేట:** గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు తనవంతుగా సహాయ సహకారాలు అంధిస్తానని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం షాద్‌నగర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో నూతన సర్పంచ్ బొజ్జల శ్రీశైలంతోపాటు వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని నూతన సర్పంచులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో పోమాల్‌పల్లి సర్పంచ్ భూపాల్‌రెడ్డి, నేతలు మంచు కృష్ణయ్య, దశరథ్, సతీష్, ప్రవీణ్‌రెడ్డి, నాగేష్, రామచంద్ర నాగేష్, విజయ్, శ్రీను, మహేష్, రాజునాయక్ పాల్గొన్నారు.

## అభివృద్ధికి అధికారులు సహకరించాలి



**ప్రజాపక్షం/కొత్తూరు:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధికారులు సహకరించేందుకు కృషి చేయాలని పెంజర్ల సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ కోరారు. శుక్రవారం కొత్తూరు సిఐ నర్సయ్య, ఎస్ఐ గోపాల కృష్ణ, తహశీల్దార్ రవీందర్ రెడ్డి, ఎంపిడిఒ అరుంధతి, ఎంపిఒ విజయలక్ష్మి, డిప్యూటి తహసీల్దార్ జంగయ్యలను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. గ్రామ పంచాయతీకి సర్పంచ్‌గా ఎన్నికైన ఎర్రోళ్ల జగన్‌ను అధికారులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లింగారం సురేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## చిలుక సొంత ఊర్లో కారు జోరు..

**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎంఎల్ఏ మాల్ రెడ్డి రంగారెడ్డికి అత్యంత సన్నిహితుడు.గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చేర్మెంన్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న చిలుక మధుసూదన్ రెడ్డి సొంత ఊర్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలవకపోవడం చర్చకు దారి తీస్తుంది. స్థానిక సంస్థల్లో వెల్లువడిన ఫలితాల్లో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్టు మండలంలోని అనాజ్ పూర్ గ్రామంలో మొత్తం ఓట్ల సంఖ్య 4968 గాను 3911 ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి యోర్పుల సుశీల దానయ్య ఫుడ్ బల్ గుర్తుకి 853 ఓట్లు వేసిన ఓటర్లు,బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి రాజపాక నవనీత మహేష్ పర్సు గుర్తుపై 1634 ఓట్ల వేసి భారీ మెజార్టీతో గెలిపించడం విశేషం.781 ఓట్ల భారీ మెజారిటీ తో అనాజ్ పూర్ గ్రామంలో కారు టాప్ గేర్లో ఉంది.అనాజ్ పూర్ గ్రామంలో ఎమ్మెల్యే మాల్ రెడ్డి రంగారెడ్డి ప్రచారం చేసిన ఉత్తదే అయిందని, ఇంత మంది నాయకులు రాత్రి పగలు ఊర్లో ప్రచారం చేసిన కనీసం సర్పంచ్ అభ్యర్థిని గెలిపిచుకోలేకపోయారు అని స్థానికులు చేర్చించుకుంటున్నారు.

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం



**ప్రజాపక్షం/కేశంపేట:** ప్రజల శ్రేయస్సు కోసం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. శుక్రవారం కేశంపేట మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో గోగు వెంకట్ నారాయణరెడ్డి, శశివర్ధన్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ ఉచిత వైద్య శిబిరానికి లేమామిడి గ్రామంతోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆమెరికా నుండి వచ్చిన గోగు వెంకట నారాయాణరెడ్డి కుటుంబ సభ్యులైన డాక్టర్ గోగు సుధీర్‌రెడ్డి, సుజన్‌రెడ్డి, శ్వేతారెడ్డిలు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వ్యాధులు రాకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 800మందికి వైద్య పరీక్షలు చేసి మందులను అంధించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సులోచన శ్రీను, మాజీ సర్పంచ్ శ్రీశైలం గౌడ్, ఉప సర్పంచ్ ప్రమోద్‌రెడ్డి, కేశంపేట మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నేతలు జగత్‌రెడ్డి, ధనంజయ, మన్మధరెడ్డి, శేఖర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, చాకలి రవి, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాలతో రోడ్డుకు ముప్పు



**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్:** అక్రమ కట్టడాలతో దాదాపు 30 పైగా కాలనీలకు కలుపుకొని ఉన్న 30 ఫీట్ల రోడ్డు ఆక్రమణకు గురవుతుందని మాజీ వైస్ చైర్మన్ సంపూర్ణ విజయశేఖర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ వద్దేపల్లి విద్యా విజేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ పెద్ద అంబర్‌పేట్ లోని సర్వే నంబర్ 103, 104, 105, 106, 107, 108/P, 110/పి, 111,158/P ,159/పి లలో జరుగుతున్న కొన్ని కొత్త నిర్మాణాలు మున్సిపల్ మరియు ప్లానింగ్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయి అని, తప్పనిసరిగా ఉండాల్సిన సెట్‌బ్యాక్‌లను పాటించకుండా నిర్మాణాలు చేయడం వల్ల 10 కాలనీలకు కలుపుతూ ఉన్నటువంటి 30ఫిట్ల రోడ్డు ఇబ్బందిగా మారుతోందన్నారు. శుక్రవారం పెద్ద అంబర్ పేట సర్కిల్, జీహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ రవిందర్ రెడ్డికి స్థానిక మాజీ వైస్ చైర్మన్ సంపూర్ణ విజయశేఖర్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ వద్దేపల్లి విద్యా విజేందర్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. సంబంధిత అధికారులను వెంటనే తనిఖీ చేసి, నిబంధనలను ఉల్లంఘిస్తున్న నిర్మాణాలపై చర్యలు తీసుకుని, ప్రభుత్వ నిబంధనలు కఠినంగా అమలు చేయాలని అభ్యర్థించారు.

## పెన్షన్ మంజూరు చర్యలు తీసుకోండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైకోర్టు రిటైర్డు జస్టిస్ జి.శ్రీదేవి 3 ఏళ్ల క్రితం రిటైర్డు అయినప్పటికీ పెన్షన్ మంజూరు చర్యలు ఎందుకు చేపట్టలేదని హైకోర్టు ప్రశ్నించింది. వెంటనే పెన్షన్ మంజూరు ప్రక్రియను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశించింది. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా 2022 అక్టోబర్లో జస్టిస్ శ్రీదేవి రిటైర్ అయ్యారు. అయితే, అధికారులు పెన్షన్ మంజూరు చర్యలు తీసుకోలేదంటూ వేసిన పిటిషన్ను జస్టిస్ శామ్ కోశి, జస్టిస్ చలపతిరావు డివిజన్ బెంచ్ విచారించింది. విచారణను వాయిదా వేసింది.

### సోమ, లేదా మంగళవారాల్లో జిహెచ్ఎంసి

# వార్డుల పునర్విభజన తుది నోటిఫికేషన్

### విస్తృతంగా అభ్యంతరాల పరిశీలన

### వార్డులకు తుది రూపు ఇస్తున్న టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి) వార్డుల పునర్విభజన తుది నోటిఫికేషన్ విడుదల చేసేందుకు యంత్రాంగం తలమునకలైంది. వార్డుల పునర్విభజనకు సంబంధించి మార్పులు, చెర్పులతో ప్రక్రియను పూర్తి చేసి సోమవారం ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. జిహెచ్ఎంసి పంపించిన నివేదికకు ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ వార్డుల పునర్విభజనకు తుది నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. సోమవారం లేదా మంగళవారం తుది నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని విశ్వసనీయంగా తెలిసింది. ఇక ఒకసారి తుది నోటిఫికేషన్ విడుదలైన పక్షంలో నూతన వార్డులు అధికారికంగా అమల్లోకి వస్తాయి. భవిష్యత్తులో ఈ వార్డులతోనే ఎన్నికలు నిర్వహించేందుకు ప్రక్రియ పరిసమాప్తం అయినట్లే. ఇక కేవలం రిజర్వేషన్‌ల ప్రక్రియను పూర్తయితే ఎప్పుడు అనుకుంటే అప్పుడు ఎన్నికలు నిర్వహించేందుకు సాధ్యమవుతోంది. వచ్చే ఫిబ్రవరి 10వ తేదీతో ప్రస్తుత పాలక మండలి పదవికాలం ముగిసిపోనున్న విషయం తెల్సిందే. అయితే ప్రస్తుత పాలకమండలి పదవికాలం ముగిసిన అనంతరమే వార్డుల రిజర్వేషన్‌ల ప్రక్రియ చేపట్టాలనే యోజనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. ఫిబ్రవరి 10వ తేదీ అనంతరమే జిహెచ్ఎంసి ఎన్నికల నిర్వహణ ప్రిక్రియ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని ఒక అధికారి చెప్పారు.




### ఉప్పెనలా అభ్యంతరాలు, సూచనలు..

అయితే వార్డుల పునర్విభజనపై అభ్యంతరాలు, సూచనలు ఉప్పెనలా వచ్చాయి. 5905 పైచిలుకు అభ్యంతరాలు, సూచనలను జిహెచ్ఎంసి యంత్రాంగం స్వీకరించింది. వార్డుల పునర్విభజన ప్రక్రియను జిహెచ్ఎంసి టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం మర్రిచెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి(ఎంసిహెచ్ఆర్‌డి)లో సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సిజిజి)లో కసరత్తు జరుపున్నారు. అభ్యంతరాలు, సూచనల స్వీకరణ మొదటి రోజు నుంచి టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం ఎప్పటి కప్పుడు పరిశీలన ప్రక్రియను చేపట్టింది. చీఫ్ సిటీప్లానర్ కె.శ్రీనివాస్ సారధ్యంలో ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్, సర్కిళ్లలోని టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది వార్డుల పునర్విభజన ప్రక్రియపై కసరత్తు జరుపుతున్నారు. ఇటు రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు అటు ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలు, సూచనలను పరిశీలన జరుపుతున్నారు. శుక్రవారంతో అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ పూర్తయినందున ఇకవార్డుల పునర్విభజనకు తుదిరూపం ఇచ్చేందుకు శ్రమిస్తున్నారు. శని, ఆదివారాల్లో ఈ వార్డుల పునర్విభజనకు సంబంధించిన మార్పులు, చేర్పులకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేసి, తుది నివేదికను ప్రభుత్వానికి నివేదించనున్నారు. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే జిహెచ్ఎంసి కమిషనర్ వార్డుల తుది నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.

### ముగిసిన అభ్యంతరాల స్వీకరణ గడువు

వార్డుల పునర్విభజనపై ముసాయిదా నోటిఫికేషన్‌పై ఏడు రోజుల పాటు అభ్యంతరాలు, సూచనలు స్వీకరించిన విషయం తెల్సిందే. అయితే కొంతమంది వార్డుల పునర్విభజనపై హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించిన పిటిషనర్ల నుంచి మరో రెండు రోజులు అభ్యంతరాలు, సూచనలు స్వీకరించాలని న్యాయ స్థానం ఆదేశించింది. ఈ గడువు కూడా శుక్రవారంతో ముగిసింది. ఇప్పటికే పాలకమండలి సర్వసభ్య సమావేశం నిర్వహించి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కార్పొరేటర్ల నుంచి సలహాలు, అభ్యంతరాలు స్వీకరించిన విషయం తెల్సిందే. ముసాయిదా నోటిఫికేసన్ వెలువడిన మరుసటి రోజు నుంచి జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్, సర్కిల్ కార్యాలయాల్లో అభ్యంతరాలు, సూచనలను యంత్రాంగం స్వీకరించింది.

### 300 వార్డుల వివరాలు కాదు..

### 2 వార్డులవే.. పబ్లిక్ డొమైన్లో పెట్టండి

### సింగిల్ ఆర్డర్ సవరించిన హైకోర్టు బెంచ్

జిహెచ్ఎంసి వార్డుల సంఖ్యను 150 నుంచి 300లకు పెంపుదలకు వెలువడిన ప్రాథమిక నోటిఫికేషన్ను సవాలు చేసిన కేసుల్లో సింగిల్ జడ్జి రెండు రోజుల క్రితం ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు డివిజన్ బెంచ్ మార్పు చేసింది. 300 వార్డుల జనాభా, వాటి మ్యాప్లను 24 గంటల్లోపు పబ్లిక్ డొమైన్లో ఉంచాలన సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవరించింది. సింగిల్ జడ్జి ఆర్డర్ను చీఫ్ సెక్రటరీ, జీహెచ్ఎంసీ కమిషనర్ సవాలు చేసిన అప్పీల్ పిటిషన్లను డివిజన్ బెంచ్ శుక్రవారం విచారించింది. సింగిల్ జడ్జి వద్ద పిటిషన్లు వేసిన రెండు వార్డులు (104, 134), జనాభా, మ్యాప్ల వివరాలను పబ్లిక్ డొమైన్లో పెట్టాలని ఆదేవించింది. ఆ తర్వాత ఆ రెండు వార్డులకు చెందిన పిటిషనర్లు అభ్యంతరాలు చెప్పడానికి 48 గంటల సమయం ఇవ్వాలని ఆదేశించింది. పిటిషన్లల్లోని అంశాల జోలికి వెళ్లడం లేదని స్పష్టం చేసింది. ఈ నెల 17న సింగిల్ జడ్జి 300 డివిజన్ల వివరాలు, జనాభా గణాంకాలు, మ్యాప్లను పబ్లిక్ డొమైన్లో అప్లోడ్ చేయాలంటూ వెలువరించిన మధ్యంతర ఉత్తర్వులను రెండు వార్డులకే పరిమితం చేస్తున్నట్లు ప్రకటించింది. సింగిల్ జడ్జి జారీ చేసిన మధ్యంతర ఆదేశాలను పాక్షికంగా సవరిస్తున్నట్లు వెల్లడించింది. మొత్తం 300 వార్డులకు సంబంధించిన వివరాలను పబ్లిక్ డొమైన్లో పెట్టాలనే ఉత్తర్వులను పక్కనపెట్టింది. హైకోర్టును ఆశ్రయించిన ఇద్దరు పిటిషనర్లకు సంబంధించిన 104, 134 వార్డుల వివరాలు, జనాభా, మ్యాప్లను పబ్లిక్ డొమైన్ ద్వారా బహిరంగపర్చాలని జీహెచ్ఎంసీ కమిషనర్కు ఆదేశాలను జారీ చేసింది.

## ప్రైవేట్ సెక్యూరిటీల వేతన సవరణ చేపట్టాలి

### మాజీ డిజిపి స్వరణ్‌జిత్ సేన్




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల వేతన సవరణ చేపట్టాలని అసోసియేషన్ ఆఫ్ ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీస్ (ఎపిఎస్ఎ) సలహాదారులు, మాజీ డిజిపి నోయెల్ స్వరణ్‌జిత్ సేన్ కోరారు. శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎపిఎస్ఎ చైర్మన్ సి.భాస్కర్‌రెడ్డి, అధ్యక్షులు బుద్ధ ఎఆర్, ప్రధానకార్యదర్శి సతీశ్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో తక్కువ వేతనాల వ్యత్యాసం వల్ల ప్రైవేట్ సెక్యూరిటీ పరిశ్రమపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. దీని ఫలితంగా రాష్ట్రంలో ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందికి తీవ్ర కొరత ఏర్పడుతుందన్నారు. కార్మిక భృతి ప్రకారం రాష్ట్రంలో నోటిఫై చేయబడిన వేతనాలు కేంద్రం నోటిఫై చేసిన కనీస వేతనాలకు సమానంగా లేదా అంతకంటే ఎక్కువ ఉండేలా చూడాలని కోరారు. ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల నియంత్రణచట్టం అమలు చేయాలన్నారు. ఎపిఎస్ఎ చైర్మన్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ 44 ఏళ్లు పూర్తి చేసుకొన్న సందర్భంగా నగరంలోని ఎంసిఆర్‌హెచ్ఆర్‌డిలో సమ్మిట్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో ఎపిఎస్ఎ ఉపాధ్యక్షులు ఎన్.రవీందర్, వెంకటనరసింహారావు, జాయింట్ సెక్రటరీలు రవి శంకర్ యెలం, రాధిక తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీల అభివృద్ధి బాధ్యత ప్రభుత్వానిదే

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/కేశంపేట:** గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, ప్రతి కార్యకర్తకు సమన్యాయం చేయడంతో పాటు కన్న తల్లిలాగా చూసుకుంటుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం కేశంపేట సర్పంచ్ బోజ్జం శ్రీశైలంతోపాటు ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. దాంతో శాలువాలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తుందని వివరించారు. పల్లె సీమలను ప్రగతి సీమలుగా మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇప్పటికే పల్లెల్లో అనేక పనులు చేపట్టామని, మున్ముందు మరెన్నో పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజలందరు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో ఎన్నికల సమయంలోనే రాజకీయాలు ఉండాలని, తరువాత అందరు కలిసి ఐక్యంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన ప్రజా ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. పంచాయతీల పటిష్టతను పెంచడంతోపాటు గ్రామ స్వరాజ్యానికి పాటుపడే విధంగా ఉంటాయని పేర్కొన్నారు.

## మెడికల్ వేస్ట్ వేస్తున్న ఆసుపత్రులకు నోటీసులు..

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** శంకర్ పల్లి పట్టణంలోని ఆసుపత్రులకు,ల్యాబ్ సెంటర్ యాజమాన్యాలకు మున్సిపల్ అధికారులు శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ల్యాబ్ ఆసుపత్రుల వేస్టులను సంబంధిత బయో మెడికల్ ఏజెన్సీల వారికి అందజేయకుండా డంపింగ్ యార్డులో పారవేస్తున్నారన్నారు.అందుకోసం శుక్రవారం పట్టణంలోని అన్ని ఆసుపత్రులకు, క్లినిక్, ల్యాబ్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు.

## అసంపూర్తి పనులకు పూర్తి బిల్లులు

### చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** మున్సిపాలిటీ ఆదాయానికి స్థానిక నాయకులు, ఎమ్మెల్యే కాలే యాదయ్య గండి కొడుతున్నారని మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం ఆరోపించారు. శుక్రవారం మునిసిపాలిటీ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రత్నం మాట్లాడుతూ ఫతేపురం వంతెన నుంచి తీగల వాగు వరకు పనులు, శంకర్‌పల్లి రైల్వే స్టేషన్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు రహదారి విస్తరణ పనులు పూర్తిచేసినట్లుగా బిల్లులు తీసుకున్నారని ఆరోపించారు.

## ఆటలతో సీనియర్ సిటిజన్స్‌కు మానసికోల్లాసం

### 18నుంచి క్యారమ్స్ టోర్నమెంట్

### ఆదర్శ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హయత్‌నగర్ సర్కిల్ సెక్రెటరీ హరినాథ్‌బాబు వెల్లడి



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** ఆటలతో సీనియర్ సిటిజన్స్‌కు మానసికోల్లాసం కలుగుతుందని ఆదర్శ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హయత్ నగర్ సర్కిల్ సెక్రెటరీ హరినాథ్ బాబు పేర్కొన్నారు. ఆదర్శ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ, అమెరికా తెలుగు సంఘం సహకారంతో మల్లికార్జున నగర్ కాలనీ నార్త్ కమ్యూనిటీ హాల్(ఎల్‌బి.నగర్)లో ఫస్ట్ తెలంగాణ ఓపెన్ క్యారమ్స్ టోర్నమెంట్‌ను స్టేట్ సీనియర్ సిటిజన్స్ కొరకు ఈ నెల 18,19,20 తేదీలలో నిర్వహిస్తున్నట్లు ఆదర్శ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హయత్‌నగర్ సర్కిల్ సెక్రెటరీ హరినాథ్‌బాబు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి దాదాపు 60 సీనియర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ల నుండి, వ్యక్తిగతంగా సీనియర్ సిటిజెన్స్ డబుల్ టీములు 60వరకు, సింగల్ టీములు 112 వరకు టోర్నమెంట్‌లో 250కు పైగా పాల్గొంటున్నారు. గురువారం వరకు మొత్తం సింగల్‌టీంలు పాల్గొనగా, శుక్రవారం డబుల్ టీంలు పాల్గొంటున్నాయని వివరించారు. ఫైనల్‌కు చేరుకున్న వారితో శనివారం పోటీలు నిర్వహించి గెలుపొందిన టీములకు బహుమతులు అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఈవెంట్స్‌లో 60 నుండి 85 సంవత్సరాల వయస్సుగల సీనియర్ సిటిజన్స్ ఉత్సాహంగా పాల్గొంటున్నారు. మూడు రోజుల కార్యక్రమంలో పాల్గొని వారికి భోజన వసతి ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు చింతారెడ్డి కృష్ణారెడ్డి, సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు రామ్‌రెడ్డి, సత్యనారాయణరావు, విశ్వేశ్వరరావు, రామచంద్రారెడ్డి, ప్రవీణ్ కుమార్, కృపాకర్ రెడ్డి, టిటిఏ సంఘం అధ్యక్షుడు మలిపెద్ది నవీన్‌రెడ్డి, మోహన్ పటోళ్ల, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## 'దేశీ పత్తి'తో వస్త్ర ఉత్పత్తుల ప్రదర్శన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'దేశీ పత్తి'ని ఉపయోగించిన ఖద్దర్ వస్త్రాలు, సహజ రంగాలను వాడి తయారు చేసిన 'వస్త్ర ఉత్పత్తుల ప్రదర్శన' శుక్రవారం ప్రారంభమైంది. ఇండియా హ్యాండ్ మేడ్ కలెక్టివ్ (ఐహెచ్ఎంసి) ఆధ్వర్యంలో హైదరాబాద్, బంజారాహిల్స్‌లోని సిసిటి స్పేస్ భవనంలో ఏర్పాటు చేసిన వస్త్ర ప్రదర్శనను సర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్, సహజ రంగుల వస్త్ర నిపుణులు జగదా రాజప్ప, రిటైర్డ్ ఐఎఎస్ టి.విజయ్‌కుమార్, విద్యావేత్త , నటి గీత భాస్కర్ ప్రారంభించారు. ఈ ప్రదర్శన శుక్రవారం, శనివారం రెండు రోజుల పాటు ఉంటుంది. కాగా ప్రదర్శనలో నేచర్ అలీ, తులా, ఎమ్జీజీఎస్ఎస్ ఫౌండేషన్, టింక్టోరియా, సహజాల్లిక ప్రాజెక్ట్, మోరల్ ఫైబర్, గాంధీగ్రామ్ ఖాదీ, వావిలాల్‌ఖాదీ, పొర్గై, గ్రామసేవ మండల్,ఖలంబాటిక్ ఉత్పత్తులు ఉన్నాయి.

## ఉద్యోగుల అంకితభావంతోనే వ్యవస్థాపక ప్యానెల్ విజయం'

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :**ఉద్యోగుల అంకితభావంతోనే మహేశ్ బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు ఎన్నికల్లో వ్యవస్థాపక ప్యానెల్ టీమ్ భారీ మెజార్టీతో విజయం సాధించిందని తెలంగాణ అగర్వాల్ సమాజ్ అధ్యక్షులు అనిరుధ్ అగర్వాల్ అన్నారు., శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లకు ఘనస్వాగతం పలికారు. ప్యానెల్ కన్వీనర్ రమేశ్ కుమార్ బంగ్ మాట్లాడుతూ ఈ విజయం ఓటర్లు, మాజీ డైరెక్టర్లు, వాటాదారులు, రాజస్థానీ సమాజం తమపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమన్నారు. ఉద్యోగుల నిస్వార్థ సేవ కారణంగా గత 15 ఏళ్లలో బ్యాంక్ వ్యాపారం 9 రెట్లు పెరిగి రూ.4,450 కోట్లకు చేరుకుందన్నారు. కార్యక్రమంలో లక్ష్మీ నారాయణ, అమితాబ్ లడ్డా, మురళీమనోహర్, గోవింద్, వినోద్‌కుమార్ బంగ్ తదితరులు పాల్గొన్నారు.

## చిత్రపురిలో సభ్యత్వాలు తీసేయటం తప్పు : హైకోర్ట్ తీర్పు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సొసైటీ అవినీతిపై ప్రశ్నించిన సభ్యుల సభ్యత్వాలు తీసేస్తూ చిత్రపురి కమిటీ తీసుకున్న నిర్ణయం తప్పు అని, రాబోయే నాలుగు వారాలలో వారి పేర్లు తిరిగి ఓటర్ జాబితాలో పెట్టాలని తెలంగాణ కో ఆప్ సొసైటీస్ రిజిస్ట్రారర్‌కు హైకోర్ట్ ఆదేశాలు జారీ చేసింది. చిత్రపురి కమిటీ మాజీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్ తన అక్రమాలను భవిష్యత్‌లో కూడా కొనసాగించుకునేందుకు అనుకూలంగా చేసుకునేందుకు అవినీతిపై ప్రశ్నిస్తున్న కస్తూరి శ్రీనివాస్, మద్దినేని రమేష్, జాస్తి రవీంద్రనాథ్ ఠాగూర్, గాయత్రి సభ్యత్వాలను తొలగించాలని చివరి సర్వసభ్య సమావేశంలో అక్రమంగా తీర్మానం పెట్టాడు. సమావేశానికి కోరం లేదు, ఎజెండాలో పేర్లు లేవు, 2/3 శాతం సభ్యులు లేరు, ఎజెండా నెంబర్ 6 పై హై కోర్ట్ వాయిదా ఉన్నా కూడా ఏకపక్షంగా వీరిని తీసేస్తూ తీర్మానం చేయటంతో బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. అందరి సభ్యత్వాలు తిరిగి ఓటర్స్ లిస్ట్ లో పెట్టమని కోర్టు ఆదేశాలతో చిత్రపురి సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## హెరాయిన్ పట్టివేత..



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజస్థాన్‌లో తయారైన హెరాయిన్‌ను హైదరాబాద్‌లో విక్రయిస్తున్న ఓ ముఠా గుట్టును ఎక్సైజ్ పోలీసులు రట్టు చేశారు. ఇందుకు సబంధించిన వివరాలను టిడిఎఫ్ సిఐ సౌజన్య తెలిపారు. దినేష్ లోదా అనే వ్యక్తి హైదరాబాదులో రాజస్థానీ కుటుంబీకులకు వంటలు చేస్తూ జీవనోపాధి సాగిస్తున్నాడు.ఇతను రాజస్థాన్ నుంచి హెరాయిన్‌ను తీసుకువచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు డిటిఎఫ్ అధికారులు శుక్రవారం బేగం బజార్లో అమ్మకాలు జరుపుతుండగా నిందితుడితో పాటు హెరయిన్ స్వాధీనం చేసుకొని బేగంపేట్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు తెలిపారు. నూతన సంవత్సరం రాబోతున్న సందర్బంగా డ్రగ్స్, గంజాయి, ఎన్ డి పి ఎల్ మద్యం రాకుండా మరిన్ని దాడులు చేపట్టాలని హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ అనిల్ కుమార్ రెడ్డి డి టి ఎఫ్, అండ్ ఫోర్స్ మెంట్ విభాగాలనుకు ఆదేశించారు. డిటిఎఫ్ ఎన్ఫోర్స్మెంట్ డ్రగ్స్ పట్టుకోవడం పట్ల ఎఎస్ శ్రీనివాసరావు అభినందించారు.

# క్రీడ

## సెలెక్టర్లకు సవాల్ విసురుతున్న ఇషాన్..
# గిల్‌పై వేటు పడేనా?




వచ్చే టీ20 ప్రపంచకప్ కోసం భారత స్క్వాడ్ ఎంపిక ఆసక్తి రేపుతోంది. ప్రపంచకప్ బృందంలో ఎవరు ఉంటారు? ఎవరిపై వేటు పడనుంది? అని చర్చ జోరుగా సాగుతోంది. ముఖ్యంగా.. ఫామ్‌లో లేని శుభ్‌మన్ గిల్‌ను తప్పించాలనే డిమాండ్లు వినిపిస్తున్న వేళ నేనున్నానని భరోసానిస్తున్నాడు ఇషాన్ కిషన్. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ఫైనల్లో 45 బంతుల్లోనే సెంచరీతో గర్జించిన ఈ చిచ్చరపిడుగు.. ప్రపంచకప్ స్క్వాడ్‌కు గట్టిపోటీ ఇస్తున్నాడు. దాంతో.. గిల్‌ను పక్కన పెట్టేసి ఇషాన్‌కు అవకాశమిస్తారా? అనేది ఇప్పుడు అభిమానులందరి మెదళ్లలో తిరుగుతున్న ప్రశ్న. ఇంగ్లండ్ పర్యటనతో టెస్టు కెప్టెన్సీ, ఆస్ట్రేలియా సిరీస్‌తో వన్డే పగ్గాలు చేపట్టిన శుభ్‌మన్ గిల్ టీ20ల్లో మాత్రం తేలిపోతున్నాడు. వరల్డ్ కప్ సన్నద్ధతలో ఒకటైన దక్షిణాఫ్రికాపై మూడు మ్యాచుల్లోనూ (4, 0, 28 పరుగులు) గిల్ దారుణంగా విఫలమయ్యాడు. సంజూ శాంసన్‌ను బెంచ్ మీద కూర్చోబెట్టి.. వరుసగా అవకాశాలిచ్చినా సద్వినియోగం చేసుకోలేదు. దాంతో చివరి రెండు మ్యాచ్‌లకు గిల్‌ను తప్పిస్తారనే వార్తలు వినిపించాయి. అయితే.. పాదం గాయంతో గిల్ చివరి రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. వరల్డ్‌కప్ సమీపిస్తున్నందున అతడి బదులు మరొకరిని తీసుకోవడం మంచిదని మాజీలు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఇషాన్ కిషన్ తన విధ్వంసక ఆటతో సెలెక్టర్లకు సవాల్ విసురుతున్నాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో వీరకొట్టుడు కొట్టిన ఇషాన్.. గురువారం ఫైనల్లో రెచ్చిపోయి 45 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. టీ20 ఫార్మాట్లో జరిగిన ఈ టోర్నీలో 517 రన్స్ బాదిన ఈ లెఫ్ట్ హ్యాండర్ నేను అసలైన టీ20 క్రికెటర్ అని చాటుకున్నాడు. గిల్ విఫలమైతున్న వేళ.. ప్రపంచకప్ కోసం నా పేరును కూడా పరిశీలించాలని సెలెక్టర్లకు చెప్పకనే చెప్పాడీ కుర్ర హిట్టర్.

**సూర్య కూడా అంతే..!**

పొట్టి క్రికెట్‌లో మిస్టర్ 360గా పేరొందిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సైతం గొప్పగా ఆడడం లేదు. సఫారీలపై మూడు మ్యాచుల్లో 12, 5, 12 పరుగులతో అందర్నీ షాక్‌కు గురి చేశాడు సూర్య. స్వదేశంలో ప్రపంచకప్ జరుగనున్నందున కీలక ఆటగాళ్లైన గిల్, సూర్య ఫామ్ అందుకోకపోవడం మేనేజ్‌మెంట్, అభిమానులను కలవరపరుస్తోంది.

# టీమిండియా ఘన విజయం

నిరుడు టీ20 ప్రపంచ కప్ నుంచి భారత జట్టు అన్‌స్టాపబుల్‌గా దూసుకెళ్తోంది. ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనలో సిరీస్ పట్టేసిన టీమిండియా ఈసారి 30 పరుగులతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. శుక్రవారం అహ్మదాబాద్‌లో హార్దిక్ పాండ్యా(63), తిలక్ వర్మ(73)లు మెరుపు హాఫ్ సెంచరీలతో భారీ స్కోర్ అందించగా.. బంతితో వరుణ్ చక్రవర్తి(4 53), బుమ్రా(217)లు రెచ్చిపోయారు. అంతే.. ఒత్తిడికి లోనైన సఫారీ టీమ్ ఓటమిపాలైంది. టెస్ట్ సిరీస్ కోల్పోయినా వన్డే, పొట్టి ట్రోఫీలు హస్తగతం చేసుకొని ఫ్యాన్సును ఖుషీ చేసింది భారత్. పొట్టి సిరీస్‌లో ప్రత్యర్థి ఎవరైనా విజయం మాదే అన్నట్టుగా భారత్ జోరు కొనసాగుతోంది. ఇప్పటికే వరుసగా 6 ట్రోఫీలు గెలుచుకున్న టీమిండియా స్వదేశంలో దక్షిణాఫ్రికాను ఓడించి సిరీస్ పట్టేసింది. టీమిండియా నిర్దేశించిన 232 పరుగుల భారీ ఛేదనలో దక్షిణాఫ్రికా ఇన్నింగ్సును దూకుడుగా ఆరంభించింది. ఓపెనర్ క్వింటన్ డికాక్(65) సిక్సర్లు, ఫోర్లతో హోరెత్తించాడు. దాంతో.. స్కోర్ బోర్డు పరుగులు తీసింది. డికాక్ విధ్వంసంతో పవర్ ప్లేలో వికెట్ కోల్పోకుండా 67 రన్స్ చేసింది. తర్వాత బంతి అందుకున్న వరుణ్ చక్రవర్తి మొదటి ఓవర్లోనే రీజా హెండ్రిక్స్ (13)ను ఔట్ చేసి బ్రేకిచ్చాడు. డెవాల్ బ్రెవిస్(31) జతగా దంచేస్తున్న డికాక్‌ను బుమ్రా రిటర్న్ క్యాచ్‌తో వెనక్కి పంపాడు. 13వ ఓవర్లో చక్రవర్తి వరుస బంతుల్లో ఎడెన్ మర్కమ్(6)ను ఎల్బీగా.. డొనొవాన్ ఫెరీరా(0)ను బౌల్ చేసి మ్యాచ్ను టీమిండియావైపు తిప్పాడు. ఆ తర్వాత పాండ్యా ఓవర్లో 6, 4 బాదిన డేవిడ్ మిల్లర్(18)ను అర్షదీప్ బోల్తా కొట్టించాడు. చివరి ఓవర్లో లిండే(16)ను ఔట్ చేసి సఫారీలను ఒత్తిడిలో పడేశాడు. కానీ, మార్కో యాన్సన్(14) వరుసగా రెండు సిక్సర్లతో స్కోర్ 170 దాటింది. బుమ్రా ఓవర్లో రివ్యూతో యాన్సెన్ వెనుదిరగగా



పర్యాటక జట్టు ఓటమి ఖాయమైంది.

**పాండ్యా, తిలక్ సునామీ ఇన్నింగ్స్**

టీ20 వరల్డ్‌కప్ సన్నాహక సిరీస్‌తో పునరాగమనం చేసిన హార్దిక్ పాండ్యా(63: 25 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లు) అహ్మదాబాద్‌లో చితక్కొట్టాడు. తన పవర్ హిట్టింగ్‌తో దక్షిణాఫ్రికా బౌలర్లను బెంబేలెత్తించిన పాండ్యా జట్టుకు భారీ స్కోర్ అందించాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఓపెనర్లు సంజూ శాంసన్ (37), అభిషేక్ శర్మ(34)లు శుభారంభమివ్వగా.. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(5) ఎప్పటిలానే విఫలమయ్యాడు. సూర్య ఔటయ్యే సరికి స్కోర్ 1153. ఆ దశలో క్రీజులోకి వచ్చిన పాండ్యా ఆలస్యం చేయకుండా ఉతుకుడే పనిగా పెట్టుకున్నాడు. లిండే, కార్బిన్ బాష్ ఓవర్లలో బౌండరీలతో రెచ్చిపోయిన అందుకున్నాడు. ఆ తర్వాత కూడా తనదైన విధ్వంసక ఆటతో స్కోర్‌బోర్డును పరుగులు పెట్టించాడు. పాండ్యాకు జతగా తిలక్ వర్మ(73: 42 బంతుల్లో 10 ఫోర్లు, సిక్సర్) స్వీప్ షాట్లతో హోరెత్తించి అర్ధ శతకం బాదాడు. వీరిద్దరూ పోటీపడుతూ బౌండరీలు బాదేయగా సఫారీ బౌలర్లు నీరుగారిపోయారు. పాండ్యా, తిలక్ మెరుపులతలో 17 ఓవర్లకే స్కోర్ 200 దాటింది. చివరి మూడు ఓవర్లలో 31 రన్స్ రాగా.. సఫారీలకు 232 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది టీమిండియా.

# ఫోకస్ సైన్స్

## శబ్దవేగాన్ని మించిన జెట్ స్ట్రీమ్ గాలులు!



శాస్త్రవేత్తలు ఇటీవల కనుగొన్న గ్రహంపై శబ్ద వేగాన్ని మించిన జెట్ స్ట్రీమ్ గాలులు ఉన్నట్టు గుర్తించారు. 'డబ్ల్యుఎఎస్‌పి 127బి'గా పిలిచే ఈ గ్రహం మన సౌర కుటుంబానికి బయట ఉన్న ఎక్సోప్లానెట్ (ఎక్స్ట్రా సోలార్ ప్లానెట్ లేదా మన సౌర కుటుంబం వెలుపల ఉన్న గ్రహం), భూమి నుంచి సుమారు 520 కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. శాస్త్రవేత్తలు ఈ గ్రహంలో శబ్ద వేగాన్ని మించిన గాలులు గుర్తించారు. తాజా నివేదికను అనుసరించి, ఈ గాలులు కేవలం కొన్ని గంటల్లోనే గ్రహం చుట్టూ ఒక భ్రమణాన్ని పూర్తి చేస్తున్నట్టు చెప్తున్నారు. అయితే, సహజవాయుతో నిండిన ఈ గ్రహం భూమి మాదిరి జీవానికి అనుకూలమైనని కాదు. ఇప్పటి వరకూ మరే ఇతర ఎక్సోప్లానెట్‌పైనా ఇంత వేగమైన, స్థిరమైన జెట్ స్ట్రీమ్ గాలులను శాస్త్రవేత్తలు గమనించలేదు. అందుకే డబ్ల్యుఎఎస్‌పి 127బి అంతరిక్ష పరిశోధనలో ఒక అరుదైన, ఆసక్తికరమైన ఆవిష్కరణగా నిలుస్తున్నది. ఈ గ్రహంపై ఉన్న జెట్ స్ట్రీమ్ గాలులు కొంత భిన్నంగా ఉన్నాయి. భూమిపై కూడా జెట్ స్ట్రీమ్‌లు ఉంటాయి, కానీ అవి విమానాల వేగం కన్నా కొంచెం ఎక్కువ వేగంతో కదులుతాయి. కానీ ఈ గ్రహంలో మాత్రం గాలుల వేగం శబ్ద వేగం (సుమారు 1,235 కి.మీ/గం) కంటే చాలా ఎక్కువగా ఉంది. ఇది భూమిలాంటిది కాదని, దీనిపై అత్యధిక మోతాదులో వాయువు ఉంటుంది కాబట్టి, దీనిని 'గ్యాస్ జెయింట్'గా పేర్కోవచ్చని శాస్త్రవేత్తలు అంటున్నారు. అక్కడ తీవ్ర ఉష్ణోగ్రతలు, బలమైన వాతావరణ తుఫాన్లు ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. గ్రహాల వాతావరణం ఎలా పనిచేస్తుందో అర్థం చేసుకోవడానికి ఈ కొత్త ఆవిష్కరణ ఉపయోగపడుతుంది. భూమికి బయట ఉన్న గ్రహాల్లో వాతావరణ పరిస్థితులు ఎంత తీవ్రమై ఉంటాయో ఇది చూపిస్తుంది. భవిష్యత్తులో జీవం ఉండే అవకాశాలపై పరిశోధనలకు ఇది దోహదపడుతుంది.



## పర్యావరణ పరిరక్షణలో శాస్త్ర విజ్ఞానం

పెరుగుతున్న సాంకేతిక ఒకవైపు అనూహ్యమైన పర్యావరణ మార్పులకు కారణమవుతుండగా, మరోవైపు పర్యావరణ పరిరక్షణకు శాస్త్రవేత్తలు నిరంతర పరిశోధనలు, అన్వేషనలు కొనసాగిస్తున్నారు. అందుకే, ఇప్పుడు వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో శాస్త్ర విజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోంది. ఈ రంగంలో ఇటీవలి ప్రయోగాలు మన భవిష్యత్తును రక్షించేవిగానూ, ఆశాజనకంగానూ ఉన్నాయి. 'కార్బన్ క్యాప్చర్' పురోగతి సాధిస్తున్నారు. వాతావరణంలోకి వెళ్లే కార్బన్ డయాక్సైడ్ ($CO_2$)ను ముందే ఒడిసిపట్టి తొలగించే సాంకేతికతను కార్బన్ క్యాప్చర్ అంటున్నారు. కొత్తగా అభివృద్ధి చేసిన కొన్ని పరికరాలు, పదార్థాలు కార్బన్ డయాక్సైడ్‌ను అత్యంత వేగంగా, ఎక్కువ పరిమాణంలో స్వీకరిస్తున్నాయి. తక్కువ ఖర్చుతో ఇవి పరిశ్రమల పొగ గొట్టాల దగ్గర నుంచే కర్బనాన్ని స్వీకరించి, గాలి నుంచి దానిని తొలగిస్తున్నాయి. ఫ్యాక్టరీలు, పవర్ ప్లాంట్లు, సిమెంటు స్టీల్ తదితర పరిశ్రమలకు దీనివల్ల గ్లోబల్ వార్మింగ్‌కు కారణమైన వాయువులు గణనీయంగా తగ్గుతాయి. కాగా, మరో పరిశోధనా ఫలితంగా శుభ్రమైన శక్తి నిల్వ ఇప్పుడు సాధ్యమవుతున్నది. పునరుత్పాదక శక్తి (సూర్య, గాలి) వినియోగానికి శక్తి నిల్వ వ్యవస్థలు అత్యంత అవసరం. కొత్త బ్యాటరీలు, సాలిడ్‌స్టేట్ బ్యాటరీలలో ఈ కొత్త పరిశోధన ఉపయోపడుతుంది. ద్రవ ఎలక్ట్రోలైట్ లేకుండా ఘన పదార్థాన్ని వాడడంతో అగ్నిప్రమాద అవకాశాలు చాలా తక్కువ. తక్కువ ఖర్చు తో, ఎక్కువ శక్తిని, దీర్ఘకాలం లేదా జీవితకాలం నిల్వ చేయవచ్చు. మిథియం కంటే చౌకగా లభించే సోడియంతో తయారుచేస్తున్న సోడియంఆయాన్ బ్యాటరీలు అందుబాటులోకి వస్తున్నాయి. వీటి ధర చాలా తక్కువ. ఇవి పర్యావరణానికి ఎంతో అనుకూలం.

## భారీగా పెరుగుతున్న సముద్ర మట్టాలు



గత 4,000 సంవత్సరాలలో ఎప్పుడూ లేనంత వేగంగా భూమి సముద్ర మట్టాలు ఇప్పుడు వేగంగా పెరుగుతున్నాయి. ఈ విషయాన్ని ఉపగ్రహాల పరిశీలనలు గుర్తించాయి. దీనిని ఒక స్పష్టమైన వాతావరణ అత్యవసర పరిస్థితిగా శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. భూమి వేడెక్కడమే ఇందుకు ప్రధాన కారణం. పరిశ్రమలు, వాహనాలు, అడవుల నాశనం వల్ల గ్రీన్‌హౌస్ వాయువులు పెరుగుతున్నాయి. హిమనదాలు కరుగుతున్నాయి. ధ్రువ ప్రాంతాల్లోని మంచు కొండలు కరిగి సముద్రాల్లోకి చేరుతున్నాయి. గ్లోబల్ వార్మింగ్ కారణంగా నీరు కూడా వేడెక్కుతుంది. వెడెక్కిన నీటికి విస్తరించే గుణం ఉంది. అందువల్ల సముద్ర మట్టం పెరుగుతోంది. గతంతో పోలిస్తే ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక సాంకేతికను వినియోగించుకొని, ఉపగ్రహాల ద్వారా సముద్ర మట్టాన్ని చాలా ఖచ్చితంగా కొలుస్తున్నారు. గత వేల ఏళ్లతో పోలిస్తే ఇప్పటి పెరుగుదల అసాధారణంగా వేగం కనిపిస్తున్నది. ఈ మార్పు వల్ల తీర ప్రాంతాలు మునిగిపోవడం, చిన్న దీవులు అంతరించిపోవడం, వరదలు, తుఫాన్లు పెరగడం, తాగునీటి కొరత, లక్షలాది మంది జీవనోపాధికి ముప్పు వంటి సమస్యలు తప్పకపోవచ్చు. భవిష్యత్తులో జరిగే పరిణామాలు అనుకుంటూ లేదా సైన్స్ మాత్రమే సమాధానం వెతకాలని పొరబడుతూ కూర్చుకుంటే ప్రమాదం తప్పదు. ఇది ఇప్పుడు ముంచుకొస్తున్న సంక్షోభం. పర్యవసానాలను ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో చూస్తున్నాం. మనం ఇప్పుడే చర్యలు తీసుకోకపోతే, భూమి సమతుల్యత తీవ్రమైన ప్రమాదంలో పడుతుంది. కాబట్టి, భూమిని కాపాడటం మన అందరి బాధ్యత.

## ఘనంగా 'సింగరేణి డే' వేడుకలు

### ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ డిమాండ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి ఆవిర్భావ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ కోరారు. శుక్రవారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన ఎఐటియుసి సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో గత ఇరవై సంవత్సరాలుగా డిసెంబర్ 23న ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించే ఆవిర్భావ దినోత్సవ వేడుకలను, కుదించే విధంగా నిధులు విడుదల చేస్తూ యాజమాన్యం ఆదేశాలు జారీ చేసిందని, దీన్ని గుర్తింపు సంఘం ఎఐటియుసి తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. సింగరేణి ఆవిర్భావ దినోత్సవం రోజున జరిగే వేడుకల్లో కార్మికులు మరియు వారి కుటుంబాలు ఆనందంగా పాల్గొంటారని, వేడుకలను కుదించే విధంగా నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. యాజమాన్యం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 23న జరిగే వేడుకలకు అధికంగా నిధులు విడుదల చేసి ఘనంగా జరపాలని ఆయన డిమాండ్ చేశారు, లేకుంటే గుర్తింపు సంఘం ఎఐటియుసి ఈ వేడుకలను బహిష్కరిస్తుందని ఆయన తెలిపారు. సమావేశంలో ఎఐటియుసి ఉప ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, నాయకులు కన్నం లక్ష్మి నారాయణ, బుర్ర భాస్కర్, ఆకుల సురేష్, పడాల కనకరాజు, జనగామ జగదీశ్వర్, సిరిసిల్ల మల్లేష్, తాని రాజబాబు, తొడుపునూరి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ మ్యూజియం ప్రారంభించాలి

### ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సైన్స్ మ్యూజియంను తక్షణమే ప్రారంభించాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎఐఎస్ఎఫ్ సమావేశం జరిగింది. సమావేశంలో ఇటికాల రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ పాత డిఇఒ కార్యాలయంలోనే సర్వశిక్షాభియాన్ గదులను సైన్స్ మ్యూజియంకు కేటాయించి ఏడాదైనా ప్రారంభోత్సవానికి ఇప్పటి వరకు నోచుకోలేదన్నారు. సైన్స్ మ్యూజియం ఏర్పాటు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసి దాతల సహకారంతో రూ.1.50 కోట్ల విరాళాలు సేకరించి సైన్స్ పరికరాలను కొనుగోలు చేశారని ఆయన తెలిపారు. ఎంతో విలువైన ఫిజిక్స్, బయాలజీ, సైన్స్ పరికరాలను కొనుగోలు చేసి సైన్స్ మ్యూజియంలో ఉంచారన్నారు. ఏడాది కాలంగా ఈ మ్యూజియంను ప్రారంభించకుండా గదులకు తాళాలు వేశారని ఆరోపించారు. అధికారులు మారుతున్నారే తప్ప సైన్స్ మ్యూజియం ప్రారంభించడంలో చొరవ చూపడం లేదన్నారు. ఇప్పటికైనా సైన్స్ మ్యూజియంను ప్రారంభించి విద్యార్థులు తిలకించే విధంగా సిద్ధం చేయాలన్నారు. సైన్స్ మ్యూజియం, ప్లాంటోరియం కోసం ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించి ప్రయోగాత్మక పద్ధతిలో సైన్స్ పరిజ్ఞానం వికసిల్లేలా ప్రత్యేక భవన సముదాయాన్ని నిర్మించాలని ఎఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి కోరుతుందన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ నాగులమీరా, జిల్లా నాయకులు గోపి, పవన్, యుగంధర్, నరేష్, వెంకట్ పాల్గొన్నారు.

# 'ఉపాధి' పథకం రద్దుకు బిజెపి కుట్ర

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/జనగామ :** కమ్యూనిస్టుల సహకారంతో యుపిఎ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి కోట్లాది మంది కూలీల పొట్టగొట్టేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు మండిపడ్డారు. డిసెంబర్ 26తో సిపిఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా గ్రామ గ్రామాన శత వార్షికోత్సవాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సిపిఐ జనగామ జిల్లా విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశం శుక్రవారం జనగామలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్‌లో బోనగిరి కుమారస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి తక్కెలపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. ఉపాధి హామీ పథకం చారిత్రాత్మకమైందని, కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే ఈ చట్టం వచ్చిందన్నారు. బిజెపి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే గాంధీ పేరును తొలగించాలని చూస్తుందన్నారు. చట్టం మార్పు గాంధీజీ పట్ల ఆ పార్టీకి ఉన్న గౌరవాన్ని బహిర్గతం చేస్తుందని, ఇది లోతైన ఫాసిస్టు సైద్ధాంతిక చర్యగా చెప్పవచ్చునన్నారు. బిజెపి దాని సైద్ధాంతిక మార్గదర్శకాలు చెప్పాలంటే నిజంగా గాడ్సే యొక్క నిజమైన శిష్యులని చెప్పవచ్చునన్నారు. బిజెపి తీసుకొచ్చిన ఈ నూతన చట్టం వలన ఇది ప్రస్పుటం అవుతుందన్నారు. వంద రోజుల పని కల్పించాలని ఈ చట్టంలో ఉందని, ప్రభుత్వం ఈ చట్టానిక తూట్లు పొడిచి 125 రోజులు పని కల్పిస్తామని, అది ప్రభుత్వ ఇష్టానుసారంగా సాగుతుందని 60 రోజులు హాలిడేగా ప్రకటించి ఉపాధి కూలీలను పనులకు దూరం చేసే కుట్రలను చేస్తుందన్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా 10 శాతం ఉండగా కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు ఇచ్చి ఈ పథకం కొనసాగించాలని చట్టం చేసిందని, ఆ చట్టాన్ని నేడు 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరించాలని చట్టంలో మార్పులు చేశారన్నారు. ఇప్పటికే ఉపాధి హామీ కూలీలు పనులు చేసి కూలీ డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర నిధులు మొత్తం కేంద్రం కాజేసి రాష్ట్రంపై భారం మోపి ఈ చట్టాన్ని నిర్వేదం చేసేందుకు మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. దేశ వ్యాప్తంగా కోట్లాది మంది కూలీలు పనులుచేస్తూ పనులు లేని కాలంలో కూలీలకు ప్రభుత్వం పనులు కల్పించి కూలీలకు తిండి పెట్టే ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే మహాత్మా గాంధీ పేరుతో ఉన్న చట్టాన్ని పేర్లు మార్చి వికాసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజానిక మిషన్ గ్రామీణ్ కుప్తంగా జి రామ్‌జీ పేరుతో పూర్తి ఉపాధి హామీ పథకం లేకుండా చేయడం కోసం కుట్ర సాగిస్తుందన్నారు.ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవడానిక ఉపాధి హామి కూలీలు పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

**సిపిఐ శత వార్షికోత్సవాలను విజయవంతం చేయాలి : రాజారెడ్డి**

డిసెంబర్ 26కు సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి కావస్తున్న సందర్భంగా జిల్లాలోని అన్ని గ్రామాల్లో వంద సంవత్సరాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పార్టీ నాయకులు రాజారెడ్డి పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఆకుల శ్రీనివాస్, ఆది సాయన్న, రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు కావటి యాదగిరి, రావుల సదానందం, చొప్పరి సోమయ్య, జువారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బయ్యారంలో ఉక్కు పరిశ్రమ



### సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయ సారథి డిమాండ్

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ మహబూబాబాద్ నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం స్థానిక వీరభవన్ సిపిఐ జిల్లా కార్యాలయంలో కట్లోజు పాండురంగా చారి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి విజయసారథి ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడారు. ఉమ్మడి విభజన చట్టం 2014 లో ఉన్న బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు బిజెపి కేంద్రప్రభుత్వం స్పందించాలన్నారు. ఈ ప్రాంతంలో నాడు బయ్యారం ఉక్కు పరిశ్రమ కోసం సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమించామని, నేడు రైల్వే పరిశ్రమ కోసం దశలవారీగా ఉద్యమిస్తామని, అది సాధించేవరకు పోరాటం ఆగదని విజయసారథి స్పష్టం చేశారు. సమావేశంలో ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన సిపిఐ వార్డు మెంబర్లను సన్మానించారు. వందసంవత్సరాల చరిత్ర గల సిపిఐ అనునిత్యం ప్రజల కోసం ఉద్యమిస్తుందన్నారు. కార్మికుల కోసం, రైతుల కోసం, విద్యార్థుల కోసం, ఉద్యోగస్తుల కోసం, వ్యాపారవర్గాల కోసం అనునిత్యం ఉద్యమిస్తున్న సిపిఐకి రాబోయే మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలని జిల్లా ప్రజలను కోరారు. సిపిఐ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి రాబోయే ఎన్నికల్లో సత్తా చూపాలని పిలుపునిచ్చారు. నిత్యం ప్రజాసమస్యలపై చేస్తున్న ఉద్యమాలను ప్రజలకు వివరిస్తూ జిల్లా సమగ్రాభివృద్ధిలో సిపిఐ పోషిస్తున్న పాత్రను ప్రజలకు వివరిస్తూ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో కంటే ఈసారి మహబూబాబాద్ మున్సిపాలిటీలో ఎక్కువ స్థానాలు పోటీచేసేలా సిద్ధం కావాలన్నారు. సమావేశంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి.అజయ్‌సారధిరెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, తండా సందీప్, చొప్పరి శేఖర్, బైసా స్వామి, బానోత్ లింగ్య నాయక్, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, ఎండి ఫాతిమా, మేక వీరన్న, జలగం ప్రవీణ్, ఆబోతు అశోక్, కేదాసు రమేష్ ,వంకాయలపాటి చిరంజీవి, తూటి వెంకటరెడ్డి, చిర సత్యానారాయణ, మంద భాస్కర్, కమటం ఉపేందర్, గెలిచినవార్డు మెంబర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## భావితరాలకు ఆదర్శ కమ్యూనిస్టుల
# పోరాట చరిత్ర తెలియాలి

### సిపిఐ నేతలు బాగం హేమంతరావు, దండి సురేష్

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** భావితరాలకు ఆదర్శ కమ్యూనిస్టుల పోరాట చరిత్ర తెలియాల్సిన అవసరం ఉందని, కేవలం కమ్యూనిస్టులే పేదల కోసం పోరాటం చేసి వారి హక్కులను కాపాడారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. శుక్రవారం రావూరి బుచ్చిరామయ్య, ఆళ్ళ సీతారామయ్య, మద్దినేని వీరభద్రం వర్థంతి కార్యక్రమాలకు వారు హాజరై చిత్రపటాలకు పూలమాలలు వేసి పార్టీ జెండాను ఆవిష్కరించి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కమ్యూనిస్టులే పేద ప్రజల కోసం పోరాడి వారి హక్కులను కాపాడారన్నారు. ఆదర్శ కమ్యూనిస్టుల పోరాట చరిత్ర భావితరాలకు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశంలో బిజెపి మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తుందని, బడా పారిశ్రామిక వ్యక్తులను దేశ సంపద దోచి పెడుతుందన్నారు. అతి ముఖ్యమైన ప్రభుత్వం రంగం సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి కార్మికులను మోసం చేస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకుండా ఇబ్బందులు గురి చేస్తుందని రైతులు యూరియా సరైన సమయానికి అందించకుండా ఎన్నో ఇబ్బందులు గురి చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో బిజెపి ప్రభుత్వానికి తగినబుద్ధి ప్రజలే చెప్తారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శివర్గ సభ్యులు రాష్ట్ర రైతు సంఘం నాయకులు మహమ్మద్ మౌలానా, మండల కార్యదర్శి చీమ రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు తాటికొండ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.






# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## అష్టలక్ష్మి ఆలయంలో చండిహోమం

**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల సమీపంలోని దేవునిగుట్ట తాండా మార్గంలో ఉన్న శ్రీ గిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో శుక్రవారం అమావాస్య పురస్కరించుకుని సిని దర్శకుడు, జబర్దస్త్ నటుడు బలగం వేణు శ్రీలత దంపతులు చండిహోమం నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి కృష్ణానంద గిరిస్వామి నేతృత్వంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, గణపతి పూజలు చేసిన అనంతరం చండిహోమంలో పాల్గొన్నారు. లోకకళ్యాణార్థం, సినిపరిశ్రమ బాగుండాలని హోమం జరిపించినట్లు బలగం వేణు వెల్లడించారు. ఐదు నెలల క్రితం ఇదే ఆలయంలో చండీహోమం నిర్వహించడం వల్ల అమ్మవారి దయ బాగుందని, అందుకే అందరు క్షేమంగా ఉండాలన్నా ఆకాంక్షతో మరోసారి వచ్చినట్లు తెలిపారు. ఆయనతో పాటు లక్ష్మీ ప్రసాద్ శాంతి దంపతులు సైతం హోమంలో కూర్చున్నారు. హోమం పూర్ణాహుతి సమర్పించిన అనంతరం అన్నదానంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్థలదాత బుక్క నారాయణ, సంజీవ్‌లతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

### ఎస్పీ డాక్టర్ వినీత్

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** రాజీ మార్గమే రాజ మార్గం. వివాదాలు అనేవి పెంచుకోవాలనుకుంటే జీవిత కాలం కొనసాగుతాయి. ఒక వేళ ఇంతటితో కలిసుంటామని ఒక నిర్ణయానికి వస్తే అప్పుడే సమసిపోతాయని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉచిత న్యాయ సేవా అధికారి సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 21 వ తేదీ వరకు కోస్గి కోర్డు, నారాయణపేట జిల్లా కోర్టులలో " జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కక్షిదారులకు పోలీసులు అందుబాటులో ఉంటారని ఈ నెల 21 వ తేదీ ఆదివారం ఉన్నందున రాజీ పడ దగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ పరమైన నిర్వహణ కేసులు, రోడ్డు ప్రమాదాల కేసులు, చిన్న చిన్న దొంగతనాలు కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ , టౌన్ న్యూసెన్స్ కేసులు, బ్యాంకు రికవరీ, టెలిఫోన్ రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులో, ఇతర రాజీ పడ్డ దగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు.

## ఎడమ కాలువ సాగునీరు నిలిపివేత

### రామన్‌పాడు రిజర్వాయర్ వరకే నీటి విడుదల

**ప్రజాపక్షం/పెబ్బేరు:** జూరాల ప్రాజెక్టుకు సంబంధించి ఎన్టీఆర్ ప్రధాన ఎడమ కాలువ క్రింద యాసంగి సాగుకు సాగునీటి విడుదల ఉండదని, ఇరిగేషన్ అధికారులు పిజెపి డివిజన్ 3 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భావన భాస్కర్ ఒక సర్కులర్‌లో తెలిపారు. ప్రధాన ఎడమకాలువ కింద పెబ్బేరు, శ్రీరంగాపూర్, వీపనగండ్ల మండలాలకు చెందిన రైతులకు నీటి పారుదల ఉండదని టామ్ టామ్ ద్వారా రైతులకు సమాచారం ఇవ్వాలని ఆయా మండల తహసిల్దారులకు ఇరిగేషన్ శాఖ అధికారులు సర్కులర్ పంపారు. దీంతో ఆయకట్టు రైతులందరూ తీవ్ర నిరాశకు గురవుతున్నారు. కనీసం ఆరుదడి పంటలకైనా నీరు విడుదల చేయాలని రైతుల విజ్ఞప్తి చేశారు. నీటిపారుదల శాఖ అధికారులు మాట్లాడుతూ వచ్చే వేసవి సీజన్‌కు త్రాగునీటి అవసరాల నిమిత్తం రిజర్వాయర్లలో నీటి నిల్వ ఉండేటట్లు చూడాల్సిన అవసరం ఉందన్నారు. జూరాల ప్రధాన ఎడమ కాలువ నుండి రామన్ పాడు రిజర్వాయర్ వరకు త్రాగునీటి విడుదల ఉంటుందన్నారు.

## బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** బడి ఈడు పిల్లలను పనుల్లో పెట్టకుండా తప్పనిసరిగా పాఠశాలకు పంపాలని సీఆర్పీ నాగరాజు తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. బడి బయటి పిల్లల సర్వే కార్యక్రమంలో భాగంగా సంగినేనిపల్లి, తూముకుంట గ్రామాలలో ఇంటింటా తిరిగి బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా విద్య ప్రాముఖ్యతను వివరించిన ఆయన, 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు కలిగిన ఒక్క బాలుడు కూడా బడి బయట ఉండరాదని, అందరూ పాఠశాలలో చేరాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బాల కార్మికత్వాన్ని నివారించి పిల్లల భవిష్యత్తుకు బాట వేయాలంటే చదువు ఒక్కటే మార్గమని పేర్కొన్నారు. ఈ సర్వే కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బషీర్ అహ్మద్, శ్రీనివాసులు, కిరణ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు సన్మానం



**ప్రజాపక్షం/కృష్ణ :** కృష్ణ మండలం హిందూపూర్ గ్రామ పంచాయితీ ఎన్నికల్లో బిఆర్ఎస్, బీజేపీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి కోర్బన్ అశ్విని, మహేష్, ఉపసర్పంచ్ వాకిటి బాబును బీజేపీ మండల అధ్యక్షులు నల్లె నర్సప్ప, ప్రదాన కార్యదర్శి దండు రాఘవేంద్ర శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ, బిఆర్ఎస్, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కష్టపడి పని చేసి గెలిపించినందుకు ధన్యవాదలు తెలియజేస్తూ, ఇదే ఉత్సాహంతో ఇరు పార్టీల వారు సమన్వయంతో కృషి చేసి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకలు డీకే కిష్టప్ప, ఉప్పరి తిప్పన్న, ఆంజనేయులు, ప్యాట్ల సిద్ధప్ప, గుండెల లక్ష్మణ్, గౌరీ శంకర్, హనమేష్, బస్వరాజ్, శరణప్ప, కిరప్ప, శ్రీనివాస్, గుండెల మహేష్, మ్యాకల యల్లప్ప, ఉప్పరి అశోక్ పాల్గొన్నారు.

## వైభవంగా కోటిలింగేశ్వర దత్త దేవస్థానంలో రుద్రహోమం



**ప్రజాపక్షం/కొత్తకోట:** కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజి దగ్గర గల సుప్రసిద్ధమైన శైవక్షేత్రం శ్రీ కోటిలింగేశ్వర దత్త దేవస్థానములో మార్గశిర మాసం అమావాస్య సందర్భంగా రుద్రహోమం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో హోమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ భక్తులకు అన్నదానం చేశారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాపక్షం/వంగూర్ : మండలపరిధిలోని పోల్కంపల్లి గ్రామానికిచెందిన బుదురు నాగమ్మ అనారోగ్యంతో శుక్రవారం మరణించారు. విషయం తెలుసుకున్న కేటిఆర్ సేవాసంఘం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు అంకు సురేందర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించినవారిలో సయ్యద్ నిజాముద్దిన్, తాడెంరవి, పుప్పాలరవీందర్, సయ్యద్ ముజాహిద్, మీసాలశ్రీకాంత్, గోపాల్, శేఖర్, శ్రవణ్ పాల్గొన్నారు.

# దాడులు చేయడమేనా బిఆర్ఎస్ సంస్కృతి?

### ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి నిలదీత

**ప్రజాపక్షం/జడ్చర్ల :** కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై ఇతర పార్టీల వారు దాడులకు పాల్పడితే తాను ఇతర పార్టీల వారు దాడులకు పాల్పడితే తాను చూస్తూ ఊరుకోనని, తమ కార్యకర్తలను టచ్ చేస్తే తాను కూడా కన్నెర్ర చేయాల్సి వస్తుందని జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుధ్‌రెడ్డి హెచ్చరించారు. అలాగే కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ఎలాంటి ప్రతీకా దాడులకు పాల్పడకూడదని, అలా చేస్తే వారిపైకూడా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. సమాజంలో శాంతిభద్రతలు ప్రధానమని వ్యాఖ్యానించారు. మూడవ విడత పంచాయితీ ఎన్నికలు ముగిసిన తర్వాత గురువారం జడ్చర్ల మండలంలోని నస్రుల్లాబాద్ తాండలో బీఆర్ఎస్ కాంగ్రెస్ వర్గీయుల మధ్య, అలాగే గొల్లపల్లి గ్రామంలో కాంగ్రెస్ బిజెపి వర్గీయుల మధ్య దాడులు, గొడవలు జరిగిన నేపథ్యంలో శుక్రవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ వారు రౌడీయిజం చేస్తున్నారని కేటీఆర్ అంటున్నారని, అయితే నస్రుల్లాబాద్ తాండలో కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థి గెలుపొందితే బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు గొడ్డలితో దాడి చేసారని రౌడీయిజం ఎవరు చేస్తున్నారో కేటీఆర్ ఇప్పుడు చెప్పాలని కోరారు. ఇదేనా మీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మహబూబ్‌నగర్, జడ్చర్ల ప్రాంతాల్లో ఎంత అరాచకాలు చేసారో అందరికి తెలుసునని అనిరుధ్‌రెడ్డి విమర్శించారు. గొల్లపల్లిలో కూడా బిజెపి, కాంగ్రెస్ వర్గాల మధ్య గొడవ జరిగిందని ఈ విషయం తన దృష్టికి వచ్చిన తర్వాత తాను గొల్లపల్లిలో గెలిచిన బిజెపి సర్పంచు అభ్యర్థితోనూ మాట్లాడి వారికి ఏ ఇబ్బంది జరగనివ్వకుండా చూస్తానని హామీ ఇచ్చానని వెల్లడించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండేళ్లుగా ఎలాంటి గొడవలు జరగకుండా నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణాన్ని కాపాడుకుంటూ వస్తున్నామని అనిరుధ్‌రెడ్డి చెప్పారు. గొడవలకు ఎవరు దిగినా సహించేది లేదని పేర్కొన్నారు. జరుగుతున్న గొడవలకు కేటీఆర్ కారణమని తాను చెప్పడం లేదని బీఆర్ఎస్ పార్టీ పెంచి పోషించిన రౌడీలు దీనికి కారణమని ఒక ప్రశ్నకు బదులుగా అనిరుధ్ స్పష్టీకరించారు.



# భారత ఎన్నికల ప్రధాన అధికారికి ఘనస్వాగతం



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్‌కుమార్‌కు జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా ఎస్‌పి డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్‌లు ఘనంగా స్వాగతం పలికారు. శుక్రవారం భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్‌కుమార్ కుటుంబసమేతంగా కలిసి శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు ఢిల్లీనుండి ప్రత్యేక విమానంలో శంషాబాద్ విమానశ్రయానికి చేరుకొని అక్కడినుండి నేరుగా రోడ్డుమార్గాన శ్రీశైలం దర్శనానికి వెళుతూ మార్గమధ్యలో నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామపరిధిలో ఉన్న తెలంగాణ టూరిజం మృగవాణిగెస్ట్‌హౌస్‌కు చేరుకున్న భారతదేశ ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్‌కుమార్‌కు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్, జిల్లా ఎస్‌పి డాక్టర్‌సంగ్రామ్‌సింగ్ పాటిల్, నంద్యాలజిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. కాసేపు విరామం తర్వాత నేరుగా శ్రీశైలం దర్శనానికి బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.అమరేందర్, డిఎస్‌పి శ్రీనివాసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణంలోని శ్రీ పడమటి ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద వృద్ధులకు మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఉలన్ దుప్పట్లను పంపిణీ చేశారు. అమావాస్య సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పడమటి ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద భిక్షాటన చేస్తున్న 25 మంది వృద్ధులకు చిట్టెం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలికాలం కావడం వల్ల వృద్ధులు చలితో పడుతున్న ఇబ్బందులను గుర్తించి వారికి ఉలన్ దుప్పట్లను అందజేయడం జరిగిందన్నారు. వృద్ధులు చలి నుండి కాపాడుకోవడానికి తనవంతుగా దుప్పట్లు అందజేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ నిరుపేదలకు సహాయం అందించాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అనంతరం షిరిడి సాయి బాబా ఆలయం దగ్గర కూడా వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ



చైర్మన్ పి. నరసింహ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు చిన్న హన్మంతు, అన్వర్ హుస్సేన్, కుమ్మరి రవి, మొగులప్ప, ఈశ్వర్ యాదవ్, శివారెడ్డి, నేతాజీ రెడ్డి, జుట్ల శంకర్, జె.సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# వెన్నుపోటు రాజకీయాల వల్లే పార్టీకి నష్టం



### ఎఐసిసి , పిసిసి, క్రమశిక్షణ సంఘానికి ఫిర్యాదు చేస్తా

### ఎమ్మెల్యే మేఘారెడ్డి

**ప్రజాపక్షం/పెద్దమందడి:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల వెన్నుపోటు రాజకీయాలె కాంగ్రెస్ జెండా మోసిన కార్యకర్తలకు నష్టం వాటిల్లిందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి మండిపడ్డారు. శుక్రవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి నంది హిల్స్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వనపర్తి నియోజకవర్గం పరిధిలోని 140 గ్రామపంచాయితీ స్థానాలకు ఇటీవల జరిగిన గ్రామ సర్పంచు, వార్డు సభ్యుల ఎన్నికలలో రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై ప్రజలు తమ సంతృప్తిని ఓటు రూపకంగా తెలిపారన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను తమ మద్దతు తెలిపిన ఓటర్లకు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. వనపర్తి నియోజకవర్గంలో 51 శాతం బీసీలను బరిలో దించామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలతో పోల్చుకుంటే స్థానిక గ్రామపంచాయితీ ఎన్నికలలో గ్రామీణ ప్రాంతాలలో 35.09 శాతం పెరిగిందన్నారు. బిఆర్ఎస్ పార్టీకి వచ్చిన 51 గ్రామపంచాయితీ స్థానాలలో 1520 స్థానాలు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందే అవకాశం ఉన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల వెన్నుపోటు రాజకీయాల కారణంగా కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు నష్టం జరిగిందని ఆరోపించారు. ఈ విషయమై ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ హై కమాండ్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కోపం ఉంటే ప్రత్యక్షంగా చూసుకోవాలని కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా, జెండా మోసిన కార్యకర్తలను టార్గెట్ చేయడం ఏంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డు అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, పిసిసి సభ్యులు శంకర్ ప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్ పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విపత్తు సమయంలో మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహణ

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వరదలు, పరిశ్రమల ప్రమాదాల నివారణపై ఈనెల 22న నిర్వహించనున్న మాక్ ఎక్సర్సైజ్ గురించి శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎన్ డిఎంఏ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ ) డైరెక్టర్ సుధీర్ బాల్, తెలంగాణ ఫైర్ సర్వీస్ డైరెక్టర్ నారాయణరావు, సంబంధిత శాఖల అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నారాయణపేట జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఇన్‌ఛార్జీ (ఎఫ్ ఎసి) కలెక్టర్ సంచిత్ గంగ్వార్ పాల్గొన్నారు. అనంతరం అధికారులతో జిల్లా ఇన్చార్జీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ సూచనలు, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని వరదలు, పరిశ్రమ భారీ ప్రమాదాల సమయంలో అధికార యంత్రాంగం స్పందించాల్సిన తీరుపై మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించేలా కార్యాచరణ తయారు చేయాలని లైన్ డిపార్ట్మెంట్ అధికారులకు సూచించారు. ముఖ్యంగా కృష్ణా నదీ పరివాహక ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఎస్‌డిసి రాజేందర్



గౌడ్, డిఆర్‌డీఓ మొగులప్ప, ఆర్డీవో మేఘా గాంధీ, జిల్లా అగ్నిమాపక అధికారి సురేష్ రెడ్డి, జిల్లా వైద్య, ఆరోగ్య శాక అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్, వ్యవసాయ శాక అధికారి జాన్ సుధాకర్, పశు సంవర్ధక శాఖ అధికారి ఈశ్వర్ రెడ్డి, పీఆర్‌ఈఈ హిర్యా నాయక్, సివిల్ సప్లై డిఎం సైదులు, విద్యుత్ శాఖ ఎస్.ఈ. వెంకట రమణ, పరిశ్రమలు శాఖ అధికారి నర్సింగ్ రావు, ఆర్ అండ్ బీ ఈఈ వెంకట రమణ, మిషన్ భగీరథ ఈఈ రంగా రావు, తహశీల్దార్ అమరేంద్ర కృష్ణ, మున్సిపల్ కమిషనర్ నర్సయ్య, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అచ్చంపేట నియోజకవర్గపు సర్పంచ్‌లు వీరే

**ప్రజాపక్షం/అచ్చంపేట :** అచ్చంపేట నియోజకవర్గంలో ఏడు మండలాలకు చెందిన సర్పంచుల వివరాలు. అమ్రాబాద్ మండలంలో 20 గ్రామపంచాయతీలు ఉండగా 15 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. చీగుర్లగకోటయ్య అమ్రాబాద్, దాసరి ఎల్లమ్మ వెంకటేశ్వర్లబావి, ఇస్లావత్‌మంజుల మన్ననూర్, బిచ్చాలి వటువర్లపల్లి, వీరమ్మ సార్లపల్లి, ఉడుతనూరి మల్లేష్ బ్రహ్మగిరి, చంద్రమౌళి తుర్కపల్లి, పుష్ప మాచారం, పాల్వాయిశ్రీదేవి తెలుగుపల్లి, రజిత జంగంరెడ్డి, దాసరి స్వరాజ్యలక్ష్మి మాధవానిపల్లి, గంటల జయరామ్ లక్ష్మాపూర్‌తండా, ఈదయ్య బికె తిర్మలాపూర్, దేశవత్ లలిత ఉప్పునుంతల ఎన్నికకాగా, కుమ్మరోనిపల్లి, లక్ష్మాపూర్‌బికె, కల్ములోనిపల్లి, ప్రశాంత్‌నగర్, వంగూరోనిపల్లిలో ఎన్నికలు బహిష్కరించారు.

**లింగాల మండలంలో సర్పంచులు :**
లింగాల సర్పంచ్‌గా పూజారి ఈశ్వరమ్మ, అంబటిపల్లి సర్పంచ్‌గా జె. శ్రీవాణి, అప్పాయిపల్లి మూడావత్ విజయ, అప్పాపూర్‌పెంట నిమ్మల శివమ్మ, ఆవుసలి కుంట కొడావత్ మంగమ్మ, బాకారం విష్ణు, క్యాంపు రాయవరం నరేష్ , చెన్నంపల్లి నేనావత్ లలిత, దత్తారం నూకల మస్తాన్, దారారం శ్రీనివాస్, జినుగుపల్లి కట్రావత్‌రవీందర్, కొత్తచెరువుతండా శ్రీదేవి, కొత్తకుంటపల్లి జ్ఞానేశ్వర్‌రెడ్డి, మక్దూంపూర్ పార్వతమ్మ, ఎంసితండా ఎం.నిరంజన్, పద్మన్నపల్లి మూడావత్‌శంకర్, రాంపూర్ శివకుమార్, రాయవరం శ్రీనుయాదవ్, శాయిన్‌పేట మంజుల, శ్రీరంగాపూర్ శ్రీశైలం, సూరాపూర్ శేఖర్, వల్లభాపూర్ సుమతి, కోమటికుంట విశ్వనాథంలు ఎంపికయ్యారు.

**ఉప్పునుంతల మండలంలో సర్పంచులు :**
ఉప్పునుంతలకు చింతకల్ శ్రీనివాస్, దాసర్లపల్లి రమేష్‌రెడ్డి, మామిళ్లపల్లి ముకురాల మోహన్‌గౌడ్, లక్ష్మాపూర్ బీసం గోపాల్, పెద్దాపూర్ సాయిబాబుగౌడ్, మొల్గర శ్రీపురం సులోచనమ్మ, జెట్టిసదగొడు గెల్వమ్మ, తిర్మలాపూర్ శ్రీకాంత్, ఉప్పర్‌పల్లి అమరేందర్‌రెడ్డి, మర్రిపల్లి భూపాల్‌రావు, కొరటికల్ జగదాంబ, వెల్టూరు చింతోజువెంకటేష్ , లత్తిపూర్ మూడావత్ మున్యా, గువ్వలోనిపల్లి పానుగంటి శ్రీదేవి, అయ్యవారిపల్లి జిల్లెల జగత్‌రెడ్డి, పెనిమిల్ల శ్రీలత, రాయ్‌చెడ్ లలిత, సిబితండా రమావత్‌జ్యోతి, పూర్యాతండా మోత్యానాయక్, దేవదారికుంట మునావత్‌మంగమ్మ, ఇరట్‌వానిపల్లి కేతావత్‌చిట్టి, కంసానిపల్లి వాల్యానాయక్, పిరట్‌వానిపల్లి సుప్రియ, తాడూరు ఎల్లి కంటిఅలివేలు, తిప్పాపూర్ మహేష్‌సింగ్ ఎన్నికయ్యారు.

## ఓ కుటుంబానికి గోలి ఆర్థికసాయం

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్/వెల్దండ :** మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామానికిచెందిన నేనావత్‌జిజా అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ అంజినాయక్, నేనావత్ తారసింగ్, వార్డు సభ్యులు బాణావత్ శంకర్, పాత్లావత్‌కృష్ణ, బాణావత్‌సంతోష్, నాయకులు ఇస్లావత్‌బాలు, శ్రీను ఉన్నారు.

**వెల్దండలో :** మండలకేంద్రానికి చెందిన రేవల్లి సత్తయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులుకానుగుల జోగయ్య మృతుని కుటుంబాన్ని పరామర్శించి సత్తయ్య మృతదేహానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ ప్రభాకర్, సింగిల్ విండో వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి చలిచీమలనిరంజన్, మాజీ ఎంపిటిసి లింగం, బిజెపి నాయకులు శ్రీశైలం, బిఆర్ఎస్ నాయకులు కోట్లశేఖర్, అంజయ్య, రేవల్లిరాజు ఉన్నారు.

## సర్పంచ్‌లను సన్మానించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/వంగూర్ :** మండలపరిధిలోని అన్నారం గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికైన మెరుగు గోవర్ధన్‌రెడ్డి, ఉపసర్పంచ్ నారాయణను శుక్రవారం అచ్చంపేట పట్టణంలోని ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీనాయకులు పండిత్‌రావు, యాదగిరిరావు, రాజశేఖర్‌రెడ్డి , రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై అక్రమ కేసులు వెనక్కి తీసుకోవాలి

### డిపో మేనేజర్ తీరుపై జర్నలిస్టు సంఘాల ఆగ్రహం

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల మీడియా స్వేచ్ఛ హక్కులకు విఘాతం కలిగించిన అధికారులను వదిలే ప్రసక్తే లేదని, అక్రమంగా జర్నలిస్టులపై బనాయించిన కేసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని జిల్లా జర్నలిస్టు సంఘాలు గట్టిగా హెచ్చరించాయి. విద్యార్థులు చీకటి సమయం వరకు నారాయణపేట ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో బస్సుల కోసం పడిగాపులు కాస్తూ ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని వార్తగా వెలుగులోకి తీసుకువచ్చినందుకే, మీడియా కవరేజీకి వెళ్లిన జర్నలిస్టులపై ఉద్దేశపూర్వకంగా అక్రమ కేసులు నమోదు చేయడం సిగ్గుచేటు చర్య అని జర్నలిస్టు సంఘాల నాయకులు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై అధికారులను ప్రశ్నించడం జర్నలిస్టుల విధి అని, ఆ విధిని అడ్డుకునే ప్రయత్నం చేయడం ప్రజాస్వామ్యంపై దాడితో సమానం అని వారు పేర్కొన్నారు. జిల్లా జర్నలిస్టుల జోలికి వస్తే సహించేది లేదని, అవసరమైతే ప్రభుత్వ కార్యక్రమాలను బహిష్కరిస్తామని, జర్నలిస్టులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న అధికారులను ఎక్కడికక్కడ నిలదీస్తామని హెచ్చరించారు.

**మీడియా జోలికి వస్తే సహించేది లేదు**

నారాయణపేట జిల్లా జర్నలిస్టులపై ఉద్దేశపూర్వకంగా కేసులు పెట్టడం ద్వారా భయపెట్టాలని చూస్తే ముకుమ్మడిగా ఉద్యమిస్తామని జర్నలిస్టు సంఘాల నాయకులు కొయిలకొండ, నారాయణ రెడ్డి, ఆనంద్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. జర్నలిస్టులకు ఏ రాజకీయ పార్టీతోనూ, ఏ సంఘంతోనూ సంబంధం ఉండదని, ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తే వారధిగా మాత్రమే జర్నలిస్టులు పనిచేస్తారని వారు తెలిపారు. మీడియాను అణచివేయాలని ప్రయత్నిస్తే, అలాంటి చర్యలకు జర్నలిస్టులు తగిన రీతిలో సమాధానం ఇస్తారని హెచ్చరించారు.

## హైడ్రామా మధ్య ఉపసర్పంచ్‌గా చెన్నమ్మ



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** మండల పరిధిలోని పుల్గర్‌చర్ల గ్రామంలో రెండు రోజుల పాటు ఉత్కంఠభరితంగా సాగిన హైడ్రామా అనంతరం ఉపసర్పంచ్ ఎన్నిక పూర్తయ్యింది. సర్పంచ్ వర్గానికి చెందిన జుర్రు చెన్నమ్మ ఉపసర్పంచుగా ఎన్నికై, ఎంపీడీవో శ్రీనివాసరావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని స్వీకరించారు. గ్రామంలో మొత్తం 10 వార్డులు ఉండగా, ఉపసర్పంచు ఎన్నిక కోసం గ్రామపంచాయితీ కార్యాలయంలో ఎన్నికల అధికారి మల్లయ్య ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలిచిన వర్గం ఒక అభ్యర్థిని, మరో వర్గం మరో అభ్యర్థిని ఉపసర్పంచ్ పదవికి ప్రతిపాదించడంతో పోటీ తీవ్రతరమైంది. ఉప సర్పంచ్ ఎన్నికకు సర్పంచ్ వర్గానికి కనీసం ఆరుగురు వార్డు సభ్యుల మద్దతు అవసరం కాగా, సర్పంచ్ వర్గానికి చెందిన నలుగురు వార్డు సభ్యులు, సర్పంచ్ ఓటుతో పాటు, అవతలి వర్గానికి చెందిన వార్డు సభ్యురాలు చెన్నమ్మ మద్దతు ఇవ్వడంతో సర్పంచ్ వర్గానికి చెందిన ఐదవ వార్డు సభ్యురాలు జుర్రు చెన్నమ్మ ఉపసర్పంచుగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మల్లయ్య ప్రకటించారు. ఈ నిర్ణయంపై మరో వర్గానికి చెందిన నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఎన్నికల అధికారి తప్పుడు నిర్ణయం తీసుకుని అన్యాయం చేశారంటూ అధికారితో వాగ్వాదానికి దిగారు. ఈ వివాదాన్ని ఎంపీడీవో శ్రీనివాసరావు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల అధికారి తీసుకున్న నిర్ణయం నిబంధనలు ప్రకారం సరైనదేనని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, ఉపసర్పంచ్ ఎన్నిక చట్టబద్ధంగానే జరిగిందని స్పష్టం చేశారు. దీంతో ఉపసర్పంచ్‌గా ఎన్నికైన జుర్రు చెన్నమ్మకు ఎంపీడీవో శ్రీనివాసరావు అధికారికంగా నియామక పత్రాన్ని అందజేశారు.



# స్థానికం

REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## దోనిపాములు ఉప సర్పంచ్‌గా తిప్పరి రాములు



**ప్రజాపక్షం/చండూరు:** నల్లగొండ జిల్లా చండూరు మండలంలోని దోనిపాముల గ్రామ పంచాయితీలో సిపిఐ బలపర్చిన నాల్గవ వార్డు సభ్యుడుగా ఎన్నికైన తిప్పర్తి రాములు ఉప సర్పంచ్‌గా ఎన్నికైయ్యారు. సిపిఐ నుండి వార్డు మెంబర్‌గా ఎన్నికైన సభ్యుడని కాంగ్రెస్ పార్టీ తరుపున ఎన్నికైన వార్డు సభ్యులు అందరూ కలిసి గ్రామ పంచాయితీ ఉప సర్పంచ్‌గా తిప్పర్తి రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వార్డు మెంబర్‌గా విజయం సాధించి దోనిపాముల గ్రామానికి ఉప సర్పంచ్‌గా ఎన్నికైన తిప్పర్తి రాములును సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య , సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ ,కాంగ్రేస్ చండూరు మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం , కాంగ్రేస్ చండూరు పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ అభినందించారు.

## ఆలేరు ఫలితాలపై టిపిసిసి చీఫ్ హర్షం

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యను అభినందించిన పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్



**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి :** గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఆలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించడంపై పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను అభినందించారు. శుక్రవారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అయిలయ్య పీసీసీ అధ్యక్షుడికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి పవిత్ర ప్రసాదాన్ని అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. నియోజకవర్గంలో అత్యధిక స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడంలో బీర్ల అయిలయ్య పోషించిన కీలక పాత్రను, ఆయన నాయకత్వ పటిమను పీసీసీ అధ్యక్షుడు కొనియాడారు. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న అయిలయ్యని అభినందిస్తూ, రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. 'నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఐక్యంగా పనిచేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి' అని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

## కౌంటింగ్ ఏజెంట్‌పై దాడి

18 మందిపై బైండోవర్ కేసు నమోదు



**ప్రజాపక్షం/గరిడేపల్లి :** మండలంలోని అప్పన్నపేట గ్రామంలో స్థానిక ఎన్నికల కౌంటింగ్ ఏజెంట్‌పై జరిగిన దాడి కేసులో 18 మందిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చలిగంటి నరేష్ తెలిపారు. బుధవారం జరిగిన ఘర్షణలో ఎడవెల్లి చంద్రారెడ్డి అనే మాజీ సర్పంచ్ కౌంటింగ్ ఏజెంట్‌గా ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించగా బిఆర్ఎస్ పార్టీ ఓటమిని అంగీకరించలేక కౌంటింగ్ ఏజెంట్‌గా ఉన్నటువంటి చంద్రారెడ్డిపై బిఆర్ఎస్ అభ్యర్థి కుటుంబ సభ్యులు, కొందరు స్థానిక, స్థానికేతరులు అయిన అల్లరి మూకలను వెంటబెట్టుకొని కౌంటింగ్ హాల్‌పై దాడి చేయడం జరిగింది. ఈ దాడిలో గాయపడిన ఎడవెల్లి చంద్రారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పది మందిపై కేసు నమోదు చేసి అదేవిధంగా సోషల్ మీడియాలో వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఫేక్ న్యూస్ క్రియేట్ చేసిన మరికొంత మందిని మొత్తం 18 మందిని శుక్రవారం హుజూర్‌నగర్ ఆర్‌డిఓ ముందు బైండోవర్ చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు పెరిగిన బలం

ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి



**ప్రజాపక్షం/హాలియా:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్‌కి గ్రామస్థాయిలో ఓటర్లు ఇచ్చిన మద్దతు పార్టీకి మరింత బలం పెరిగిందని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం హాలియాలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామస్థాయిలో పార్టీ కార్యకర్తలు చేసిన కృషి కారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పుంజుకొని మంచి ఫలితాలు సాధించి కాంగ్రెస్ పార్టీకి గట్టి పోటీ ఇచ్చిందని చెప్పారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో గ్రామపంచాయతీలకు జరిగిన ఎన్నికల్లో తమ పార్టీ సుమారు 45 శాతం ఓట్లు సాధించి కాంగ్రెస్ పార్టీకి ధీటుగా సమాధానమిచ్చిందని తెలిపారు.నియోజకవర్గంలో 195 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరగగా అందులో 35 ఏకగ్రీవం కాగా మిగిలిన 160 స్థానాలలో 65 స్థానాలు బిఆర్ఎస్ అభ్యర్థులు సర్పంచులుగా గెలిచి పార్టీ సంస్థాగతంగా బలంగా ఉందని నిరూపించినట్లు చెప్పారు. గ్రామస్థాయిలో పార్టీ కార్యకర్తలు అధైర్య పడవద్దని కార్యకర్తలకు వెన్నంటే తాము ఉంటామని ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలకు హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో కెవి రామారావు,ఎక్కలూరి శ్రీనివాస్ రెడ్డి,వర్ర వెంకటరెడ్డి,వెంకటేశ్వర్లు,యనమల సత్యం,హాలీం పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు నల్లగొండ జిల్లా క్రీడాకారుల ఎంపిక

**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలోని డివివి హై స్కూల్లో శుక్రవారం జిల్లా స్థాయి సీనియర్ నెట్‌బాల్ ఎంపికలు విజయవంతంగా ముగిశాయి. ఈ ఎంపికలను ఉమ్మడి నల్లగొండ జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగగాఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డివివి హై స్కూల్ ప్రిన్సిపాల్ జే. పవన్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా జనరల్ సెక్రటరీ మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 24, 25,26 తేదీల్లో కేసముద్రం, మహబూబాబాద్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు. ఈ పోటీల్లో నల్లగొండ జిల్లా జట్టు మెరుగైన ప్రదర్శన కనబర్చి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు.ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించేందుకు జాతీయస్థాయి సీనియర్ క్రీడాకారులు అనురాగ్ నాయక్, అతిక్ ప్రేమ్ కుమార్,రాము సాయి,సంయుత్ నాయుడు హాజరయ్యారు. డివివి స్కూల్ పీఈటీ సాయికుమార్ ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.



# ఇసుకను తెగ తోడేస్తున్నారు!

రాజకీయ నాయకుల కనుసైగల్లోనే పట్టించుకోని అధికారులు



**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట నియోజక వర్గంలో మూసీ పరివాహక ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమార్కులు ఇసుకను తెగ తోడేస్తున్నారు. రాజకీయ నాయకుల కనుసైగల్లోనే ఈ ఇసుక దందా కొనసాగుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవల్సిన మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు వారు ఇచ్చే మామూళ్ళకు ఆశపడి ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. సూర్యాపేట నియోజక వర్గంలోని మూసీ పరివాహక ప్రాంతాలైన సూర్యాపేట మండలం కాసరబాద, రాయిని గూడెం, కెటిఅన్నారం, పెన్‌పహాడ్ మండలంలోని దోసపహాడ్, నాగులపాటి అన్నారం గ్రామాల్లో అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతుంది. అక్రమార్కులు రాత్రనక పగలనక మూసి వాగులో ఇసుకను తెగ తోడేస్తున్నారు. మూసీ వాగులో నీరు ప్రవహిస్తున్నా తెప్పలతో వెళ్ళి ఇసుకను కూలీలతో తోడించి ఒడ్డుకు తెస్తున్నారు. అనంతరం ఆ ఇసుకను ట్రాక్టర్ ట్రక్కుల్లో నింపుతూ సూర్యాపేట పట్టణంతో పాటు ఇతర ప్రాంతాల్లో అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. మైనింగ్ అధికారులు ఇసుక సరఫరా కోసం ఆన్‌లైన్ విధానం తీసుకవచ్చినా సరఫరాకు ఆలస్యం అవుతుండడంతో భవన నిర్మాణదారులు ఇసుక అందక పనులు ఆగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న అక్రమార్కులు ట్రాక్టర్ ట్రక్కు ఇసుకను రూ.5వేల నుండి రూ.5 వేల 5 వందలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్న పరిస్థితి.

మూసీ పరివాహక ప్రాంతాలలోని ఆయా గ్రామాల రాజకీయ నాయకుల కనుసైగల్లోనే అక్రమ ఇసుక రవాణా సాగుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మూసీ వాగు నుండి ఇసుక అక్రమ రవాణా కోసం కొంతమంది నాయకులు ప్రత్యేకంగా ట్రాక్టర్లు కొనుగోలు చేయడంతో పాటు గ్రామంలోని మరికొంత మంది ట్రాక్టర్ ఉన్నవారిని కూడా ఎంగేజ్ చేసుకొని ఈ అక్రమ ఇసుక దందాను మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాలో లాభాలు ఎక్కువగా ఉండడంతో ఈ దందాను వదులుకోకుండా వృత్తిగా ఎంచుకున్నారు.

అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవల్సిన మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. అక్రమ రవాణాదారుల నుండి కొంతమంది అధికారులకు రోజువారీ, నెలవారీ మామ్మూళ్ళు అందుతుండడంతోనే అడ్డుకోవడంలేదనే పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా పోలీస్‌లు ఈ అక్రమ వసూళ్ళ కోసం ప్రత్యేక దఫేదారిని ఏర్పాటు చేసుకున్నారు. అక్రమ ఇసుక రవాణాదారుల నుండి గతంలో అనేక మంది పోలీసులు అక్రమ వసూళ్ళకు పాల్పడుతుండగా జిల్లా ఉన్నతాధికారులు వారిపై వేటు వేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అయినా వారి తీరులో మాత్రం ఎలాంటి మార్పు రాలేదు. కొంతమంది పై అధికారులు తమ అక్రమ సంపాదన కోసం కిందిస్థాయి సిబ్బందిని బలిచేస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి ఈ అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా ఘంటసాల జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** గాన గంధర్వ పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వర రావు 103వ జయంతి సందర్భంగా జ్ఞాన సరస్వతి కళావేదిక బుర్రి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా బాలభవన్ ఆవరణలో రాష్ట్రస్థాయి పాటల పోటీలను నిర్వహించారు. దీనికి ముఖ్య అతిధిగా హాజరైన డాక్టర్ వూర రామమ్మూర్తి యాదవ్ ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట కళలకు పుట్టినిల్లు అని ఎందరో కళాకారులుగా ఎదిగారని పేటకు వారి ప్రతిభతో వన్నె తెచ్చారని అన్నారు. జీవితంలో ఎంతో ఒత్తిడిలు ఉన్నా కళల వల్ల ప్రతి ఒక్కరూ సేదతీరుతారని తెలిపారు. ఏదో ఒక కళలో రాణించడం లేదా ఆసక్తి కనబరచడం ద్వారా ఆరోగ్యానికి మేలు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్న జూనియర్ ఘంటసాలగా పేరుగాంచిన బుర్రి వెంకటేశ్వర్లుకి అభినందనలు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో భూపతి రాములు, జైలర్ సుధాకర్ రెడ్డి, చిన్న శ్రీరాములు, డాక్టర్ రంగా రెడ్డి, హమీద్‌ఖాన్, సైదులు, వరప్రసాద్, పోతురాజ్, రాధాకృష్ణ పాల్గొన్నారు.




# విద్యార్థిని ఆత్మహత్యాయత్నం..

భవనంపై నుండి దూకిన శివాణి

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డిగ్రీ విద్యార్థిని



**ప్రజాపక్షం/నల్లగొండ :** నల్లగొండ మండలం చర్లపల్లి ఎస్‌సి గురుకుల కళాశాలలో చండూరు మండలం జోగిగూడెం చెందిన రాసాల శివాణి డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.శుక్రవారం ఉదయం 6:41నిమిషాల సమయంలో తోటి విద్యార్థినిలు అందరు కింద ఉన్న సమయంలో తన రూమ్ నుండి పరుగున వచ్చి కళాశాలలోని మూడవ ఫ్లోర్ నుండి కిందకి దూకింది.బిల్డింగ్ పై నుండి దూకిన శివానిని గుర్తించిన సహచర విద్యార్థులు,అధ్యాపకులు కలిసి వెంటనే పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం యువతి పరిస్థితి విషమంగా ఉంది.కాగా జీవితంపై విరక్తి చెంది తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు శివాణి సూసైడ్ లెటర్ రాసిందని రూరల్ ఎస్ఐ సైదాబాబు చెపుతున్నారు. అయితే విద్యార్థినికి తల, మెడ ప్రాంతంలో తడుతో ఊరి వేసినట్లు తీవ్ర గాయాలయలు కవడంతో విద్యార్థులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.విషయం తెలుసుకున్న ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బరిగెల వెంకటేష్ చికిత్స పొందుతున్న విద్యారిన్థి శ్రావణిని పరామర్శించి కళాశాలలో జరిగిన సంఘటనపై తోటి విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. చదువులో మంచి ప్రతిభ కనబరిచే శ్రావణి ఆత్మహత్యాయత్నం చేసుకోవడం గల కారణాలు తెలపాలని కళాశాల ప్రిన్సిపాల్ ను డిమాండ్ చేశారు. సూసైడ్ లెటర్ రాసి ఆత్మహత్యాయత్నం ఎందుకు చేసుకున్నట్లు అనే విషయంపై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. కళాశాలలో విద్యార్థుల పట్ల పర్యవేక్షణ లేకపోవడం వల్లనే ఇలాంటి సంఘటనలు ఆయా గురుకుల,ప్రైవేట్, ప్రభుత్వ వసతి గృహాలలో చోటు చేసుకుంటున్నయని పేర్కొన్నారు.ఇప్పటికైనా విద్యార్థులకు చదువులతో పాటు మనోధైర్యం నింపి ఇలాంటి సంఘటనలు పునావృతం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

# సైబర్ నేరగాళ్లు ఉచ్చులో రిటైర్ టీచర్

డిజిటల్ అరెస్ట్ చేస్తామని బెదిరిస్తూ ఫోన్ కాల్స్

రూ.18 లక్షలు ట్రాన్స్‌ఫర్ కాకుండా నిలువరించిన పోలీసులు



**ప్రజాపక్షం/నలగొండ :** నల్లగొండ పట్టణానికి చెందిన రిటైర్ టీచర్ పుచ్చకాయల దేవేందర్ రెడ్డి పేరుతో కొత్త సిమ్ తీసుకుని బెంగళూరులో డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు తప్పుడు ఆరోపణలు చేస్తు డిజిటల్ అరెస్ట్ చేస్తామని బెదిరిస్తూ సైబర్ నేరగాళ్ల ఫోన్ కాల్స్ చేశారు. తమ్ముమిచ్చిన అకౌంట్ నెంబర్‌కు వెంటనే రూ.18 లక్షలు డిపాజిట్ చేయాలి అంటూ డిమాండ్ చేశారు.సైబర్ నేరగాళ్ల ఫోన్ కాల్స్ బెదిరింపులకు భయపడిన దేవేందర్ రెడ్డి రూ.18 లక్షలు ట్రాన్స్ఫర్ చేయడానికి ప్రకాశం బజార్‌లోని ఎస్‌బిఐ బ్యాంకులో ఒక్కసారిగా రూ.18 లక్షలు డిపాజిట్ చేయాలని బ్యాంక్ మేనేజర్ ను కోరడంతో మేనేజర్‌కు అనుమానం వచ్చి వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.తక్షణమే సంబంధిత బ్యాంకుకు చేరుకున్న సైబర్ క్రైమ్ డిఎస్‌పి లక్ష్మీనారాయణ,ఎస్ఐ విష్ణుకుమార్‌లు దేవేందర్ రెడ్డికి వచ్చిన ఫోన్ కాల్ లిస్ట్‌ను పరిశీలించి సైబర్ నేరగాళ్లకు తిరిగి కాల్ చేసి పోలీసులు ప్రశ్నలకు తడబడిన సమాధానాలు చెపుతు వెంటనే ఫోన్ స్విచ్ ఆఫ్ చేశారు.పోలీసులు వేంటనే అప్రమత్తంమై రూ.18 లక్షలు ట్రాన్స్ఫర్ కాకుండా నిలువరించగలిగరు.ఈ ఘటనపై డిఎస్‌పి లక్ష్మీనారాయణ డిజిటల్ అరెస్ట్ పేరుతో ప్రభుత్వ సంస్థలు లేదా అధికారులు గాని బెదిరించటం,భయపెట్టడం, వీడియో కాల్స్ ద్వారా అరెస్టులు చేయరని ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. అటువంటి కాల్స్ వస్తే నమ్మకుండా వెంటనే డబ్ల్యూ డబ్ల్యూ సైబర్ క్రైమ్ గౌట్ ఇన్ కు లేదా 1930 టోల్ ఫ్రీ నెంబర్ కి ఫోన్ చేసి రిపోర్ట్ చేయాలని సూచించారు. సకాలంలో స్పందించి సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా కాపాడిన నల్లగొండ సైబర్ క్రైమ్ డీఎస్పీ లక్ష్మీనారాయణ, ఎస్ఐ విష్ణు,హెడ్ కానిస్టేబుల్ రియాజ్, కానిస్టేబుల్ మోక్షిద్ లను జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అభినందించారు.

## అర్హులైన ప్రతి విద్యార్థికి సంక్షేమ పథకాలు

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రభుత్వ విద్య, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి విద్యార్థికి పూర్తిస్థాయిలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.ఫ్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ ల పై శనివారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో విద్య, సంక్షేమ శాఖలు, లీడ్ బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు.స్కాలర్‌షిప్ దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, అర్హత, నిర్ధారణ, బ్యాంకు ఖాతాల ధ్రువీకరణ వంటి అన్ని దశలను సమయపాలనతో పూర్తి చేయాలని సూచించారు.ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాల అనుసంధానంలో లోపాలు, ఆధార్ సీడింగ్ సమస్యల వల్ల విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా లీడ్ బ్యాంక్ అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. 50 శాతం దరఖాస్తులు పూర్తిచేసిన మండలాలు 100 పూర్తి చేసే విధంగా ప్రయత్నం చేయాలని ఎంఈ ఓ లకు ఇచ్చిన టార్గెట్ ను పూర్తి చేయాలని కోరారు . జిల్లాలో 6 శాతం ఉన్న స్కాలర్‌షిప్ దరఖాస్తులను 60 పూర్తి చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లా కు అభినందనలు తెలియజేశారని, ఇది అందరి సమిష్టి కృషి అని తెలిపారు. 100 దరఖాస్తులు పూర్తిచేసిన తిరుమలగిరి సాగర్ ఎంఇఒను కలెక్టర్ అభినందించారు. విద్యాశాఖ,సంక్షేమ శాఖ అధికారులు విద్యాసంస్థల స్థాయిలో అవగాహన కల్పిస్తూ విద్యార్థులు స్కాలర్‌షిప్లకు దూరం కాకుండా పర్యవేక్షణ చేసి స్కాలర్‌షిప్ అందే విధంగా చూడాలని అన్నారు.రెవిన్యూ అదనపు కలెక్టర్ జే .శ్రీనివాస్,జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి,జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శశికళ లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ శ్రామిక్ ఉన్నారు.

## గ్రూప్ (-)3 లో మెరిసిన ఆణిముత్యాలు



**ప్రజాపక్షం/మోతె :** గ్రూప్ 3లో మెరిసిన ఆణిముత్యాలు మండల కేంద్రానికి చెందిన బొల్లం గోపాలకృష్ణ 1 నుంచి 4వ తరగతి వరకు శ్రీవేంకటేశ్వర విద్యానికేతన్ మామిళ్ళ గూడెం పాఠశాల 5 నుంచి 10వ తరగతి వరకు సర్వేల్ పాఠశాల నందు గ్రాడ్యుయేషన్ ఎన్ ఐటి రాయ్‌పూర్ చత్తీస్‌ఘడ్‌లో చదువుకొని గ్రూప్ 3లో జూనియర్ అసిస్టెంట్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఉద్యోగం సాధించాడు. దీంతో తల్లిదండ్రులు బొల్లం వెంకన్న యల్లమ్మల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. మండల పరిధిలోని గోపతండకు చెందిన జరుపుల రంగ 1 నుంచి 5వ తరగతి వరకు గోపతండ ప్రభుత్వ పాఠశాల, 6 నుంచి 10వ తరగతి వరకు తుమ్మగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్ ఎస్‌వీఎస్ కూసుమంచి కళాశాల బిటెక్ ఖమ్మం జిల్లా కారేపల్లి కవిత ఇంజనీరింగ్ కళాశాలలో చదివి నేడు గ్రూప్‌లో అసిస్టెంట్ ఆడిటర్‌గా సెలెక్ట్ కావడంతో రంగ తండ్రి జరుపుల భీమ్లా నాయక్ 2013 చనిపోవడంతో తల్లి జరుపుల బుజ్జి రెక్కల కష్టంతో చదివించడంతో తల్లిని గ్రామ ప్రజలు ప్రశంశిస్తున్నారు.

## విపత్తు సమయంలో ప్రజలకు అధికార యంత్రాంగం సేవలందించాలి

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** విపత్తు సమయంలో ప్రజలకు అవసరమైన సేవలందించేందుకు అధికార యంత్రాంగం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వరదలు, పరిశ్రమల ప్రమాదాల నివారణపై ఈనెల 22న నిర్వహించు మాక్ ఎక్సర్సైజ్ గురించి శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎన్‌డిఎంఏ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటి) డైరెక్టర్ సుధీర్ బాల్, తెలంగాణ ఫైర్ సర్వీస్ డైరెక్టర్ నారాయణ రావు, సంబంధిత శాఖల అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ వరదలు, విపత్కర పరిస్థితులలో అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ శాఖలు అప్రమత్తంగా ఉండి తగిన విధంగా చూసుకోవాలని అన్నారు. వరదలు వచ్చినప్పుడు ఏ ప్రాంతం నుండి ఏ ప్రాంతం వైపు వెళ్ళాలి, ఉపశమన శిభిరం ఎక్కడ పెట్టాలి అనేది ముందుగానే చూసుకోవాలని చెప్పారు. సహాయక శిభిరంలో ఆహారం, త్రాగునీరు, శానిటేషన్, మెడిసెన్స్ ఉండే విధంగా చూసుకోవాలని, శిభిరంలో ఎక్కువ రోజులు బాధితులు ఉన్నట్లయితే వారికి సరిపోను రేషన్ బియ్యం, సరుకులు, నూనెలు పంపిణీ చేయాలని, పాఠశాలలోకి వరద నీరు వస్తే ముందుగా పిల్లలను రక్షించాలని, పంటలకు నష్టం జరగకుండా ముందుగానే తగిన ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. రైతులను న్యూస్ ఛానల్, రేడియోల ద్వారా తుఫాన్ హెచ్చరికలు జారీ చేయాలని చెరువుగట్లు, ఏటి గట్లు పటిష్టంగా ఉండే విధంగా చూసుకోవాలని వరదలు, విపత్కర పరిస్థితులలో ప్రజలను అప్రమత్తం చేయడానికి మూడు మున్సిపాలిటిలు, నాలుగు అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఏదో ఒక ప్రాంతంలో మాక్ డ్రిల్ ఎక్సర్సైజ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇట్టి డ్రిల్‌లో అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖలను, ప్రజలను భాగస్వాములు చేయాలని సూచించారు. మాక్ డ్రిల్ ద్వారా ప్రజల్లో ఒక అవగాహన కలిగి వరదలు, విపత్కర పరిస్థితిలో తమను తాము రక్షించుకోవడంలో ఉపయోగపడతాయన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు అదనపు కలెక్టర్ కె సీతారామారావు, అదనపు ఎస్‌పిలు రవీందర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, జడ్‌పి సిఇఓ అప్పారావు, డిపిఓ యాదగిరి పాల్గొన్నారు.

## సాగర్‌లో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తం

క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ శూన్యం

అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం...



**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ లో విద్యుత్ సరఫరా పూర్తిగా గాడి తప్పుతుంది. రోజుకు గంటల తరబడి ఎన్నోసార్లు తెలియకుండా విద్యుత్ నిలిచిపోతూ ఉండటం పరిపాటిగా మారింది వర్షం లేదు,ఈదురు గాలులు లేవు,అయినా సరే ప్రతిరోజు గంటల తరబడి విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం పక్కనే ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఉండి, పుష్కలంగా పవర్ ఉన్నా కూడా నందికొండమున్సిపాలిటీలో అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరాను చేయడంలో విద్యుత్ శాఖ పూర్తిగా విఫలమవుతోంది ఇది సాంకేతిక లోపం కాదు పూర్తిగా అధికారుల వైఫల్యమేనని ప్రజలు మండిపడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి స్థానికులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నార న్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.పగలురాత్రి తేడా లేకుండా విద్యుత్ నిలిచిపోవడం వల్ల గృహజీవితం ఇబ్బందికరంగా మారడం విద్యార్థులు చదువుకోలేని పరిస్థితి, ఏర్పడడం వ్యాపారాలు మూతపడే స్థితి,రోగులు అంధకారంలో విలవిల్లే దుస్థితి నెలకొంది.అయినా విద్యుత్ శాఖ అధికారులు మౌనవ్రతం పాటిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఎన్నో నెలలుగా కొనసాగుతున్న ఈవ్యవహారంతో ప్రజల సహనం అంచులకు చేరుతోంది. అధికారులు తమ బాధ్యతలను పూర్తిగా విస్మరించిన ఫలితంగా విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి ఇంత జరుగుతున్నా అధికారుల్లో చలనం కనిపించడం లేదు.ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల నిర్వహణకు సరైన చర్యలు లేకపోవడం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పూర్తిగా శూన్యమని విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులు చేసినా,సమస్యలు చెప్పినా స్పందన లేకపోవడం ప్రజల ఆగ్రహాన్ని మరింత పెంచుతోంది.ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామంటూ స్థానిక ప్రజలు హెచ్చరిస్తున్నారు.

# రీల్

## తొక్కలో మనసు పగిలేనే అంటున్న విజయ్ ఆంటోని



తమిళ నటుడు విజయ్ ఆంటోని తెలుగులో మంచి మార్కెట్ సంపాదించుకున్నాడు. బిచ్చగాడు సినిమా సక్సెస్‌తో తెలుగు ట్రేడ్‌లో మార్కెట్ సంపాదించుకున్న విజయ్ ఆంటోని తీసిన ప్రతి సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్నా డు. తాజాగా బుకి అనే సినిమాను కూడా విడుదలకు సిద్ధం చేశాడు. ఈ సినిమాలో తాను నటించడం తో పాటు నిర్మాతగా కూడా ఉ న్నా రు. అజయ్ దిషన్, ధనుష హీరో హీరోయిన్స్‌గా గణేష్ చంద్ర దర్శకత్వంలోరూపొందుతున్న యూ త్ ఫుల్ ఎంటర్‌టైనర్ 'బుకీ'. విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్, శరవంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై రామంజేయులు జవ్వాజీని ర్మిస్తున్నారు. విఎఫ్ప్సి ప్రజెంట్ చేస్తున్నారు.తాజాగా మేకర్స్ 'బుకీ' బ్రేకప్ యాంథమ్ తొక్కలో మనసు పగిలేనే సాంగ్‌ని రిలీజ్ చేశారు. విజయ్ ఆంటోని ఈ సాంగ్ ని అద్భుతమైన వైబ్‌తో కంపోజ్ చేశారు. విజయ్ ఆంటోని, ఖరెస్మా రవిచంద్రన్ ఎనర్జిటిక్ వోకల్స్ ఆకట్టుకున్నాయి. భాష్యశ్రీ సాహిత్యం అందించారు. ఈ చిత్రం లో పాండియరాజన్, సునీల్, లక్ష్మి మంచు, ఇందుమతి, వివేక్ ప్రసన్న కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకత్వం డీవోపీ: గణేష్ చంద్ర.

## ముస్తాబవుతున్న మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి నటించిన తాజా చిత్రం మన శంకర వరప్రసాద్ గారు. ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా విడుదలకు ముస్తాబవుతోంది. సినిమాపై ఆసక్తిని పెంచడానికి దర్శకుడు అనిల్ రావిపూడి రకరకాలుగా బాబ్లిసిటి చేస్తున్నారు. వెంకటేష్ ఓ కీలక పాత్రను పోషిస్తున్న ఈ సినిమాలో చిరంజీవి, వెంకటేష్‌పై ఒక మాస్ పాటను చిత్రీకరించారు. ఇప్పుడు ఈ సినిమా నుంచి ఒక మూడు ఫోటోలను సోషల్ మీడియాలో రిలీజ్ చేశారు. చాలా స్టైలిష్‌గా, స్లిమ్‌గా చిరంజీవి కనిపిస్తున్నారు. దీంతో ఈ మెగా ఫాన్స్ పండుగ చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. అన్ని పనులు పూర్తి చేసుకుని జనవరి 12న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల అయిన రెండు పాటలు సూపర్ హిట్ అయ్యాయి. చిరంజీవి సరసన నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి భీమ్స్ సంగీతం అందిస్తున్నారు. క్యాథరిన్ తెరిసా మరో కీలక పాత్ర పోషిస్తోంది. సుస్మిత కొణిదల, సాహు గారపాటి ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

# ఛాంపియన్ సినిమా మగధీరలా హిట్ కావాలి

### ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో రామ్ చరణ్



స్వప్న సినిమాస్ అప్‌కమింగ్ మూవీ 'ఛాంపియన్' ఆసక్తికరమైన ప్రమోషనల్ కంటెంట్‌తో ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రంలో రోషన్, అనస్వర రాజన్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. జీ స్టూడియోస్ సమర్పణలో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్‌తో కలిసి నిర్మిస్తున్నారు. మిక్కీ జే మేయర్ అందించిన పాటలు చార్ట్ బస్టర్ అయ్యాయి. ఈ చిత్రం డిసెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా రామ్ చరణ్ చీఫ్ గెస్ట్‌గా ఈ సినిమా ట్రైలర్ లాంచ్ చేశారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మాట్లాడుతూ కో ఇన్సిడెంట్‌గా నేను పక్క స్టూడియోలోనే షూటింగ్ చేస్తున్నాను. ఎన్టీఆర్‌కి మొదటి సినిమా స్టూడెంట్ నెంబర్ వన్, అల్లు అర్జున్‌కి మొదటి సినిమా గంగోత్రి, మహేష్‌కి రాజకుమారుడు, నాకు చిరుత.. మా అందరికీ మోస్ట్ కామన్ బ్యూటిఫుల్ పర్సన్ మా దత్తుకి, వైజయంతి మూవీస్‌కి మన స్ఫూర్తిగా ధన్యవాదాలు. మేము ఎలా పెర్ఫాం చేస్తామో తెలియకుండానే మా అందరికీ మొదటి సినిమా ఇచ్చి ఇంత అద్భుతమైన ప్రయాణాన్ని ఇచ్చినందుకు దత్తుకి థాంక్యూ సో మచ్. రోషన్ కూడా ఇవాళ ఛాంపియన్‌తో వస్తున్నాడు. తనకి వైజయంతి మూవీస్‌లో అద్భుతమైన సక్సెస్ రావాలని కోరుకుంటున్నాను. నా రెండో సినిమా మగధీర ఎంత పెద్ద హిట్ అయిందో ఛాంపియన్ అంత పెద్ద హిట్ కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. డిసెంబర్ 25న రిజల్ట్ ఇస్తుందని గట్టిగా నమ్ముతున్నాను అని అన్నారు. డైరెక్టర్ నాగ్ అశ్విన్ మాట్లాడుతూ కల్కి చివర్లో ఉన్నప్పుడు ఈ సినిమా మొదలైంది. ఈ సినిమా బిగినింగ్ నుంచి జర్నీ తెలుసు. వైజయంతి ప్రొడక్షన్ స్టాండర్డ్స్ ఏ స్థాయిలో ఉంటాయో అందరికీ తెలుసు. ఈ సినిమా చాలా అద్భుతంగా అనిపించింది. ప్రదీప్ చాలా ముఖ్యమైన కథ చెబుతున్నారు. రోషన్ చాలా అద్భుతంగా కనిపిస్తున్నాడు. అనస్వర ఈ సినిమా తర్వాత చాలామందికి ఫేవరెట్ అవుతుంది. బైరాన్‌పల్లి వీరులందరి పెర్ఫార్మన్స్ మీ అందరికీ నచ్చుతుంది. అందరు కూడా ఈ సినిమా గురించి మాట్లాడతారు. గిరగిర సాంగ్ ట్రెండ్ అవుతుంది ఛాంపియన్ మన నేల కథ. బైరన్‌పల్లి విలేజ్‌లో ఏం జరిగిందనేది చాలామందికి తెలీదు. అలాంటి కథ చెప్పాలనే వైజయంతి మూవీస్ ఈ సినిమా చేస్తోంది అని చెప్పారు. హీరో రోషన్ మాట్లాడుతూ ఈ మూడేళ్లలో నేను చాలా నేర్చుకున్నాను. ఇక ఆగేది లేదు. ప్రదీప్ ఆల్రెడీ నేషనల్ అవార్డు గెలిచారు. నాకు మైకేల్ క్యారెక్టర్, ఛాంపియన్ సినిమా ఇచ్చినందుకు ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఆయన చేసిన హార్డ్‌వర్క్‌కి నిజంగా హ్యాట్సప్. డైరెక్టర్ ప్రదీప్ అద్వైతం మాట్లాడుతూ మమ్మల్ని బ్లెస్ చేయడానికి వచ్చిన రామ్ చరణ్‌కి థాంక్యూ. నా లైఫ్‌లోకి వచ్చిన ఏంజిల్స్ స్వప్న రోషన్. సప్న సంకల్పం రోషన్ నమ్మకంతోనే ఈ సినిమా మీ ముందుకు వస్తుంది. డిసెంబర్ 25వ తేదీన ఈ సినిమా హిట్ కాబోతుందనే నమ్మకం ఉందన్నారు. ప్రొడ్యూసర్ అశ్విని దత్ మాట్లాడుతూ నేను ఇంట్రడ్యూస్ చేసిన చరణ్ ఎంతో ఎత్తుకు ఎదిగాడు. ఆయన సినిమా పెద్ది వస్తుందంటే నుంచే చూడాలి అనిపించేంత కోరిక ఉంది. ఇప్పుడు ఇంట్రడ్యూస్ చేస్తున్న రోషన్ కూడా వారి అడుగుజాడల్లో నడవాలని కోరుకుంటున్నాను అని అన్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ రోషన్‌ని బ్లెస్ చేయడానికి వచ్చిన రామ్ చరణ్‌కి థాంక్యూ. ఈ సినిమా కోసం మీ అందరి లాగానే నేను కూడా ఎదురు చూస్తున్నాను. ప్రదీప్ అద్భుతమైన దర్శకుడు. తన భవిష్యత్తులో చాలా పెద్ద దర్శకుడు అవుతాడు. మా దత్తుతో పెళ్లి సందడి చేశా. ఇప్పుడు రోషన్‌తో సినిమా చేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. అనస్వర రాజన్ మాట్లాడుతూ నేను రామ్ చరణ్‌కి పెద్ద ఫ్యాన్‌ని. ఆయన మగధీర సినిమా ఎన్నోసార్లు చూశాను. ఆయన మా ట్రైలర్‌ని లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాతో తెలుగులో లాంచ్ కావడం చాలా ఆనందంగా ఉంది. ఈ అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు అని చెప్పారు.

# సోషల్ మీడియాలో నన్ను హేట్ చేస్తున్నారు!

### సంగీత దర్శకుడు డైరెక్టర్ తమన్



నందమూరి బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఇటీవల విడుదలైన సినిమా 'అఖండ 2: ది తాండవం. ఈ సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ తమన్ మీడియాతో చిట్ చాట్ జరిపారు. సినిమా బాగుంటే అన్ని బాగుంటాయి. మ్యూజిక్ అనేది ఒక క్రాఫ్ట్. మన క్రాఫ్ట్‌ని మనం బెస్ట్‌గా చేయాలి. ఈ ఏడాది దాకు మహా రాజ్, గేమ్ చేంజర్, ఓజి.. అఖండ2.. రాబోతున్న రాజాసాబ్ ఇవన్నీ కూడా వరుసగా కలిసి వచ్చాయి. మనం స్క్రిప్ట్ అనుకున్నప్పుడే కొన్ని హై మూమెంట్స్ అనుకుంటాం. బోయపాటి ఆషామాసి డైరెక్టర్ కాదు. కమర్షియల్ సినిమా నమ్మించేలా తీయడం నిలబెట్టడం చాలా గొప్ప విషయం. అందులోనూ సనాతన ధర్మం కంటెంట్‌గా తీసుకుని దాన్ని కమర్షియల్‌గా చెప్పడం, అందులోనూ బాలయ్య లాంటి సూపర్ మాస్ ఎనర్జిటిక్ స్టార్‌తో చేయడం మామూలు విషయం కాదు. ఈ క్రెడిట్ అంతా బాలయ్యకి, బోయపాటికి ఆ క్రెడిట్ దక్కుతుంది. బోయపాటికి నాకు రెండు నెలలు సమయం కావాలని అడిగాను ఒక్క రీల్ చేసి చూపించాను. ఆయనకు చాలా నచ్చింది. అప్పుడు నాకున్న బడ్జెట్‌ని మార్చి, నాకు మరింత సమయాన్ని ఇచ్చి ఎంతగానో సపోర్ట్ చేయించి చేసి మ్యూజిక్ చేయించారు. అఖండకి ఆయన నాకు వెన్నుముకలాగా నిలిచారు. ఆడియన్స్‌ని ఎలా ట్రాన్స్‌లోకి తీసుకువెళ్లాలి అని ఆలోచన చేస్తూ చాలా హార్డ్ వర్క్ చేసి ఈ సినిమా చేశాం. ఈ సినిమాకి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ చేయడానికి 73 రోజులు పట్టింది. జనరల్‌గా బోయపాటి సినిమాలో ఇంటర్వెల్ క్లైమాక్స్ చేయడం చాలా కష్టం. మొదటి రీల్ నుంచి నాకు చాలెంజ్ మొదలైంది. అష్టసిద్ధి కుంభమేళా ఇంటర్వెల్, ఆది గారి ఎపిసోడ్, హనుమంతుడు ఎపిసోడ్ లాస్ట్‌లో అవెంజర్స్ లాంటి క్లైమాక్స్ ఇవన్నీ చాలా హార్డ్ వర్క్‌తో కూడుకున్నవి. గేయ రచయితలు కాసర్ల శ్యామ్, కళ్యాణ్ చక్రవర్తి, శర్మ అందరూ చాలా అద్భుతంగా సపోర్ట్ చేశారు. ఈ సినిమా కోసం సర్వేపల్లి సిస్టర్స్, సుబ్బలక్ష్మి మనవరాలు, కనకవ్వ ఇలా చాలా ఫ్రెష్ వాయిస్‌లు మీకు వినిపించాయి. చివరి నిమిషంలో విడుదల ఆగిపోవడం నిజానికి నాకు అది షాకింగ్. ఎందుకంటే ఎవరూ కూడా ఊహించలేదు. ఒక సినిమా రిలీజ్ అయినప్పుడు సోషల్ మీడియాలో చాలా హేట్ వస్తుంది. అంత హేట్ అవసరం లేదని చెప్పడమే నా ఉద్దేశం.

## బాహుబలి వంటి సినిమా చేయాలనుంది



రకుల్ ప్రీత్ సింగ్

తెలుగు సినిమాను ఓ ఊపు ఊపిన రకుల్ ప్రీత్ సింగ్ కొంత కాలంగా తెలుగు తెరకు దూరంగా ఉంది. వివాహం చేసుకున్న రకుల్ తిరిగి చాలా రోజుల తరువాత హైదరాబాద్‌లో సందడి చేసింది. ఓ ప్రయివేట్ కార్యక్రమానికి వచ్చిన రకుల్ ప్రీత్ సింగ్ మీడియాతో ముచ్చటించింది. బాహుబలి వంటి సినిమా చెయ్యాలని ఉందని తన మనసులోని మాట చెప్పింది. ఇటీవల కాలంలో తెలుగు సినిమాలు చేయకపోవడం వల్ల నేను తెలుగు సినిమాలను, తెలుగువారిని ఎంతగానో మిస్ అవుతున్నాను. తప్పకుండా నేను తెలుగులో సినిమాలు చేస్తాను. నాకు తొలివిజయం అందించింది తెలుగు సినిమానే. నన్ను తెలుగు ప్రజలు అంతగా ఆదరించారు. ఒక చక్కటి కథ కోసం ఎదురుచూస్తున్నాను. నాకు మంచి తెలుగు కథ రావాలని నా అభిమానులంతా నాకోసం ప్రార్థించండి. హైదరాబాద్ లో ఉండి షూటింగ్ చేయాలని ఎంతో కొరికగా ఉంది. ప్రస్తుతం కథలు వింటున్నాను. మంచి కథ కోసం ఎదురు చూస్తున్నాను. తెలుగులో బాహుబలి వంటి సినిమా చేయాలని నా కోరిక. బోయపాటి శ్రీను దర్శకత్వంలో నేను గతంలో రెండు సినిమాలలో చేశాను. వారి మాస్ డైరెక్షన్ నాకు చాలా ఇష్టం అని రకుల్ ప్రీత్ సింగ్ చెప్పారు.

## జనవరి 13న భర్త మహాశయులకు విజ్ఞప్తి

రవితేజ హీరోగా కిశోర్ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం భర్త మహాశయులకు విజ్ఞప్తి. ఆశికా రంగనాథ్, డింపుల్ హాయతి హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ఈ చిత్రానికి సంబంధించిన తాజా టీజర్ రిలీజ్ చేశారు. భార్య భర్తల మధ్య ఉండే అనుబంధం, చిన్న చిన్న గొడవలు ఎలా సర్దుకుపోవాలి వంటి అంశాలను కథగా తీసుకుని నిర్మించిన సినిమా ఇది. అన్ని పనులు పూర్తి చేసి సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 13న ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఎస్ ఎల్ వి సి సినిమాస్ బ్యానర్ పై చెరుకు సుధాకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భీమ్స్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు.

# చైతన్యవంతమైన సమాజానికి క్రీడలు మూలస్తంభం

### భారత బాడ్మింటన్ క్రీడాకారిణి, ఒలింపిక్స్ విజేత, పద్మ భూషణ్ సైనా నెహ్వాల్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** క్రీడలు ఆరోగ్యకరమైన, చైతన్యవంతమైన సమాజానికి మూలస్తంభమని, క్రీడలలో పాల్గొనే విద్యార్థులు విద్యాపరంగా మెరుగ్గా రాణిస్తారని భారత బాడ్మింటన్ క్రీడాకారిణి, ఒలింపిక్స్ విజేత, పద్మ భూషణ్ సైనా నెహ్వాల్ అన్నారు. క్రీడలు శరీరాన్ని మాత్రమే కాకుండా మెదడును అభివృద్ధి చేయడం ద్వారా జీవిత నైపుణ్యాలను పెంపొందించడంలో, ఐక్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో సహాయపడతాయన్నారు. హైదరాబాద్ డిఆర్ఎస్ఐఎస్ క్యాంపస్‌లో శుక్రవారం జరిగిన డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ 23వ వార్షిక క్రీడా పోటీల ముగింపు ఉత్సవాలలో సైనా నెహ్వాల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అడిషనల్ డిజిపి డాక్టర్ అనిల్ కుమార్ డిఆర్ఎస్ఐఎస్ చైర్మన్ దయానంద్ అగర్వాల్, డైరెక్టర్‌లు అంజనీ కుమార్ అగర్వాల్, సంజయ్ అగర్వాల్, గర్వ అగర్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ క్యాంపస్ లో కొత్తగా ఏర్పాటు చేసిన బాడ్మింటన్ కోర్ట్‌ను సైనా నెహ్వాల్ ప్రారంభించి విద్యార్థులతో బాడ్మింటన్ ఆడారు. అనంతరం క్రీడా పోటీలలో పాల్గొని విజేతలైన విద్యార్థిని విద్యార్థులకు ట్రోఫీలు, సర్టిఫికెట్‌లను అందజేశారు. సైనా నెహ్వాల్ మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలు మానవ జీవితంలో ఒక ముఖ్యమైన భాగమని, అవి వ్యక్తిత్వాన్ని రూపొందించడం, మంచి ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం, క్రమశిక్షణ, జట్టు కృషి విలువలను బోధించడం చేస్తాయన్నారు. పిల్లలలో క్రీడలు, ఆటలను ప్రోత్సహించడంలో పాఠశాలలు పెద్ద పాత్రను పోషించాలని, పాఠశాలలు తమ రోజువారీ షెడ్యూల్‌లో క్రీడలను చేర్చి, క్రమం తప్పకుండా క్రీడా పోటీలు, టోర్నమెంట్లు నిర్వహించాలని సైనా నెహ్వాల్ కోరారు. డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ డిఆర్ఎస్ఐఎస్ యాజమాన్యం క్రీడల ప్రాముఖ్యత గుర్తించి క్రీడా మౌలిక సదుపాయాలు కల్పించి క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, స్విమ్మింగ్ వంటి ప్రతి క్రీడలలో విద్యార్థులు పాల్గొనేలా చేసి దేశీయ, అంతర్జాతీయ పోటీలకు పంపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ చీఫ్ కోచ్ డాక్టర్ మురమళ్ళ భారత్ కుమార్, అడ్మిన్ హెడ్ వినోద రంజన్, వైస్ ప్రిన్సిపాల్ పూజ సక్సేనా, హెడ్ ఆఫ్ బోర్డింగ్ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తులో క్రీడాహబ్‌గా తెలంగాణ

### క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రం భవిష్యత్తులో క్రీడాహబ్‌గా మారిపోతుందని క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో యుబిఎస్ అథ్లెటిక్స్ కిడ్స్ కప్ టోర్నమెంట్ కు ముఖ్య అతిధులుగా మంత్రు లు వాకిటి శ్రీహరి, శ్రీధర్‌బాబు హాజరయ్యారు. అథ్లెటిక్స్ కిడ్ కప్‌లో విజేతలుగా నిలిచిన వారికి మంత్రులు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. చిన్నారుల్లో ఉన్న క్రీడానైపుణ్యాలను గుర్తించడానికి యుబిఎస్ చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. సిఎం కప్ ద్వారా గ్రామస్థాయిలో 4లక్షల మంది క్రీడాకారుల నైపుణ్యాలను గుర్తించామన్నారు. భవిష్యత్తులో 5లక్షల మంది క్రీడాకారులను సిఎం కప్ ద్వారా వారి ప్రతిభ గుర్తించి రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ క్రీడా వేదికలకు పరిచయం చేస్తాం అని అన్నారు. స్పోర్ట్స్ పాలసీ ఏర్పాటు చేసి ఒలంపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించే దిశగా పని చేస్తున్నామని తెలిపారు. చిన్నారుల్లో ప్రతిభ బయటికి తీసి వారికి అవకాశాలు కల్పించి ప్రోత్సహిస్తున్నామని అన్నారు. ఒకప్పుడు తల్లిదండ్రులు ప్రోత్సాహం తక్కువగా ఉండేది ఇప్పుడు తల్లితండ్రులే పిల్లలను క్రీడల వైపు ఎక్కువగా ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో నూతన స్టేడియాలు ఏర్పాటు చేయడమే కాకుండా పాత స్టేడియాలను పునరుద్ధరణ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ చైర్మన్ శివసేన రెడ్డితో పాటు అధికారులు పాల్గొన్నారు.



# ప్రజా రంజక పాలన

(మొదటి పేజీ తరువాయి)

ముత్యాల విశ్వనాథం అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా విచ్చేసిన కూనంనేని మాట్లాడుతూ గెలిచిన సిపిఐ అభ్యర్థులు ఆయా గ్రామ పంచాయితీల్లోని గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ఎజెండాగా ఉండాలని సూచించారు. పోటా పోటీగా ఒంటరి పోరుకు దిగిన సిపిఐ జిల్లా వ్యాప్తంగా 47 సర్పంచ్ స్థానాలను మంచి మెజార్టీతో గెలుచుకుందని, అదే విధంగా 57 ఉపసర్పంచ్ పదవులు దక్కించుకోగా, 432 వార్డుల్లో ఎర్ర జెండా రెపరెపలాడుతోందన్నారు. మేజర్ గ్రామ పంచాయితీలను సైతం సిపిఐ ఖాతాలో పడ్డాయని తెలిపారు. తాము కాకలు తీరిని రాజకీయ పండితులం అని చెప్పుకునే వారి ప్రాంతాల్లో కూడా సిపిఐ దూసుకుపోయిందని, కొత్తగూడెం నియోజకవర్గంలో కాంగ్రెస్ కంటే సిపిఐకి అత్యధిక ఓట్లు పోలయ్యాయని చెప్పారు. ముగిసిన ఎన్నికల్లో సిపిఐకి కాంగ్రెస్ పార్టీ కనీసం మద్దతు తెలపలేదని, కానీ సిపిఐ స్నేహధర్మాన్ని పాటిస్తూ గతంలో కాంగ్రెస్ సర్పంచ్‌లు ఉన్న స్థానాల్లో తాము పోటికి నిలుపలేదని చెప్పారు. అయినప్పటికీ కాంగ్రెస్ నేతలు వ్యక్తిగత దూషణలకు దిగితూ దిగజారుడు రాజకీయాలు చేశారని, విలువలతో కూడుకున్న రాజకీయాలు, క్రమశిక్షణతో ఉన్న తాము తప్పిదాలకు తావివ్వలేదని చెప్పారు. కొందరు సిపిఐది ఏముందిలే, గత అసెంబ్లీ ఎన్నికల్లో తామే గెలిపించాం, వాళ్లకు అంత సీన్ లేదంటూ అవాకులు చెవాకులు పేలారని, కానీ దిమ్మదిరిగే ఫలితాలు సొంత కావడంతో ఇప్పుడు వారు ఎక్కడున్నారో కూడా అంతు చిక్కడం లేదని యద్దేవా చేశారు. ఇప్పటికైనా మాటలు జారడం మానుకుని స్నేహ బంధాన్ని నిలుపుకుంటే మంచిదని హితవు పలికారు. త్వరలో జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు జరగబోతున్నాయని, ఆ తర్వాత మున్సిపాలిటీ, కార్పోరేషన్ ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. ఏ ఎన్నికలు వచ్చినా సిపిఐదే పైచేయని, ఆ నాటి రాజకీయ పరిస్థితులు, ఆయా పార్టీల రాష్ట్ర పెద్దల నిర్ణయాల మేరకు కార్యచరణ ఉంటుందన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ గెలిచిన అభ్యర్థులు ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగాలని, ఓటమి పాలైన వారు కృంగిపోకుండా రానున్న ఎన్నికల్లో సత్తా చాటేందుకు మనోధైర్యాన్ని కూడగట్టుకుని ముందుకు సాగాలని సూచించారు. అనంతరం సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డుసభ్యులకు మెమోంటోలు అందజేసి షాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాసరావు, నరాటి ప్రసాద్, సరెడ్డి పుల్లారెడ్డి, దుర్గరాశి వెంకటేశ్వర్లు, వి పూర్ణ చంద్రరావు, మున్నాలక్ష్మీ కుమారి, కే సారయ్య, చంద్రగిరి శ్రీనివాస రావు, రేసు ఎల్లయ్య, ఎస్‌డి సలీం, చంద్ర నరేంద్ర కుమార్, వాసిరెడ్డి మురళీ, మువ్వా వెంకటేశ్వరరావు, బంధం నాగయ్య, ఉప్పుశెట్టిరాహుల్, మండల కార్యదర్శులు, జిల్లా సమితి సభ్యులు నూతన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రామ జపంతో దగా

(మొదటి పేజీ తరువాయి)

కడుపు కొట్టేందుకు చేస్తున్న ప్రయత్నాల పట్ల ప్రజలలో చైతన్యం తీసుకువచ్చేందుకు భవిష్యత్ కా ర్యాచరణపై చర్చించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని, నిధులను మరింత పెంచడంతో పాటు కూలీల వేతనాలను, పనిదినాలను 200రోజులకు పెంచాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు.

అనంతరం మీడియాతో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహ మాట్లాడుతూ శ్రీరాముని పేరుతో 30 కోట్ల మందిని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మరోసారి మోసం చేసే కుట్రకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రజలను మతం వైపు నడిపిస్తూ, కార్పొరేట్ శక్తులను బలోపేతం చేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. బలమైన పోరాటల కారణంగా రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకున్నారని గుర్తు చేశారు. ఉపాధి హామీ చట్టం వైఫల్యం చెందాలనే ఉద్దేశంతోనే చట్టాన్ని పథకంగా మార్చారన్నారు. భారత స్వాతంత్రోద్యమంలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ పాల్గొనలేదని, అందుకే స్వాతంత్ర్య ఉద్యమంలో ఉన్న గాంధీజిని, పోరాట యోధుల పేర్లను తొలగిస్తున్నారని, మావోయిస్టు నాయకులను ఎన్‌కౌంటర్ చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జాన్ వెస్లీ మాట్లాడుతూ ఉపాధి హామీ పని దినాలను, వేతనాలను పెంచాలని కోరినప్పటికీ కేంద్రం పెంచలేదని, ఇది వరకు ఉన్న 90 శాతం వాటాలను ఈ కొత్త బిల్లు ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలే 40 శాతం నిధులను భరించాలని, కేంద్రం విడుదల చేసిన నిధులకు మించి జరిగే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వాలే భరించాలనే నిబంధనలను పొందుపర్చారన్నారు. ఉపాధి హామీ చట్టంలో ఉన్న నిరుద్యోగ భృతి తొలగించారని, కూలీల సంఖ్యను కూడా తగ్గించారని విమర్శించారు. కె.గోవర్ధన్ మాట్లాడుతూ రానున్న 2047 నాటికి భారతదేశాన్ని పూర్తిగా హిందూదేశంగా మార్చేందుకు బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తోందని విమర్శించారు. గత 12 ఏళ్లుగా బిజెపి ముసుగులో ఆర్ఎస్ఎస్ ప్రత్యక్షంగా పరిపాలన కొనసాగిస్తోందని, వారసత్వాలు, దేశ పునాదులపై దాడులకు పాల్పడుతోందని మండిపడ్డారు. అన్వేష్ మాట్లాడుతూ ప్రజా పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక, విద్య, ఉపాధి హక్కు చట్టాలను తొలగించేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు. గోదగాని రవి మాట్లాడుతూ రాష్ట్రాలపైన కేంద్ర ప్రభుత్వం భారం మోప డం ప్రజా వ్యతిరేక చర్య అని అన్నారు. ఆర్‌వి.ప్రసాద్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ చట్టం బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

# కప్పేసిన పొగమంచు

(మొదటి పేజీ తరువాయి)

రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని హెచ్చరించింది. దానికి తగ్గట్టే 150కి పైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి. మరో 200 సర్వీసుల్లో జాప్యం చోటుచేసుకుంది. ఈ అంతరాయాలు కొనసాగుతాయని ఢిల్లీ ఎయిర్ పోర్ట్ వెల్లడించింది. పంజాబ్, హర్యానా, ఢిల్లీ, ఉత్తర్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, బిహార్ రాష్ట్రాలను దట్టమైన పొగమంచు కప్పేసిందని, ఉపగ్రహ చిత్రాల ద్వారా ఈ విషయం వెల్లడైందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఉదయం 5.30 గంటల సమయంలో ఉత్తర్ ప్రదేశ్‌లోని ఆగ్రా, బరేలీ, షహరాన్‌పూర్, గోరఖ్‌పూర్, పంజాబ్‌లోని అంబాలా, అమృత్‌సర్, లూథియానా, ఆదంపుర్, ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్, హర్యానా, మధ్యప్రదేశ్, బిహార్‌లోని పలు ప్రాంతాల్లో ఎదురుగా వస్తోన్న వాహనాలు ఏమాత్రం కనిపించని పరిస్థితి నెలకొంది. కాగా.. వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఢిల్లీ ప్రభుత్వం తీసుకొచ్చిన కఠినమైన చర్యలు అమల్లోకి వచ్చాయి. కాలుష్య నియంత్రణ ధ్రువపత్రం (పియుసి) లేని వాహనాలకు ఢిల్లీ పెట్రోలు స్టేషన్లలో ఇంధనం అందించడం ఆపేశారు. ఈ నిబంధనలను కఠినంగా అమలుచేసేందుకు ఢిల్లీ సరిహద్దుల వద్ద పోలీసు, రవాణాశాఖ బృందాలను మోహరించారు.

# 'ఆదివారం' బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

అడిగినప్పుడు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ ఈ నిర్ణయాలను పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ సరైన సమయంలో తీసుకుంటుందని బదులిచ్చారు. ఏప్రిల్ 1న ప్రారంభమయ్యే కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే బడ్జెట్ అమలును నిర్ధారించడానికి ఫిబ్రవరి 1వ తేదీని ఎంపిక చేశారు. ఒక అధికారి చెప్పిన వివరాల ప్రకారం... 'సాధారణ బడ్జెట్ ప్రవేశపెట్టడానికి మాకు ఒక నిర్ణీత రోజు ఉంది. ఆదివారం అనే భావనను బ్రిటిష్ వారు తీసుకువచ్చారు. 2017కి ముందు, సాధారణ బడ్జెట్‌ను ఫిబ్రవరి చివరి రోజున ప్రవేశపెట్టేవారు, కొత్త ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసిక ఖర్చులను తీర్చడానికి భారత సంఘటిత నిధి నుండి డబ్బును ఉపసంహరించుకోవడానికి పార్లమెంటు ఓట్ ఆన్ అకౌంట్‌ను ఆమోదించేది. వివిధ విభాగాల గ్రాంట్ల డిమాండ్లను సంబంధిత పార్లమెంటరీ స్థాయీ సంఘాలు పరిశీలించిన తర్వాత, ఆర్థిక సంవత్సరం మిగిలిన కాలానికి సంబంధించిన బడ్జెట్‌ను పార్లమెంటు తర్వాతి తేదీలో ఆమోదించేది. 2017లో, అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి చాలా ముందుగానే, ఫిబ్రవరి 1న సాధారణ బడ్జెట్‌ను ప్రవేశపెట్టి, మార్చి నెలాఖరులోగా పార్లమెంటు ఆమోదం పొందే పద్ధతిని ప్రారంభించారు. 2020లో కొవిడ్ మహమ్మారి వంటి ప్రత్యేక పరిస్థితులలో, పార్లమెంటు మొదటి సమావేశం 60వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మే 13, 2012న పార్లమెంటు ఆదివారాల్లో కూడా సమావేశమైంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com